# హైడ్రా కమిషనర్ రంగనాథ్ చేసిన వ్యాఖ్యలు విని షాకయ్యా:

# బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఆగ్రహం



- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు రెఫరెండంగా అభివర్ణించిన హైడ్రా కమిషనర్
- రంగనాథ్ రాజకీయ నాయకుడిలా మాట్లాడుతున్నారని వివేకానందగౌడ్ విమర్శలు
- రాజకీయంపై ఆసక్తి ఉంటే ఖద్దర్ దుస్తులు వేసుకోవాలని సూచన

**హైదరాబాద్ పెన్ పవర్:** హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై బీఆర్ఎస్ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానందగౌడ్ శాసనసభలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రంగనాథ్ ప్రజల కోసం పనిచేస్తున్నారా లేక రాజకీయం చేస్తున్నారా అని ప్రశ్నించారు. రంగనాథ్ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలను వివేకానందగౌడ్ శాసనసభలో ప్రస్తావించారు.ఒక ఇంటర్వ్యూలో హైడ్రా పనితీరు గురించి మీడియా ప్రతినిధి ప్రశ్నించగా, జూబ్లీహిల్స్ ఉపఎన్నికలు హైడ్రాకు రెఫరెండంగా పేర్కొన్నారు. దీనితో రంగనాథ్ రాజకీయ

-4 లో

పెన్ పవర్




# అవును...! అవి కూల్చివేతలే..!

- కూల్చివేతల వివరాలకు ఫోన్‌చేసినా స్పందించని "ఎసిపి-చైన్‌మెన్‌లు"..
- చర్యల్లో పసలేదు..అధికారుల్లో పారదర్శకత లేదు..! అందుకే సమాధానం లేదు..!
- నేతల సిఫార్సులుంటే అధికారులు ఏం చేసినా-చెప్పినా అది చట్టమే..!
- భారీ షెడ్లైనా..!ఒప్పంద నిర్మాణాలైనా మినహాయింపు ఎవరి లబ్దికోసం..?
- సామాన్యులు నిర్మించుకున్న చిన్న చిన్న షెడ్లు కూల్చిన టౌన్‌ప్లానింగ్ అధికారులు..!
- అక్రమ నిర్మాణాలు "చిన్నవైనా-పెద్దవైనా" అక్రమమే కదా..!కొందరిపైనే చర్యలెందుకు.?
- బౌరంపేట్‌లో 'డిపిఎస్' ఎదురుగా అక్రమ షెడ్డుదారులు అధికారులకు బంధువులా..?
- బహుదూర్‌పల్లిలో 1500 గజాల అక్రమ షెడ్డుపై పాక్షిక చర్యలు ఎందుకో..!
- తాజా హోటల్ సమీపంలో గ్యాస్ కట్టర్‌లతో, ఫొటోలు, 'పదిలం'గా గోడలకు రంధ్రాలు..
- టౌన్‌ప్లానింగ్ అధికారుల చర్యలు భేష్.. మళ్ళీ ఆ నిర్మాణాలలో పనులు జరగవా..?
- ఇదంతా ఉన్నతాధికారులకు పంపించే 'నివేదికల' కోసమే ఈ అగుపాట్లా..?
- షెడ్డు నిర్మాణ దశలో ప్రారంబం నుండే దుండిగల్ 'ఏసిపి-చైన్‌మెన్'ల దృష్టికి..
- పూర్తయ్యాక ఇప్పుడు పాక్షిక చర్యలు.. ఎవరి మెప్పుకోసం..? ఎవరి లాభాపేక్ష..?

**జాగ్రత్తగా..! నెమ్మదిగా..! పిల్లర్‌లకు తగలకుండా..! ఫొటోషూట్ చర్యలు..!**



బహుదూర్‌పల్లిలో పూర్తిగా కూల్చేసిన కమర్షియల్ షట్టర్‌లు..

-4లో




బహుదూర్‌పల్లి లోని 1500 గజాల భారీ అక్రమ షెడ్డుపై పాక్షిక చర్యలు..

పిల్లి కళ్ళు మూసుకుని పాలు త్రాగినంత మాత్రాన తనను ఎవరూ చూడలేదని అనుకుంటుందట..! అదేవిధంగా ఎవరెన్ని అనుకున్నా మేము చేసేదే చేస్తం.. అనుకున్నదే సాధిస్తామనే ధోరణితో దుండిగల్ సర్కిల్ అధికారులు వ్యవహరిస్తున్నారని స్పష్టమవుతుంది.. దుండిగల్ టౌన్‌ప్లానింగ్ అధికారులకు వచ్చిన సమస్య ఏమిటంటే..! తమ చుట్టూ ఉన్న మున్సిపాలిటీలు ఏదోఒక కూల్చివేతలు జరుపుతున్నారు.. తాము కూడా ఏదో ఒకటి చేయాలని భావించారు కాబోలు..మరోవైపు దుండిగల్ సర్కిల్ సిఎంసి పరిధిలో అలాంటి వాటికి చోటు ఉండదు.. వందలాది అక్రమ కట్టడాలను, నిత్యం పత్రికల్లో వచ్చే శీర్షికలతో.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళినా ప్రయోజనం శూన్యం.. దుండిగల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు గురువారం "పోరు పడలేకనే" ఏసిపి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కూల్చివేతలు జరిపినట్టు ఆరోపణలు వస్తున్నాయి.. వీటిపై నిన్ననే ఫిర్యాదు వచ్చినట్టు చర్యల డ్రామా.. గత రెండు నెలలుగా వార్తలు వచ్చినా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం "పిల్లి-పాల" సామెతను తలపిస్తుంది..

దుండిగల్, పెన్ పవర్, మార్చి 26:

# జీహెచ్ఎంసి సర్క్యులర్.. దుండిగల్ సర్కిల్ బేఖాతర్..

**సర్కిల్ పరిధిలో వందలాది అక్రమ కట్టడాలపై నిర్లక్ష్యం..**



GHMC
GREATER HYDERBAD MUNICIPAL CORPORATION

హైదరాబాద్ మహానగరం వ్యాప్తంగా టౌన్‌ప్లానింగ్ నిర్వాకంతో గతేడాది '2025 మే 2న' ఓకేసు విషయంలో, జీహెచ్ఎంసి కమిషనర్‌కు హైకోర్టు కఠిన చర్యలకు ఉత్తర్వులు జారీచేసింది.. అనధికారిక నిర్మాణాలపై తక్షణ చర్యలు చేపట్టాలని సూచించడంతో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) టౌన్ ప్లానింగ్ విభాగం అత్యవసర సర్క్యులర్ జారీ చేసింది. రిట్ పిటిషన్ నెం. 12889/2025 లో హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలని స్పష్టం చేస్తూ, అనధికార నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించింది.. సర్క్యులర్‌లో పొందు పరిచిన కీలక నిబంధనలు కొత్తేమి కాదు..! టిజి-బిపాస్ చట్టంలో ఉన్నవే.. అయినప్పటికీ చట్టాలు, నిబంధనలు కాలరాస్తున్న అధికారులకి హైకోర్టు ఆర్డర్ చెంప పెట్టు లాంటిది..

అనధికార నిర్మాణాలు గుర్తించిన వెంటనే సీజ్ చేయాలి.. షోకాజ్ నోటీసులు జారీ చేసిన తర్వాత కూడా చర్యలు కొనసాగాలి.. విచారణ పూర్తయ్యే వరకు అక్రమ నిర్మాణాలపై నియంత్రణ ఉండాలి.. జీహెచ్ఎంసి వ్యాప్తంగా ఉన్న కార్యాలయాల్లో పట్టణ ప్రణాళిక అధికారులు ఒకే విధానం అనుసరించి చర్యలు తీసుకోవాలని "సర్క్యులర్"లో స్పష్టమైన మార్గదర్శకాలను కమిషనర్ సూచించారు.. జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, సిటీ ప్లానర్లు, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు.. వివిధ సర్కిల్‌లకు చెందిన టౌన్ ప్లానింగ్ అధికారులు అందరూ ఈ ఆదేశాలను తక్షణమే అమలు చేయాలని స్పష్టం చేశారు.. అమలు చేయకపోతే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.. ఈ ఆదేశాలను పాటించని అధికారులపై: శాఖాపరమైన చర్యలు, క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.. ఈ సర్క్యులర్ అమలు విధానాన్ని హైకోర్టుకు నివేదిక సమర్పించారు.. అయినప్పటికీ దుండిగల్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులకు.. నేతల సిఫార్సులు అమలు చేయడంలో ఉన్న ధ్యాస.. టౌన్‌ప్లానింగ్ చట్టాలు, నిబంధనలు పాటించాలని లేకపోవడం బాధాకరం..



# కంపెనీలేమో ఇక్కడ... సీఎస్ఆర్ నిధులు అక్కడా?:

# కంపెనీల తీరుపై సీఎం రేవంత్ రెడ్డి అసంతృప్తి

-4 లో

- రాష్ట్రానికి మరిన్ని సీఎస్ఆర్ నిధులు రావాలన్న ముఖ్యమంత్రి
- తెలంగాణలో కంపెనీలు ఏర్పాటు చేసి వేరే చోట ఖర్చు పెడితే ఎలా అని ప్రశ్న
- సీఎస్ఆర్ నిధుల సమీకరణ, వినియోగం కోసం ప్రత్యేక విధానాన్ని రూపొందించాలని సూచన
- రాష్ట్రస్థాయిలో సీఎస్ఆర్ సెల్ ఏర్పాటు చేయాలన్న ముఖ్యమంత్రి

## అసెంబ్లీని నడపలేక రేవంత్ రెడ్డి

# ప్రభుత్వం క్రీడాపోటీల ఎత్తుగడ వేసింది



- ఈ నెల 28, 29 తేదీల్లో క్రీడాపోటీలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం
- కీలక పద్దులపై చర్చలు కొనసాగుతుండగా ఆటలపోటీలు ఎందుకని కేటీఆర్ ప్రశ్న
- ప్రతిపక్షాల ప్రశ్నలకు సమాధానం చెప్పలేక క్రీడాపోటీలు నిర్వహిస్తున్నారని విమర్శ

-4 లో

# దావోస్ పర్యటన ద్వారా రూ.2.19 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి

- పెట్టుబడిదారులతో 44 ఎంవోయూలు కుదుర్చుకున్నట్లు తెలిపిన మంత్రి
- ఒప్పందాలపై శ్వేతపత్రం విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్నామన్న శ్రీధర్ బాబు
- విపక్షాలు విషప్రచారం చేస్తున్నాయని మండిపాటు




హైదరాబాద్ పెన్ పవర్:దావోస్ పర్యటన ద్వారా తెలంగాణ రాష్ట్రానికి రూ. 2.19 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. ప్రభుత్వం పెట్టుబడిదారులతో 44 ఎంవోయూలను కుదుర్చుకుందని తెలిపారు. ఈ ఒప్పందాలపై శ్వేతపత్రం విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. దావోస్ పెట్టుబడులు, ఎంవోయూలపై శాసనసభలో విపక్ష సభ్యులు అడిగిన ప్రశ్నలు, విమర్శలకు మంత్రి సమాధానం ఇచ్చారు.రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకువస్తుంటే విపక్షాలు ఓర్వలేక విషప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. స్వార్థ రాజకీయాల కోసం చేసే ఆరోపణలు రాష్ట్ర అభివృద్ధికి విఘాతం కలిగిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. దావోస్ పర్యటనలో కుదుర్చుకున్న ఒప్పందాల ద్వారా 68,150 మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు. ఒప్పందాల ద్వారా బహుళ ప్రయోజనాలు, పెద్ద ఎత్తున ఉద్యోగాలు వస్తాయని అన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# అవును..! అవి కూల్చివేతలే..!

బహుదూర్‌పల్లి లోని 1500 గజాల భారీ అక్రమ షెడ్డుపై పాక్షిక చర్యలు..



- కూల్చివేతల వివరాలకు ఫోన్‌చేసినా స్పందించని "ఎసిపి-చైన్‌మెన్‌లు"..
- చర్యల్లో పసలేదు..అధికారుల్లో పారదర్శకత లేదు..! అందుకే సమాధానం లేదు..!
- నేతల సిఫార్సులుంటే అధికారులు ఏం చేసినా-చెప్పినా అది చట్టమే..!
- భారీ షెడ్లైనా..!ఒప్పంద నిర్మాణాలైనా మినహాయింపు ఎవరి లబ్దికోసం..?
- సామాన్యులు నిర్మించుకున్న చిన్న చిన్న షెడ్లు కూల్చిన టౌన్‌ప్లానింగ్ అధికారులు..!
- అక్రమ నిర్మాణాలు "చిన్నవైనా-పెద్దవైనా" అక్రమమే కదా..!కొందరిపైనే చర్యలెందుకు.?
- బౌరంపేట్‌లో 'డిపిఎస్' ఎదురుగా అక్రమ షెడ్డుదారులు అధికారులకు బంధువులా..?
- బహుదూర్‌పల్లిలో 1500 గజాల అక్రమ షెడ్డుపై పాక్షిక చర్యలు ఎందుకో..!
- తాజా హోటల్ సమీపంలో గ్యాస్ కట్టర్‌లతో, ఫొటోలు, 'పదిలం'గా గోడలకు రంధ్రాలు..
- టౌన్‌ప్లానింగ్ అధికారుల చర్యలు భేష్.. మళ్ళీ ఆ నిర్మాణాలలో పనులు జరగవా..?
- ఇదంతా ఉన్నతాధికారులకు పంపించే 'నివేదికల' కోసమే ఈ అగుపాట్లా..?
- షెడ్డు నిర్మాణ దశలో ప్రారంబం నుండే దుండిగల్ 'ఏసిపి-చైన్‌మెన్'ల దృష్టికి..
- పూర్తయ్యాక ఇప్పుడు పాక్షిక చర్యలు.. ఎవరి మెప్పుకోసం..? ఎవరి లాభాపేక్ష..?

## జాగ్రత్తగా..! నెమ్మదిగా..! పిల్లర్‌లకు తగలకుండా..! ఫొటోషూట్ చర్యలు..!



బహుదూర్‌పల్లిలో పూర్తిగా కూల్చేసిన కమర్షియల్ షట్టర్‌లు..

దుండిగల్ సర్కిల్ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అక్రమ నిర్మాణాలపై టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చివేతలు జరిపారు.. పత్రికల్లో వస్తున్న కథనాలకు స్పందించిన దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వెంకటేష్ నాయక్ ఆదేశాలతో, టౌన్‌ప్లానింగ్ అధికారి "అసిస్టెంట్ సిటీ ప్లానర్" (ఏసిపి) శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం మూడు అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపట్టారు.. గండిమైసమ్మలోని తాజా హోటల్ వద్ద గతంలో సీజ్ చేసిన నిర్మాణంలో యధేచ్ఛగా పనులు చేస్తుండగా, గురువారం ఏసిపి శ్రీనివాస్ పర్యవేక్షణలో టౌన్‌ప్లానింగ్ సిబ్బంది జేసిబితో, రోడ్డు బ్రేకర్ యంత్రాలను ఉపయోగించి కూల్చివేతలు జరిపారు.. ఆ చర్యల సమయంలో అధికారులు సమయస్ఫూర్తితో వ్యవహరించారని తెలుస్తోంది.. అక్రమ కట్టడాలు వెంటనే మళ్ళీ నిర్మించుకునే వెసులుబాటు కల్పిస్తూ, పాక్షిక చర్యలతో మమా: అనిపించారు.. ఇప్పటి వరకు ఇలాంటి చర్యలు చేపట్టిన నిర్మాణాలు, మళ్ళీ పూర్తిగా నిర్మించి వాడుకలోకి వచ్చిన వందలాది అక్రమ నిర్మాణాలు సాక్ష్యాలుగా ఉన్నాయి..

పిల్లి కళ్ళు మూసుకుని పాలు త్రాగినంత మాత్రాన తనను ఎవరూ చూడలేదని అనుకుంటుందట..! అదేవిధంగా ఎవరెన్ని అనుకున్నా మేము చేసేదే చేస్తం.. అనుకున్నదే సాధిస్తామనే ధోరణితో దుండిగల్ సర్కిల్ అధికారులు వ్యవహరిస్తున్నారని స్పష్టమవుతుంది.. దుండిగల్ టౌన్‌ప్లానింగ్ అధికారులకు వచ్చిన సమస్య ఏమిటంటే..! తమ చుట్టూ ఉన్న మున్సిపాలిటీలు ఏదోఒక కూల్చివేతలు జరుపుతున్నారు.. తాము కూడా ఏదో ఒకటి చేయాలని భావించారు కాబోలు..మరోవైపు దుండిగల్ సర్కిల్ సిఎంసి పరిధిలో అలాంటి వాటికి చోటు ఉండదు.. వందలాది అక్రమ కట్టడాలను, నిత్యం పత్రికల్లో వచ్చే శీర్షికలతో.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళినా ప్రయోజనం శూన్యం.. దుండిగల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు గురువారం "పోరు పడలేకనే" ఏసిపి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కూల్చివేతలు జరిపినట్టు ఆరోపణలు వస్తున్నాయి.. వీటిపై నిన్ననే ఫిర్యాదు వచ్చినట్టు చర్యల డ్రామా.. గత రెండు నెలలుగా వార్తలు వచ్చినా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం "పిల్లి-పాల" సామెతను తలపిస్తుంది..

దుండిగల్, పెన్ పవర్, మార్చి 26:





## బహుదూర్‌పల్లిలో..! కమర్షియల్ షట్టర్‌లు..!

బహుదూర్‌పల్లిలోని గ్రీన్‌హిల్స్ కాలనీకీ వెళ్ళేదారిలో నిర్మించిన కమర్షియల్ షట్టర్‌లపై గత రెండు నెలలుగా పలు పత్రికల్లో కథనాలు వచ్చాయి.. బహుశా నోటీసుల ప్రక్రియతో కొంత ఆలస్యం జరిగింది కావచ్చు పర్వాలేదు.. గురువారం సంబంధిత కమర్షియల్ అక్రమ షట్టర్‌లు పూర్తిగా కూల్చేశారు.. ఈ విషయంలో ఏసిపి శ్రీనివాస్‌ను అభినందించాలి.. కానీ పత్రికల్లో వార్తలు వస్తేనే చర్యలు తీసుకుంటారా..? చైన్‌మెన్‌ల నియామకం ఎందుకు..? నిత్యం ఫీల్డ్‌లో తిరుగున్నది అక్రమ నిర్మాణాల జాబితా కోసం కాదా..?

## సిఫార్సుల భారీ అక్రమ షెడ్డుపై పాక్షిక చర్యలు..?

దుండిగల్ సర్కిల్ బహుదూర్‌పల్లి విలేజ్‌లో నర్సాపూర్ హైవేపై ఉన్న 1500 గజాల భారీ అక్రమ షెడ్డుకు, అధికారపార్టీ యువనాయకుని సిఫార్సులు ఉన్నాయి.. దీంతో ఏదో నాలుగు ఐరన్ రేకులు, ఓ చిన్న డ్యామేజ్ చేసి కూల్చివేతల ఫొటోలు పంపించారు.. ముఖ్యంగా ఈ షెడ్డుపై ఏసిపి శ్రీనివాస్ ఉదాసీనత కూడా తెలియజేయాలి.. సుమారు 1500 గజాల్లో నిర్మించే ఈ షెడ్డు నిర్మాణం గురించి ఆరంభనుండి వివరణ కోసం, దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్, టౌన్‌ప్లానింగ్ అధికారి ఏసిపి, టౌన్‌ప్లానింగ్ సెక్షన్ సూపర్‌వైజర్, ఇద్దరు చైన్‌మెన్‌ల దృష్టికి తీసుకెళ్ళినా ఏమి తెలియనట్టు వ్యవహరించారు.. ఎందుకంటే అధికారమే శాసనంగా సిఫార్సులు ఉన్నాయని, వెనకడుగు వేశారు.. "పెన్ పవర్" దినపత్రికలో వరుస కథనాలు ప్రచురించి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ట్విట్టర్(ఎక్స్) ద్వారా పలుమార్లు దృష్టికి తీసుకెళ్ళగా, 'పోరు పడలేక' అన్నట్టు తూతూ మంత్రంగా 'ఫొటోషూట్' చర్యలతో మమా: అనిపించారు.. ఎందుకు తొందర.. ఓనాలుగు రోజులు గడిస్తే తెలిస్తుంది ముందర..!















గండిమైసమ్మలోని తాజా హోటల్ సమీపంలో పదిలమైన చర్యలు..

## అసెంబ్లీని నడపలేక రేవంత్ రెడ్డి ప్రభుత్వం క్రీడాపోటీల ఎత్తుగడ వేసింది: కేటీఆర్

హైదరాబాద్ పెన్ పవర్: ప్రభుత్వం సభను నడపలేక క్రీడా పోటీల ఎత్తుగడ వేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. అసెంబ్లీ లాబీల్లో ఆయన పిచ్చాపాటిగా మాట్లాడుతూ, సభలో కీలకమైన అంశాలపై చర్చను పక్కన పెట్టేందుకు ప్రభుత్వం ఆటల పోటీలకు తెరతీస్తోందని విమర్శించారు. ఇరిగేషన్ వంటి కీలక పద్దులపై చర్చలు కొనసాగుతుండగా ఆటల పోటీలు ఎందుకని ప్రశ్నించారు.ఇదే అంశాన్ని తాను అసెంబ్లీ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకువెళ్లానని, కానీ ఆయన వద్ద సమాధానం లేదని అన్నారు. ప్రభుత్వం ప్రజాసమస్యలపై బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కీలకమైన అంశాలపై చర్చలు జరగాల్సిన సమయంలో ప్రజాప్రతినిధులు మైదానాలలో ఆటలు ఆడుతుంటే ప్రజలు ఏమనుకుంటారని ప్రశ్నించారు. ఈ నెల 28, 29 తేదీల్లో ప్రభుత్వం క్రీడాపోటీలను నిర్వహించాలని నిర్ణయించిందని, కీలక అంశాలపై చర్చ సమయంలో ఇది సరికాదని అభిప్రాయపడ్డారు.అసెంబ్లీ సమావేశాలను ఆటలపోటీల వంటి కార్యక్రమాల పేరుతో వృథా చేయడమేమిటని ఆవేదన వ్యక్తం చేశారు. పద్దులపై చర్చకు సమయం కేటాయించకుండా సభా సమయాన్ని క్రీడలకు కేటాయించడం అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. ప్రతిపక్షాల ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక క్రీడాపోటీలు నిర్వహిస్తున్నారని ఎద్దేవా చేశారు.

## కంపెనీలేమో ఇక్కడ... సీఎస్ఆర్ నిధులు అక్కడా?: కంపెనీల తీరుపై సీఎం రేవంత్ రెడ్డి అసంతృప్తి

ఇప్పటివరకు వచ్చిన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్) నిధులు ఆశించినస్థాయిలో లేవని, తెలంగాణలో కంపెనీలను ఏర్పాటు చేసి, సీఎస్ఆర్ నిధులను వేరేచోట ఖర్చు పెడితే ఎలా అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రానికి మరిన్ని నిధులు రావాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రంలోని కార్పొరేట్ సంస్థలు, పరిశ్రమలు ఇచ్చే నిధులు వినియోగమయ్యేలా చూడాలని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు అధికారులతో సమావేశమయ్యారు. సీఎస్ఆర్ నిధుల సమీకరణతో పాటు, వాటిని సమర్థంగా వినియోగించేందుకు ప్రత్యేక విధానాన్ని రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సీఎస్ఆర్ నిధులతో రాష్ట్రంలో అభివృద్ధి, ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టే కార్పొరేట్ సంస్థలను ప్రభుత్వం తరఫున అభినందించాలని సూచించారు. రాష్ట్రస్థాయిలో సీఎస్ఆర్ సెల్ ఏర్పాటు చేయాలని అన్నారు.రాష్ట్రంలోని కార్పొరేట్ కంపెనీలు సీఎస్ఆర్ నిధులతో చేపడుతున్న కార్యక్రమాల వివరాలు, సీఎస్ఆర్ ద్వారా చేపట్టేందుకు వీలున్న కార్యక్రమాల వివరాలను సమన్వయం చేసే బాధ్యత ఈ సెల్ నిర్వహిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వానికి, కార్పొరేట్ సంస్థలకు అనుసంధానంగా ఉండేలా సీఎస్ఆర్ పోర్టల్‌ను సిద్ధం చేయాలని అన్నారు. వివిధ రాష్ట్రాల్లో సీఎస్ఆర్ నిధుల సమీకరణకు అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని అన్నారు.

## హైడ్రా కమిషనర్ రంగనాథ్ చేసిన వ్యాఖ్యలు విని షాకయ్యా:

-3 పేజి తరువాయి

నాయకుడిలా మాట్లాడుతున్నారని విమర్శలు వెల్లువెత్తాయి. వివేకానంద గౌడ్ అసెంబ్లీలో మాట్లాడుతూ, రంగనాథ్ మాట్లాడిన ఇంటర్వ్యూను చూసి షాకయ్యానని అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను హైడ్రాకు రెఫరెండంగా ఒక అధికారి చెప్పడమేమిటని ప్రశ్నించారు. ఆయన ప్రజల కోసం పనిచేస్తున్నారా లేక రాజకీయం చేస్తున్నారా అని నిలదీశారు. ఆయనకు రాజకీయం చేయాలనే ఆసక్తి అంతగా ఉంటే ఖద్దర్ దుస్తులు వేసుకుంటే సరిపోతుంది కదా అని ఎద్దేవా చేశారు. తమలాంటి రాజకీయ నాయకులు ఈరోజు ఉండి రేపు వెళ్లిపోతారని, కానీ అధికారులు సంవత్సరాల కొద్ది పనిచేస్తారని వివేకానందగౌడ్ తెలిపారు.

# ఆరోగ్యశ్రీ బకాయిలు 727 కోట్లు మాత్రమే

**హైదరాబాద్ పెన్ పవర్:**
2023 డిసెంబర్ 6 వరకు ఆరోగ్య శ్రీ కోసం ప్రతి నెల యావరేజ్ గా 89 కోట్లు ఖర్చు చేస్తోంది. రాజీవ్ ఆరోగ్య బకాయిల వల్ల ప్రైవేట్ ఆస్పత్రులు మూత పడుతున్నాయని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గురువారం నాడు అయన శాసనసభలో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఆరోగ్య శ్రీ బకాయిలు పెట్టింది.. వాటిని మోస్తూనే ఐదు లక్షల నుంచి 10 లక్షలకు 7.12 .2023 నాఇటి 627 పెండింగ్ బకాయిలుగా మాకు భారం వచ్చింది. 8.12.2023 నాటికి ఈ రోజు వరకు 2408 కోట్ల రూపాయలను ఆరోగ్య శ్రీ కోసం చెల్లించాం . ఇందులో ప్రభుత్వ ఆస్పత్రుల్లో 927 కోట్ల, ప్రైవేట్ ఆస్పత్రులకు 1480 కోట్లు చెల్లించాం. ఈ రోజు వరకు ఉన్న బకాయిలు 727 కోట్లు మాత్రమే నని అన్నారు.

ఎప్పటికప్పుడు చెల్లింపులు జరుగుతున్నాయి.. గత ప్రభుత్వం ఇచ్చిన బకాయిలే పెండింగ్ లో ఉంటున్నాయి. ప్రైవేట్ ఆస్పత్రులకు ఆరోగ్య శ్రీ బకాయిలు చాలా తక్కువగా ఉన్నాయి. ఆరోగ్య శ్రీ చెల్లింపులపైన అపోహలు కల్పిస్తున్నారు. ఆరోగ్య శ్రీ లో వైద్యం చేయించుకునే రోగుల సంఖ్య పెరిగింది. ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్ ల విషయంలో గతంలో అనేక అవకతవకలు జరిగాయి. కొంత మంది ఈ సహాయ నిధి దుర్వినియోగం చేశారు..కేసులు కూడా పెట్టారు. మా ప్రభుత్వం వచ్చాక ఆన్ లైన్ లో సీఎం రిలీఫ్ ఫండ్ అప్లై చేసేలా చర్యలు తీసుకున్నాం. దీని వల్ల అక్రమాలకు అవకాశం లేకుండా పోయింది. ఇప్పటి వరకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద 2046 కోట్ల రూపాయలు ఇచ్చాం. ఆరోగ్య శ్రీ కోసం 2400 కోట్ల ఖర్చు చేశాం. పేదల వైద్యం కోసం 4500 కోట్ల రూపాయలను మా ప్రభుత్వం ఇచ్చింది. రాష్ట్రంలో 35 మెడికల్ కాలేజీలు ఉన్నాయి.. టీచింగ్ కాలేజీలకు రోగులురావడం లేదు. పేదలు వైద్యం కోసం వెళ్లే దగ్గర సరైన డాక్టర్లు లేవు. ఆరోగ్య శ్రీ రోగులను టీచింగ్ కాలేజీలకు పంపించే ఆలోచన చేస్తున్నాం. ఆరోగ్య శ్రీతో పాటు సీఎం రిలీఫ్ ఫండ్ ను ఈ ఆస్పత్రులకు ఇస్తాం. దీని వల్ల ఆస్పత్రుల నిర్వహణ మెరుగు పడుతుంది. ఆస్పత్రుల నిర్వహణను గ్రూప్ వన్ అధికారికి ఇవ్వాలని అనుకుంటున్నామని అన్నారుత.



02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## మళ్లీ మొదటికొచ్చిన ఎమ్మెల్యేల ఫిరాయింపుల కథ

**హైదరాబాద్, మార్చి 26, పెన్ పవర్:** తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో స్పీకర్ తీర్పు వెలువరించినా.. ఈ వ్యవహారం మళ్లీ హైకోర్టుకు ఎక్కింది. స్పీకర్ నిర్ణయాన్ని రద్దు చేయాలంటూ.. పలువురు పిటిషన్లు దాఖలు చేశారు. తాజాగా ఆ పిటిషన్లను స్వీకరించిన తెలంగాణ హైకోర్టు.. కౌంటర్ దాఖలు చేయాలని.. తాజాగా ఏడుగురు ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చింది. ఇక ఇప్పటికే ఇదే వ్యవహారంలో దానం నాగేందర్‌కు హైకోర్టు నోటీసులు ఇవ్వడంగమనార్హం.తెలంగాణలో పార్టీ ఫిరాయింపుల వ్యవహారం ఒక కొలిక్కి రావడం లేదు. పార్టీ మారినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది ఎమ్మెల్యేల వ్యవహారంలో ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలతో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్.. తన నిర్ణయాన్ని ఇటీవలె వెలువరించారు. 10 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారినట్లు ఎలాంటి ఆధారాలు లేవని పేర్కొంటూ.. వారిపై అనర్హత వేటువేయాలంటూ దాఖలైన పిటిషన్లను అన్నింటినీ కొట్టిపారేశారు. అయితే ఈ వ్యవహారం అంతటితో ఆగడం లేదు. స్పీకర్ గడ్డం ప్రసాద్ తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ.. మళ్లీ హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి.ఈ క్రమంలోనే పిటిషనర్లు చేసిన వాదనలను విన్న తెలంగాణ హైకోర్టు.. పార్టీ మారినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏడుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు తాజాగా నోటీసులు జారీ చేసింది. అదే సమయంలో స్పీకర్ గడ్డంప్రసాద్‌కు కూడా నోటీసులు ఇచ్చింది. ఇప్పటికే ఇదే వ్యవహారంలో దానం నాగేందర్‌కు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తాజాగా కాలే యాదయ్య, అరికెపూడి గాంధీ, ప్రకాష్ గౌడ్, పోచారం శ్రీనివాస్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, తెల్లం వెంకట్రావులపై పిటిషన్‌లు దాఖలు అయ్యాయి.ఈ పిటిషన్లపై విచారణ జరిపిన హైకోర్టు.. కౌంటర్ దాఖలు చేయాలని ఈ ఏడుగురు ఎమ్మెల్యేలకు ఆదేశాలు ఇచ్చింది. ఈ పార్టీ ఫిరాయింపులవ్యవహారంలో తదుపరి విచారణను వచ్చే నెల 16వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు హైకోర్టు స్పష్టం చేసింది. దీంతో పూర్తి అయిపోయింది అనుకున్న తెలంగాణ పార్టీ ఫిరాయింపుల కేసు మళ్లీ మొదటికివచ్చింది.మరోవైపు.. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కు ఇటీవలె హైకోర్టు నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. బీజేపీ శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టినహైకోర్టు నోటీసులు ఇచ్చింది. దానం నాగేందర్.. బీఆర్ఎస్ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరారని.. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ బీఫామ్‌పై లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి పోటీ చేసిఓడిపోయినట్లు తెలిపారు. అయినప్పటికీ దానం నాగేందర్ పార్టీ మారినట్లు ఆధారాలు లేవని అనర్హత పిటిషన్‌ను స్పీకర్ గడ్డం ప్రసాద్ కొట్టేశారని.. ఈ నేపథ్యంలోనే స్పీకర్ ఇచ్చిన తీర్పును కొట్టేయాలని తన పిటిషన్‌లో ఏలేటి మహేశ్వర్ రెడ్డి హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు.

## ఏ బంకు చూసినా కిటకిట

**హైదరాబాద్ పెన్ పవర్:** నగరంలో పెట్రోల్ బంకులలో చాంతాడంత బారులు కనిపిస్తున్ననాయి. కొన్నిచోట్ల నో స్టాక్ బోర్డులు పెట్టారు.
గురువారం ఉదయం నుంచే ప్రధాన పెట్రోల్ బంకుల్లో వాహనదారులు కిక్కిరిసిపోయారు. పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో చమురు దిగుమతులపై వదంతులు షికార్లు చేస్తుండటంతో వాహనదారులు ట్యాంక్ ఫుల్ చేయించుకున్నారు. బాటిళ్లు, క్యాన్లలో అదనంగా నిల్వ చేసుకునేందుకు ఎగబడ్డారున్న

## బీసీ సబ్ ప్లాన్ అమలు చేయాలి

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నిరసన

**హైదరాబాద్ పెన్ పవర్:**
బీసీ సబ్ ప్లాన్ అమలు చెయ్యాలని డిమాండ్ చేస్తూ గన్ పార్క్ వద్ద బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్ల కార్డ్స్ తో నిరసన కు దిగారు. ఈ నిరసన కార్యక్రమంలెఓ మాజీ మంత్రి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు, ఎమ్మెల్యేలు పాల్గోన్నారు.
మాజీ మంత్రి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ వెనుకబడిన తరగతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది. వెనుకబడిన తరగతుల సంక్షేమానికి ప్రతి వార్షిక బడ్జెట్ లో 20 వేల కోట్ల రూపాయలు ఖర్చు పెడతామని చెప్పి మోసం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో బీసీ లను మోసం చేశారు. సిద్ధరామయ్యతో అబద్ధాలు చెప్పించి బీసీ ల ఓట్లు దండుకున్నారు. బీసీ సబ్ ప్లాన్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మొదటి ఏడాది 800 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తామని మోసం చేశారని ఆర్పించారు.
రెండో ఏడాది 11 వేల కోట్ల రూపాయల నిధులు కేటాయించి , 3 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. బీసీ లను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పే టైం వచ్చింది. రాబోయే రోజుల్లో బీసీజ లే కాంగ్రెస్ ప్రభుత్వంను బొంద పెడుతారు. లోకల్ బాడీ ఎలక్షన్ లో జనరల్ స్థానాల్లో బీసీ లు గెలిచారు, అది దేనికి సంకేతమో అర్థం చేసుకోవాలి. బీసీ విద్యార్థుల కోసం, దీజ గురుకులాలను పెద్ద ఎత్తున ఇచ్చిన ఘనత కేసీఆర్ ది. లింగయ్య యాదవ్ ను రాజ్యసభకు పంపించారు. అనేక మంది బీసీ నాయకులకు అత్యున్నత పదవులు ఇచ్చిన ఘనత కేసీఆర్ ది. కుల వృత్తులను ప్రోత్సహించన ఘనత కేసీఆర్ ది. 9 షెడ్యూల్ లో చేర్చకుండా బీసీ లకు 42 శాతం రిజర్వేషన్ పేరుతో మోసం చేశారు. కాంగ్రెస్ పార్టీ మోసాలను బీసీ లు గమనిస్తూనే ఉన్నారు, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీనీ బొంద పెట్టడం ఖాయయని అన్నారు.

## రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి

**హైదరాబాద్ పెన్ పవర్:** నిర్మల్ నుంచి బయలుదేరి నెల్లూరుకు వెళ్తున్న ఒక ప్రైవేట్ బస్సు మార్కాపురం జిల్లా రాయవరం సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురైన ఘటనపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న పలువురు ప్రయాణికులు మృతి చెందడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు.ప్రమాదంలో గాయపడిన వారికి తగిన వైద్య చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ముఖ్యమంత్రి గారు ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఆంధ్రప్రదేశ్ సీఎస్ తో మాట్లాడారు.

# హైదరాబాద్ లో కల్తీల మయం

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ ప్రజలు ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న కల్తీ మాఫియా గుట్టును టాస్క్‌ఫోర్స్ పోలీసులు రట్టు చేశారు. బుధవారం నగరం అంతటా నిర్వహించిన వరుస దాడుల్లో కుళ్లిన కోడిగుడ్లు, నిషేధిత రసాయనాలు వాడుతున్న బేకరీ కేంద్రాలు, అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీ యూనిట్లను సీజ్ చేశారు. ఈ ఆపరేషన్‌లో మొత్తం 9 మందిని అరెస్టు చేసి, భారీ మొత్తంలో కల్తీ పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు.







### కల్తీ మాఫియా ఆగడాలు- అసలేం జరిగింది?

హైదరాబాద్ నగరంలోని వివిధ ప్రాంతాల్లో అత్యంత అపరిశుభ్రమైన వాతావరణంలో ప్రాణాంతక రసాయనాలను ఉపయోగిస్తూ ఆహార పదార్థాలను తయారు చేస్తున్న కేంద్రాలపై సిటీ టాస్క్ ఫోర్స్, ఫుడ్ అడల్టరేషన్ విభాగం అధికారులు మెరుపుదాడులు చేశారు. ఈ దాడుల్లో ప్రదానంగా చిన్న పిల్లలు ఇష్టంగా తినే బిస్కెట్లు, కేకులు మొదలు కొవి ప్రతి వంటింట్లో వాడే అల్లం వెల్లుల్లి పేస్ట్ వరకు అన్నీ కల్తీ అవుతున్నట్టు అధికారులు గుర్తించారు. కాటేదాన్, రాజేంద్రనగర్, బేగంబజార్, అత్తాపూర్ వంటి ప్రాంతాల్లో సాగుతున్న ఈ అక్రమ దందాను అరికట్టేందుకు పోలీసులు ఏక కాలంలో దాడులు చేసి నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఆపరేషన్‌లో లక్షల రూపాయల విలువలైన నిల్వలు, యంత్రాలు సీజ్ చేశారు.

### కుళ్లిన కోడిగుడ్లుతో బేకరీ పదార్థాల తయారీ!

కాటేదాన్ పరిధిలోని ఇంద్ర సొసైటీలో ఉన్న మధురై మీనాక్షి ఫుడ్ కంపెనీలో జరుగుతున్న తయారీ విధానం అధికారులను విస్మయానికి గురి చేసింది. ఇక్కడ చిన్న పిల్లలు తినే డోనట్సన్, కేకులు, బిస్కెట్ల తయారీలో పచ్చిగా కుళ్లిపోయిన కోడిగుడ్లను వాడుతున్నట్టు గుర్తించారు. ఈ కేంద్రంలో సూపర్‌వైజర్ అఫ్రిదీ అన్సారీ, మేనేజ్ యాసిన్, ఖత్రేషన్ అనే ముగ్గురు వ్యక్తులు కలిసి ఈ కల్తీ వ్యాపారాన్ని నడుపుతున్నారు. వీరి వద్ద నుంచి
కుళ్లిన కోడిగుడ్లు, పాడైపోయిన డోన్స్, కేకులు, డాల్డా, మిల్క్ పౌడర్, సోడియం బెంజోయెట్ , సోర్బిక్ యాసిడ్, పొటాషియం, సోర్బేట్, అమ్మోనియా సల్ఫేట్ వంటి ప్రమాదకర రసాయనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ రసాయనాలు మోతాదుకు మించి వాడటం వల్ల ప్రజల ఆరోగ్యం, ముఖ్యంగా పిల్లల నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోందని అధికారులు చెబుతున్నారు.

### యాసిడ్లతో అల్లం వెల్లుల్లి పేస్ట్ కల్తీ

నిత్యం ఇంట్లో వాడే అల్లం వెల్లుల్లి పేస్టను కూడా ఓ బ్యాచ్ విషతుల్యం చేస్తున్నారు. రాజేంద్రనగర్, ఎంఎం పహాడీ ప్రాంతాల్లో డెక్కన్ ట్రేడర్స్ పేరుతో రెండు గోడౌన్లను నడుపుతున్న సోహెల్ చానియా, రహీమ్ చరానియా,
అమిత్ చరానియాను పోలీసులు అరెస్టు చేశారు. వీరు తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం పొందాలనే ఉద్దేశంతో శాంటానిక్ యాసిడ్, ఎసిటిక్ యాసిడ్, సింథటిక్ ఫుడ్ కలర్లను వాడుతున్నారు. అల్లం, వెల్లుల్లి కంటే ఎక్కువగా వెల్లుల్లి పొట్టును కలిపి ఈగలు ముసురుతున్న అత్యంత అపరిశుభ్రమైన వాతావరణంలో పేస్ట్ తయారు చేస్తున్నారు. సుమారు 70 క్వింటాళ్ల కల్తీ పేస్టను, యాసిడ్ టిన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ
పేస్టను నగరంలోని హోల్‌సేల్ దుకాణాలకు, క్యాటరింగ్ సర్వీస్‌లకు సరఫరా చేస్తున్నట్టు దర్యాప్తులో తేలింది.

### బ్రాండెడ్ పేరుతో నాసిరకం కొబ్బరి పొడి

బేగం బజార్‌లో చేతక్ అనే ప్రముఖ బ్రాండ్ పేరుతో నాసిరకం కొబ్బరి పొడిని విక్రయిస్తున్న నకుల్ మరోటియా అనే వ్యక్తిని గోషామహల్ పోలీసులు అరెస్టు చేశారు. అతను కర్నాటక నుంచి అత్యంత తక్కువ ధరకు లభించే నాణ్యత లేని కొబ్బరి పొడిని తెచ్చి, బ్రాండెడ్ కవర్లో ప్యాకింగ్ చేసి మార్కెట్‌లో విక్రయిస్తున్నాడు. సుమారు 21 లక్షల విలువై 8,300కిలోల కొబ్బరి పొడిని పోలీసులు సీజ్ చేశారు.

### నకిలీ ఐస్‌క్రీమ్ పార్లర్ల ఆగడాలు

అత్తాపూర్‌లో జైబోలేనాథ్ అనే పేరుతో ఎలాంటి అనుమతులు లేకుండానే ఐస్‌క్రీమ్ పార్లర్‌ను నిర్వహిస్తున్న కేంద్రంపై కూడా అధికారులు దాడులు చేశారు. అసలైన కంపెనీ పేరును వాడకుంటూ ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బసే
రంగులు, తక్కువ నాణ్యత గల క్రీములో ఐస్‌క్రీమ్ తయారు చేస్తున్నారు. అసలైన కంపెనీ యాజమాన్యం ఫిర్యాదు చేయడంతో ఇద్దర్ని అరెస్టు చేశారు.

# ఏప్రిల్ 1 నుంచి మూత పడనున్నచికెన్ షాపులు



**హైదరాబాద్, మార్చి 26, పెన్ పవర్:**
ఇది మాంసం ప్రియులకు బ్యాడ్‌న్యూస్. ఎందుకంటే వచ్చే నెల 1 నుంచి రాష్ట్రంలో చికెన్ షాపులు మూతపడనున్నాయి. పౌల్ట్రీ కంపెనీలు ఇచ్చే కమీషన్, మార్జిన్ భారీగా తగ్గించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్న చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్.. ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో ఏప్రిల్ 1 నుంచి తెలంగాణ వ్యాప్తంగా చికెన్ షాప్‌లు మూతపడనున్నాయి. దీనిపై పౌల్ట్రీ కంపెనీలు ఇప్పుడు ఏ విధంగా స్పందిస్తాయి అనేది తీవ్ర ఉత్కంఠను రేపుతోంది.ప్రస్తుతం రాష్ట్రంలో చికెన్ ధరలు మండిపోతున్నాయి. కిలో చికెన్ ఏకంగా రూ.320 నుంచి రూ.370 వరకు విక్రయిస్తున్నారు. వేసవి కాలంలో కోళ్లు చనిపోవడం, ఇతర కారణాలతో చికెన్ ధరలు భారీగాపెరిగాయి. అదే సమయంలో కోడి గుడ్ల ధరలు మాత్రం భారీగా పడిపోయాయి. కొన్ని రోజుల క్రితం ఒక్క కోడి గుడ్డు రూ.8 వరకు అమ్మగా.. ఇప్పుడు వాటి ధరలు రూ.5కు దిగి వచ్చాయి. కానీ కోడి మాంసం ధరలుమాత్రం రోజురోజుకూ పెరుగుతున్నాయి. అయినా ఆదివారం వచ్చిందంటే చాలు.. ప్రతీ ఇంట్లో మాంసం తప్పకుండా ఉండాల్సిందే. అయితే మటన్ ధరలు ఏకంగా రూ.1000 ఉండటంతో.. సామాన్యులు చికెన్‌తో అడ్జస్ట్ అవుతున్నారు. కానీ ఇప్పుడు చికెన్ ధరలు కూడా పెరిగిపోవడంతో ఏం చేయాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు.ఇలాంటి పరిస్థితుల్లో తెలంగాణ చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్ తాజాగా మరో పిడుగు లాంటినిర్ణయం తీసుకుంది. చికెన్ దుకాణాలకు ఇచ్చే మార్జిన్, కమీషన్‌ను పౌల్ట్రీ కంపెనీలు భారీగా తగ్గించడంతో వారు గుర్రుగా ఉన్నారు. ఈ నేపథ్యంలోనే పౌల్ట్రీ కంపెనీల నిర్ణయంపై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ.. రాష్ట్ర వ్యాప్తంగాచికెన్ షాప్‌లను మూసివేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలోనే ఏప్రిల్ 1వ తేదీ నుంచి తెలంగాణలో చికెన్ షాపులను బంద్ చేయాలని నిర్ణయించారు.ఏప్రిల్ 1 నుంచి చికెన్ దుకాణాలు బంద్ చేయడానికి సంబంధించిఇప్పటికే హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. పౌల్ట్రీ కంపెనీలు ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయాల కారణంగా చిరు వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారని తమ ఆవేదన వ్యక్తం చేశారు.మార్జిన్, కమీషన్ పెంచే వరకు తాము చేస్తున్న పోరాటాన్ని ఆపేది లేదని చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్ స్పష్టం చేసింది.ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా చికెన్ ధరలు ఆకాశాన్ని అంటుతున్నప్పటికీ.. అమ్మకం దారులకువచ్చే లాభాలు మాత్రం భారీగా తగ్గిపోయాయని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు.. వేసవి కాలం, ప్రస్తుత అంతర్జాతీయ ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ఉత్పత్తి వ్యయం పెరగడంతోపాటు.. ఆ భారం అంతా తమపైనే పడుతోందని చికెన్ షాప్ యజమానులు ఆరోపిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, పౌల్ట్రీ కంపెనీలు వెంటనే స్పందించి ఈ సమస్యకు పరిష్కారం చూపించాలని కోరుతున్నారు. లేకపోతే తాము చేస్తున్న నిరసననుకొనసాగిస్తామని ఈ సందర్భంగా వారు తీవ్రంగా హెచ్చరించారు

# నిబద్ధతకు ప్రతీరూపం జీవన్‌రెడ్డి

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాజకీయ యవనికపై నాలుగు దశాబ్దాలకు పైగా చెరగని ముద్ర వేసిన సీనియర్ నేత, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయడం రాష్ట్ర రాజకీయాల్లో ఒక పెను సంచలనంగా మారింది. ఇది కేవలం ఒక నియోజకవర్గ స్థాయి నాయకుడి అసంతృప్తిగానో, లేదా ఒక వ్యక్తిగత నిర్ణయంగానో పరిగణించ లేము. ఈ పరిణామం వెనుక దశాబ్దాల రాజకీయ నైతికత, పార్టీ సిద్ధాంతాల పట్ల అంకితభావం, మరియు ప్రస్తుత రాజకీయాల్లో చోటు చేసుకుంటున్న విలువ కట్టలేని ఫిరాయింపుల సంస్కృతిపై ఒక గంభీరమైన ధిక్కార స్వరం వినిపిస్తోంది. 1980వ దశకంలో ఇందిరా గాంధీ ఆశయాలతో రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన జీవన్ రెడ్డి, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి ఒక బలమైన ధ్వజధారిగా నిలిచారు. జగిత్యాల గడ్డపై ఐదు పర్యాయాలు శాసన సభ్యుడిగా విజయం సాధించి, ప్రజల మనిషిగా గుర్తింపు పొందిన ఆయన, పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు కూడా వెనుకాడకుండా నిలబడ్డారు. ముఖ్యంగా తెలంగాణ ఉద్యమ పతాక స్థాయి సమయంలో, కాంగ్రెస్ అధిష్టానం ఆదేశాల మేరకు కరీంనగర్ లోక్‌సభ ఉప ఎన్నికల్లో కేసీఆర్‌పై పోటీ చేసి పార్టీ పట్ల తన విధేయతను చాటుకోవడం ఆయన నిబద్ధతకు నిదర్శనం. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కాంగ్రెస్ తీవ్ర ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొన్నప్పటికీ, ఉమ్మడి జిల్లాలో ఏకైక ఎమ్మెల్యేగా గెలిచి పార్టీ ఉనికిని కాపాడారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటికీ, కుంగిపోకుండా పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఎన్నికై శాసన మండలిలో కాంగ్రెస్ పక్షనేతగా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో ఆయన పోషించిన పాత్ర చిరస్మరణీయం. అయితే, 2023లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితులు అనూహ్యంగా మారాయి. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణే ధ్యేయంగా ఏర్పడిన ప్రభుత్వం, రాజకీయ అవసరాల కోసం ఫిరాయింపులను ప్రోత్సహించడం జీవన్ రెడ్డి వంటి సిద్ధాంతకర్తలకు మింగుడుపడని అంశంగా మారింది. ముఖ్యంగా జగిత్యాల నియోజకవర్గంలో బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను పార్టీలోకి ఆహ్వానించడం, ఆయనకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం పుండు మీద కారం చల్లినట్లయింది. దశాబ్దాలుగా పార్టీని నమ్ముకుని, ప్రత్యర్థుల దాడులను తట్టుకుని నిలబడిన కార్యకర్తలను విస్మరించి, పార్టీ మారిన వారికి పెద్దపీట వేయడం వల్ల పార్టీ అంతర్గత నిర్మాణం కుప్పకూలుతోందని ఆయన ఆవేదన చెందారు.

గాంధీ భవన్‌లో జరిగిన కీలక సమావేశానికి ఫిరాయింపు ఎమ్మెల్యేలను ఆహ్వానించడం, చట్టసభల్లో అనర్హత వేటు అంశం పెండింగ్‌లో ఉన్నప్పుడే వారికి ప్రాధాన్యత కల్పించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఆయన బలంగా నమ్మారు. "జై సంవిధాన్" అని నినదించే పార్టీ, రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ఆశయాలను తుంగలో తొక్కడం ఆయనను తీవ్రంగా కలచివేసింది. మున్సిపల్ ఎన్నికల అభ్యర్థుల ఎంపికలో సైతం పాత కార్యకర్తలను కాదని, కొత్తగా వచ్చిన వారి మాటకే విలువ ఇవ్వడం వల్ల పార్టీలో ప్రజాస్వామ్యం కనుమరు గవుతోందనే విమర్శలు వ్యక్తమయ్యాయి. దీనికి తోడు, పార్టీ పట్ల ఎంతో నిబద్ధత కలిగిన మారుగంగారెడ్డి అనే జీవన్ రెడ్డి అనుచరుడు దారుణ హత్యకు గురికావడం, జీవన్ రెడ్డిని తీవ్ర మానసిక క్షోభకు గురిచేశాయి. తనను నమ్ముకున్న కార్యకర్తలకు రక్షణ కల్పించలేనప్పుడు పదవుల్లో కొనసాగడం నిరర్థకమని భావించిన ఆయన, తన 40 ఏళ్ల కాంగ్రెస్ పార్టీతో ఉన్న రాజకీయ ప్రస్థానానికి స్వస్తి పలకాలని నిర్ణయించు కున్నారు. రాజీవ్ గాంధీ ప్రవేశపెట్టిన పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం యొక్క అసలు స్ఫూర్తిని ప్రస్తుత రాజకీయ నాయకత్వం విస్మరించడం వల్లనే ఇటువంటి అవాంఛనీయ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. రాహుల్ గాంధీ జాతీయ స్థాయిలో 'న్యాయ్' యాత్రల ద్వారా విలువలతో కూడిన రాజకీయాల గురించి మాట్లాడుతుంటే, రాష్ట్ర స్థాయిలో అందుకు విరుద్ధంగా జరుగుతున్న పరిణామాలు పార్టీ విశ్వసనీయతను దెబ్బతీస్తున్నాయి. జీవన్ రెడ్డి రాజీనామా అనేది కేవలం ఒక వ్యక్తి నిష్క్రమణ కాదు, అది అధికారం కోసం నైతికతను పణంగా పెట్టే రాజకీయ ధోరణిపై జరిగిన ఒక నైతిక పోరాటం. పార్టీలో క్రమశిక్షణ, కార్యకర్తల ఆత్మగౌరవం, మరియు సిద్ధాంతాల పట్ల స్పష్టత లేకపోతే ఎంతటి ప్రజాదరణ ఉన్నా అది స్వల్పకాలికమే అవుతుందని ఈ ఘటన హెచ్చరిస్తోంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం స్థిరంగా కొనసాగాలంటే ప్రజా సంక్షేమ పథకాలతో పాటు, క్షేత్రస్థాయిలో పార్టీని నమ్ముకున్న నాయకులకు, కార్యకర్తలకు సముచిత గౌరవం కల్పించాల్సిన బాధ్యత అధిష్టానంపై ఉంది. జీవన్ రెడ్డి వంటి మేధావి, నిబద్ధత కలిగిన నాయకుడు దూరం కావడం కాంగ్రెస్ పార్టీకి కోలుకోలేని దెబ్బ. ఇది రాజకీయ పక్షాలన్నింటికీ ఒక ఆత్మపరిశీలన సమయం. పార్టీ ఫిరాయింపులు, అధికార రాజకీయాల కంటే ప్రజాస్వామ్య విలువలు, కార్యకర్తల శ్రేయస్సు మిన్న అని చాటిచెప్పిన జీవన్ రెడ్డి నిర్ణయం, రాబోయే రోజుల్లో తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో పెను మార్పులకు నాంది కావచ్చు. పార్టీ వ్యవస్థను బలోపేతం చేసుకోవడంలో విఫలమైతే, ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని ఈ పరిణామం స్పష్టం చేస్తోంది. ఒక గొప్ప రాజకీయ యుగానికి ముగింపు పలకడం కంటే, ఆ వ్యవస్థలోని లోపాలను సరిదిద్దుకుని ముందుకు సాగడమే నిజమైన రాజకీయం.

ప్రస్తుత పరిస్థితుల్లో జీవన్ రెడ్డి తీసుకున్న ఈ కఠిన నిర్ణయం తెలంగాణ సమాజంలో రాజకీయ నైతికతపై చర్చను పునఃప్రారంభించింది. విలువలకు ప్రాధాన్యత ఇచ్చే ఓటర్లు, విద్యావంతులు ఈ పరిణామాన్ని నిశితంగా గమనిస్తున్నారు. పార్టీలు మారడం అనేది కేవలం సాంకేతిక అంశం కాదు, అది ప్రజలు ఇచ్చిన తీర్పును ధిక్కరించడమేనని జీవన్ రెడ్డి వాదనలో స్పష్టత కనిపిస్తోంది. అధికారం శాశ్వతం కాదని, వ్యక్తిత్వం మరియు విలువలే రాజకీయాల్లో చిరస్థాయిగా నిలుస్తాయని ఆయన తన రాజీనామా ద్వారా చాటిచెప్పారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వం ఇప్పటికైనా మేల్కొని, క్షేత్రస్థాయిలో ఉన్న అసంతృప్తిని చల్లార్చకపోతే, భవిష్యత్తులో మరిన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ప్రజాస్వామ్యాన్ని కాపాడతామని వాగ్దానం చేసిన వారు, స్వయంగా ఆ విలువలను కాలరాస్తున్నారనే ముద్ర పడకుండా జాగ్రత్త పడాలి. చివరగా, జీవన్ రెడ్డి రాజీనామా తెలంగాణ రాజకీయ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుంది, ఇది పదవుల కంటే సిద్ధాంతాలే గొప్పవని నమ్మే ప్రతి రాజకీయ కార్యకర్తకు ఒక ప్రేరణగా మిగిలిపోతుంది.

# నాటకానికి పునర్వైభవం తేవాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** నాటకం అనేది ఒక శ్రవణ సహిత దృశ్య రూపకం. జానపద కళలు విలసిల్లు తున్న రోజులలో, రాజుల పరిపాలనా కాలంలో ప్రజల వినోదం కోసం అత్యధికంగా ఆదరింపబడిన కళ నాటకం. రంగస్థలం వినోదాన్ని కలిగించేదే కాకుండా, వివిధ సంస్కృ తుల్నీ, జాతుల్నీ, మనుషుల్నీ ఒకటిగా కలిపే ప్రక్రియ. అక్కడే మనం ఆనందిస్తాం; దుఃఖం లోకి నెట్టబడతాం; ఆలోచనలకి అంకురార్పణ చేస్తాం; స్ఫూర్తి చెందుతాం. ఇదీ రంగస్థల గొప్పతనం. నాటకం సంగీతం, పాటలు, నృత్యాలతో కూడుకొన్న ప్రక్రియ. పదహారవ శతాబ్దంలో ప్రారంభమైన నాటక ప్రక్రియను చిందు భాగవతం, యక్షగాన నాటకం, వీధి భాగవతం, బయలాట అనీ పిలుస్తారు. వీధి నాటకాలను ఎక్కువ ప్రచారంలోకి తెచ్చినవారు కూచిపూడి భాగవతులు. తెలుగు నాటకరంగ చరిత్ర, తెలుగులో ఆదికవిగా పేరుగాంచిన నన్నయ్య తన భారత అవతారికలో రసాన్విత కావ్య నాటకముల్ పెక్కుజూచితి అనడాన్ని బట్టి, నన్నయ కాలానికి నాటక ప్రదర్శనలుండేవని తెలుస్తున్నది. తెలుగు దేశంలో ఆధునిక నాటక రచనలకు తెర తీసింది నాటి ఉపాధ్యాయులు, ప్రధానంగా పండితులైన కోరాడ రామచంద్ర శాస్త్రి, కొక్కొండ వెంకటరత్నం పంతులు, పరవస్తు వెంకట రంగాచార్యులు, వావిలాల వాసుదేవశాస్త్రి తదితరులు. కందుకూరి వీరేశలింగం, కొండుభొట్ల సుబ్రహ్మణ్యశాస్త్రి, నాదెళ్ళ పురుషోత్తమ కవి, వడ్డాది సుబ్బారాయుడు ఆధు నిక తెలుగు నాటక ప్రదర్శనారంభ విషయంలో ప్రథములు. ఆధునిక నాటక రచన 1860 ప్రాంతాల్లో ఆరంభం కాగా నాటక ప్రదర్శన మాత్రం 1880లో ప్రారంభమయ్యింది. ఆధునిక కాలంలో వెలువడిన తొలి తెలుగు నాటకం 1860 ప్రాంతాల్లో కోరాడ రామచంద్ర శాస్త్రిచే సంస్కృతంలో నుంచి నాటక లక్షణాలను అనుసరించి తెలుగులో వెలువడిన స్వతంత్ర రచన 'మంజరీ మధుకరీయం'. "ఆంధ్రా జాన్సన్ 'గా సుప్రసిద్ధు లైన కొక్కొండ వెంకటరత్నం పంతులు 1871 లో వారణాశి ధర్మసూరి సంస్కృతంలో రచించిన 'నరకాసుర విజయం' అనే వ్యాయోగమును ఆంధ్రీకరించాడు. పరవస్తు వెంకట రంగాచార్యులు 1872 ప్రాంతాల్లో కాళిదాసు రచించిన 'అభిజ్ఞాన శాకుంతలము' ను ఆంధ్రీకరించడం జరిగింది. వావిలాల వాసుదేవశాస్త్రి ఆంగ్ల నాటక ఆంధ్రీకరణ ద్వారా జూలియస్ సీజర్ నాటకాన్ని 'సీజరు చరిత్రము' అను పేరుతో 1874 లో ఆసాంతం తేటగీతిలో రాశాడు. ఆధునిక నాటక రచనకు ఆద్యులు వారైతే, ఆధునిక నాటక ప్రదర్శన ఆరంభ దశకు కందుకూరి వీరేశలింగం పంతులు, కొండుభొట్ల సుబ్రహ్మణ్య శాస్త్రి, నాదెళ్ళ పురుషోత్తమ కవి, వడ్డాది సుబ్బారాయుడులు రూపకర్తలు. వీరేశ లింగం సంభాషణ రూపాన 'బ్రాహ్మ వివాహం' అను ప్రహసనమును తన 'హాస్య సంజీవని' అను పత్రికలో రచించగా, అనంతరం 'వ్యవహార ధర్మబోధిని' వ్యావహారిక భాషలో రచించి, ప్రదర్శన భాగ్యం కలిగించిన తొలి తెలుగు నాటకమిది. 1880 లో వీరేశలింగం నాటక సమాజాన్ని స్థాపించి 'రత్నావళి', 'చమత్కార రత్నావళి' అను రెండు నాటకాలను ప్రదర్శించాడు. తెలుగు నాట తొలి నాటక సమాజాన్ని స్థాపించిన ఘనత వీరేశలింగందే. ఆయన స్వతంత్ర రచన అయిన 'వ్యవహార ధర్మబోధిని' సంస్కృత నాటక అనువాద మైన 'రత్నావళి', ఆంగ్ల నాటక అనుసరణ అయిన 'చమత్కార రత్నావళి' ప్రదర్శన భాగ్యం పొందిన తొలి తెలుగు నాటకాలు. ఇది 1880లో జరిగింది. అందుచేత 1980వ సంవత్సరం తెలుగు నాటకరంగ శతజయంతి సంవత్సరం అయింది. తెలుగు నాటకాలలో పద్య పఠనమును (ఈనాడు వలె గానం కాదు) ప్రవేశ పెట్టినది వడ్డాది సుబ్బారాయుడు. ఆయన నాటకాలలో ప్రసిద్ధమై, 'వేణీ సంహారము'. తెలుగులో గద్య, పద్యాత్మకం కాగా, పద్యాలని రంగస్థలం మీద పఠించేవారు. 1884?86 మధ్య నాదెళ్ళ పురుషోత్తమ కవి 32 హిందూస్తానీ నాటకాలు రచించాడు. వీటిని 15 ఏళ్ళపాటు అనేక పట్టణాలలో విజయవంతంగా ప్రదర్శించారు. పాటలు పాడుట అయన ప్రవేశ పెట్టిన కొత్త అంశం. ధర్మవరం రామకృష్ణమాచార్యులు తన తొలి తెలుగు నాటకమైన 'చిత్రనళీయం'ను బళ్ళారిలో 1887 జనవరి 29న విజయ వంతంగా ప్రదర్శిం చారు. 'సారంగధర' తెలుగులోని తొలి స్వతంత్ర విషాద రూపకం. ప్రాచ్యపాశ్చాత్య సిద్ధాంతాలను సమన్వయించడంలో ప్రథములైనందునే 'ఆంధ్ర నాటక పితామహ' అని బిరుదునిచ్చి సత్కరించారు. చిలకమర్తి లక్ష్మీనర సింహం 1989లో నాటక రచన ఆరంభం చేయగా, అయన నాటకాలలో 'గయోపాఖ్యానం' సుప్రసిద్ధమైనది. 1891లో వెంకటరాయశాస్త్రి రచించిన 'ప్రతాప రుద్రీయం' బహుళ ఖ్యాతి నొందింది. 1887లో గురజాడ అప్పారావు 'కన్యాశుల్కం' వ్యావహారిక భాషలో రచించబడ్డ అత్యుత్తమైన నాటకం. 1892 ఆగస్టులో విజయనగరం లోని జగన్నాథ విలాసినీ నాటక సమాజం వారు దీనిని ప్రథమంగా విజయవంతంగా ప్రదర్శించారు. వ్యావహారిక భాషలో ఓ కొత్త మలుపు తెచ్చిన నాటకమిది. '1894 ప్రాంతాల నుంచి వివిధ నాటక రచనలు చేసినవారు కోలాచలం శ్రీని వాసరావు. అధికంగా చారిత్రక నాటకాలు రచించడం చేత 'చారిత్రక నాటక పితామహుడు'గా పేరొందారు.ఆయన నాటకాలకు తెలుగుదేశ మంతటా విశేష ప్రాచుర్యం తెచ్చినవారు కోలాచలం మేనల్లుడైన బళ్ళారి రాఘువ. పానుగంటి లక్ష్మీ నరసింహారావు రచించిన తొలి నాటకం 'నర్మదా పురుకుత్సీ యం' 1900లో ప్రకటితమైంది. ఆయన నాటకాలలో 'రాధాకృష్ణ', 'పాదుకా పట్టాభిషేకం', 'కంఠాభరణం' ప్రసిద్ధమైనవి. 1900 నాటికి తెలుగు నాటక రచన, ప్రదర్శన వ్యాసంగాలు తెలుగు దేశంలోని

అన్ని ప్రాంతాలకూ వ్యాపిం చాయి. 1906?20 మధ్య కాలంలో బయల్దేరిన 'హరిశ్చంద్ర' నాటకాలు 13. 'సారంగ ధర 8. ఇంకా అనేక ఇతర నాటకాలు, నాటకాలలో పద్యాలకు, పాటలకు విలువ హెచ్చిన కాలమిది. ఈ కాలంలోని ముఖ్య విశేషం తెలుగు దేశంలో వ్యాపార నాటక రంగం విజృంభించడం గమనార్హం. 1913 ప్రాంతాల్లో కృష్ణా మండలంలో నాటక పోటీలు ప్రారంభమై దేశ మంతటా వ్యాపించాయి. నాటక ప్రదర్శన అత్యంత ఖర్చుతో కూడినదిగా మారింది. ఇక ప్రస్తుతం రంగస్థలానికి కావల్సిన సౌకర్యాలు సరైన థియేటర్లు లేవు. ప్రత్యేక హాల్ లేక, ఎక్కడో ఏదో హాలులో నాటకం వేయ్యాల్సిన పరిస్థితులు. అతి ముఖ్యమైన మైకులూ, స్పీకర్ సిస్టంలూ ఉండవు. ఉన్నా సరిగా పనిచేయవు. మైకులు మొరాయించని నాటకం ఉండదూ అంటే అతిశయోక్తి కాదు. సినిమాల్లో నటన ముక్కలు ముక్కలుగా చిత్రీకరించ బడుతుంది. నాటకంలో ఏకబిగిన మొత్తం సన్నివేశంలో నిమగ్నమై నటించాలి. అది చాలా కష్టం. నాటకాలు వేసిన వాళ్ళు సినిమాల్లో రాణిస్తారేమో కానీ, సినిమా నటులు నాటకాల్లో రాణించడం అంత సులభం కాదు. ఇది వరకు తెలుగు సినిమా నటుల్లో అధికులు నాటక రంగం నుండి వచ్చిన వారే అన్న విషయం గుర్తుంచు కోవాలి. ఏటా నంది నాటకాలు పేరుతో కొన్ని నాటకాలు వేయించి ప్రభుత్వమూ చేతులు దులిపేసు కుంటున్నది. ప్రభుత్వాలు చొరవ తీసుకుని, నాటక సంస్థలకు చేయూత అందించి, ప్రోత్సహిస్తే తప్ప మినుకు మినుకుమంటూ ఆరిపోవడానికి సిద్ధంగా ఉన్న నాటకరంగం బతికి బట్టకట్టడం కష్టం. ఈ విషయాన్ని ప్రభుత్వాలు ఇకనైనా గ్రహించకపోతే చరమాంకంలో ఉన్న నాటక రంగం తెర మరుగుకాక తప్పని స్థితి నెలకొంది.

# ప్రాణం తీస్తున్న వేగం

**హైదరాబాద్, మార్చి 26 పెన్ పవర్:**
విశాలమైన రోడ్డు.. ఏమాత్రం గతుకులు ఉండవు. వేగంగా దూసుకుపోవచ్చు. ధ్వని వేగంతో సమానంగా వాహనాన్ని నడపవచ్చు. అందువల్లే చాలామంది బాహ్య వలయ రహదారి మీద ప్రయాణించడాన్ని ఆనందిస్తుంటారు. ఔటర్ కేవలం రోడ్డు మాదిరిగానే కాకుండా.. చుట్టూ వృక్షాలు.. పూల మొక్కలతో కనువిందు చేస్తూ ఉంటుంది. అందువల్లే ఆ ప్రకృతిని చూస్తూ చాలామంది వేగంతో వెళ్తూ ఉంటారు.ఔటర్ రింగ్ రోడ్డు మీద స్పీడోమీటర్లు ఉన్నప్పటికీ చాలామంది వేగాన్ని ఆస్వాదిస్తూ ముందుకు వెళ్తుంటారు. అందువల్ల ట్రాఫిక్ చలాన్లకు గురవుతూ ఉంటారు. ఆ మధ్య మహేష్ బాబు ప్రయాణిస్తున్న కారు మితిమీరిన వేగంతో వెళ్లడంతో.. చలాన్ నమోదయింది. దీనిని బట్టి ఔటర్ రింగ్ రోడ్డు మీద సెలబ్రిటీలు.. ప్రజా ప్రతినిధులు ఏ స్థాయిలో ప్రయాణం సాగిస్తుంటారో అర్థం చేసుకోవచ్చు.ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్సీ అజహారుద్దీన్ కుమారుడు తన విలాసవంతమైన

బైక్ మీద అవుటర్ రింగ్ రోడ్డు మీద ప్రయాణించాడు. మితిమీరిన వేగంతో ప్రయాణించడంతో ప్రమాదానికి గురయ్యాడు. ఆ ప్రమాదంలో అతడు దుర్మరణం చెందాడు. అప్పట్లో సినీ హీరో రాజశేఖర్ కారు కూడా ప్రమాదానికి గురైంది. దాని కారణం కూడా మితిమీరిన వేగమని తెలుస్తోంది. కంటోన్మెంట్ దివంగత ఎమ్మెల్యే సాయన్న కూతురు లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. ఎమ్మెల్యేగా ఉన్న ఆమె ప్రయాణిస్తున్న కారు మితిమీరిన వేగంతో వెళ్లడంతో.. ప్రమాదం జరిగింది. అప్రమాదంలో లాస్య నందిత చనిపోయింది.ఇప్పుడు దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కుమార్తెలు ఔటర్ రింగ్ రోడ్డు మీదప్రయాణిస్తుండగా.. వారి వాహనం ప్రమాదానికి గురైంది. ఆగి ఉన్న డీసీఎంను ఢీకొట్టడంతో వారి ప్రయాణిస్తున్న కారు

ధ్వంసం అయింది. మాగంటి గోపీనాథ్ ఇద్దరు కుమార్తెల్లో పెద్ద కుమార్తె అక్షర తీవ్రంగా గాయపడింది.ప్రస్తుతం ఆమె అత్యంత విషమ పరిస్థితిని ఎదుర్కొంటున్నది. గచ్చిబౌలి లోని ఏఐజి ఆసుపత్రిలో ఆమెకు చికిత్స అందిస్తున్నారు.. ఔటర్ రింగ్ రోడ్డు మీద ప్రజాప్రతినిధులు ఇలా వరుసగా గాయపడడం లేదా మృతిచెందడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్న తీరు దిగ్భ్రాంతి కలిగిస్తోంది.

## హనుమకొండలో ఉద్రిక్త వాతావరణం... గిరిజన సంఘ నాయకుల అరెస్టులు

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ ట్యాంక్ బండ్ పై బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ గారి విగ్రహాన్ని ప్రతిష్టించాలని, రాష్ట్రంలోని పేద గిరిజన వర్గాల సంక్షేమం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ పెండింగ్ స్కాలర్షిప్స్,రియాంబర్స్మెంట్, ఉద్యోగ నోటిఫికేషన్లు తక్షణమే భర్తీ చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజన డిక్లరేషన్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని గిరిజన సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ముట్టడికార్యక్రమానికి పిలుపునిచ్చిన గిరిజన సంఘాల కార్యకర్తలను కాకతీయ యూనివర్సిటి పోలీసులు, హనుమకొండ సుబేదారి పోలీసులు అరెస్టు చేశారు.

## బాటిళ్లలో పెట్రోల్ కొట్టిస్తే జైలు శిక్ష

**భూపాలపల్లి జిల్లా: పెన్ పవర్:** టేకుమట్ల గ్రామంలో వాహనదారులు పెట్రోల్, డీజిల్ కొరత భయంతో ఇంధనాన్ని ఇళ్లలో నిల్వ చేసుకుంటున్నారు. అయితే, పెట్రోలియం చట్టం-1934 ప్రకారం క్యాన్లు, ప్లాస్టిక్ డబ్బాల్లో ఇంధనం నిల్వ చేయడం నేరం.మొదటిసారి పట్టుబడితే వెయ్యి రూపాయల జరిమానా లేదా నెల జైలు శిక్ష, రెండోసారి పట్టుబడితే 5 వేల రూపాయల జరిమానా లేదా 3 నెలల జైలు శిక్ష పడుతుందని పోలీసులు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో బాటిళ్లలో పెట్రోల్ తీసుకెళ్లవద్దని హెచ్చరించారు.

## పోలీసు క్రీడల్లో జగిత్యా ఆర్ఎస్ఐకి కాంస్య పతకం అభినందించిన ఎస్పీ

**జగిత్యాల: పెన్ పవర్:** జమ్మూ లో నిర్వహించిన ఆల్ ఇండియా పోలీస్ స్పోర్ట్స్ (ఖో ఖో) పోటీల్లో తెలంగాణ పోలీస్ తరఫున పాల్గొని కాంస్య పతకం సాధించిన రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్ రమేష్ ను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.జమ్మూ & కాశ్మీర్ పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆల్ ఇండియా పోలీస్ స్పోర్ట్స్ (ఖో ఖో) పోటీలలో తెలంగాణ రాష్ట్ర పోలీస్ తరఫున జగిత్యాల జిల్లా నుండి పాల్గొన్న రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్ రమేష్ విశేష ప్రతిభకనబరిచి కాంస్య పతకం సాధించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, రమేష్ ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. దేశవ్యాప్తంగా నిర్వహించిన ఈ ప్రతిష్టాత్మక క్రీడా పోటీలలో తెలంగాణ పోలీస్ తరుపునపాల్గొని విజయాన్ని సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇంకా జాతీయ స్థాయిలో జరిగే క్రీడా పోటీలలో పాల్గొని మరిన్ని విజయాలు సాధించాలని సూచించారు.

## అరోగ్య శ్రీ బిల్లులు ఎప్పుడు చెల్లిస్తారు హరీష్ రావు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆరోగ్య శ్రీ బిల్లులు గ్రీన్ ఛానెల్లో విడుదల చేస్తున్నామని అన్నారు.. కానీ విడుదల కావడం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు.గురువారం అయన అసెంబ్లీలో మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రూ.5 లక్షలు ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.10 లక్షలు ఇస్తామని చెప్పారు. రూ.5 లక్షలు నుండి రూ.10 లక్షలు పెంచడం వల్ల రెండున్నరసంవత్సరాలలో కేవలం 496 మంది మాత్రమే లబ్ధి పొందారు. ఎందుకంటే కార్పొరేట్ ఆసుపత్రులు మేజర్ సర్జరీలకు ఆరోగ్యశ్రీ కింద ట్రీట్మెంట్ ఇవ్వడం లేదు.. దాని మీద రివ్యూ చేయండి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోకూడా ఆరోగ్య శ్రీ కింద రూ.5 లక్షల నుండి రూ.15 లక్షల వరకు 607 మందికి డబ్బులు విడుదల చేశాము.. కానీ మీరు 496 మందికే ఇచ్చారు. ఆరోగ్యశ్రీ సేవలు బంద్ చేస్తామని నోటీసులు ఇచ్చినా బిల్లులు రిలీజ్ కావడం లేదు. చిన్న చిన్న ఆసుపత్రులు మూతపడే పరిస్థితి నెలకొంది. దయచేసి ఆరోగ్యశ్రీ కింద పెండింగ్ బిల్స్ ఎన్ని ఉన్నాయో.. ఎప్పటిలోగా చెల్లిస్తారో మంత్రి గారు చెప్పాలని అన్నారు.

## నల్గొండ మహాత్మాగాంధీ యూనివర్సిటీలో తీవ్ర నీటి ఎద్దడి

**నల్గొండ: పెన్ పవర్:** నల్గొండ మహాత్మా గాంధీ యూనివర్సిటీ హాస్టళ్లలో గత నెల రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయింది. తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నమని విద్యార్థులు అందోళనకు దిగారు. పలుమార్లు యూనివర్సిటీ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ తమ సమస్యను పట్టించుకునే పరిస్థితి లేదని ఆగ్రహం వ్యక్తం చేసారు. హాస్టళ్లలో నీళ్లు లేకపోవడంతో నెల రోజులుగా స్నానాలు కూడా చేయలేని పరిస్థితిలో వున్నామని అన్నారు.

వెంటనే సమస్య పరిష్కారం చేయాలని తెల్లవారుజామున విద్యార్థులు హాస్టల్ వద్ద ఆందోళన కు దిగారు. స్పందించిన అధికారులు ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేయించారు. యూనివర్సిటీ పరిధిలో జరుగుతున్న కొత్త భవన నిర్మాణాలకు నీటిని మళ్లించడం వల్లే ఈ సమస్య తలెత్తిందని విద్యార్రదులు ఆరోపిస్తున్నారు.

## గ్యాస్ బండలను ఎత్తుకెళ్లేందుకు యత్నం

**హైదరాబాద్ పెన్ పవర్:** గ్యాస్ ఆటో నుండి సిలిండర్లను వినియోగదారులు ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఫిలింనగర్ పరిధిలోని షేక్పేట్ వద్ద గ్యాస్ ఏజెన్సీ నుండి సిలిండర్లతో బయటికి వచ్చిన ఆటో నుండి అనుమతి లేకుండా సిలిండర్లు ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించారు. వారిని ఏజెన్సీ స్థానికుల సహాయంతో వారిని అడ్డుకున్నారు. గ్యాస్ బుక్ చేసి చాలా రోజులు గడుస్తున్నా ఇంకా సిలిండర్ రాలేదని వినియోగదారుల ఆగ్రహం.

# అనారోగ్యంతో యువతి ఆత్మహత్య

**మేడ్చల్: పెన్ పవర్:** నాచారం పీఎస్ పరిధిలో లో వైష్ణవి (17 ) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలు గత కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుందని సమాచారం. అనారోగ్య సమస్యలే ఆత్మహత్య కారణం కావచ్చని బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నాచారం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## పమాద స్థలిలో ఎమ్మెల్యే కందుల పర్యవేక్షణ

**మార్కాపురం: పెన్ పవర్:**మార్కాపురంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం గురించి తెలిసిన వెంటనే, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలను పర్యవేక్షించారు. అనంతరం మార్కాపురం ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. సీఎం చంద్రబాబు గారి ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ, బాధితులకు సహాయం అందిస్తున్నారు

# మేడారం గద్దెల రాళ్లు పడి పూజారి కుమారుడికి గాయాలు

**ములుగు పెన్ పవర్:**మేడారం సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద ఆడుకుంటున్న చిన్నారికి గాయాలయ్యాయి. ములుగు జిల్లా మేడారం సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద ఆడుకుంటున్న చిన్నారిపై ఇటీవల నిర్మించిన రాళు పడి తీవ్ర గాయాలు అయ్యాయి. డ్యూటీలో ఉన్న సమ్మక్క ప్రధాన పూజారి సిద్దబోయిన రానా రమేష్ కుమారుడు యువన్(6) కాలు మీద దిమ్మలు పడటంతో రెండు చోట్ల కాలు విరిగి తీవ్ర గాయాలు అయ్యాయి. మెరుగైన వైద్యం కోసం వరంగల్లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

# సౌత్ రాష్ట్రాల మధ్య సమన్వయం సాధ్యమేనా

**హైదరాబాద్, మార్చి 26, పెన్ పవర్:** నియోజకవర్గాల పునర్విభజన , సీట్ల పెంపు అంశం ఇప్పుడు దేశవ్యాప్తంగా, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో పెను సంచలనానికి కేంద్ర బిందువుగా మారింది. జనాభా ప్రాతిపదికన సీట్ల సంఖ్యను పెంచితే, జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందనే వాదనను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బలంగా వినిపిస్తున్నారు. దక్షిణాది రాష్ట్రాలన్నీ ఏకతాటిపైకి వచ్చి పోరాడాలని పిలుపునివ్వడం ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. అయితే, ఈ విషయంలో కాంగ్రెస్ అధిష్టానం ఇంకా అధికారికంగా ఎటువంటి స్పష్టమైన పాలసీని ప్రకటించలేదు.కాంగ్రెస్ పార్టీకి ఇది కత్తి మీద సాము లాంటి వ్యవహారం. ఒకవేళ దక్షిణాదికి అన్యాయం జరుగుతోంది అని కాంగ్రెస్ గట్టిగా ఉద్యమిస్తే, అది ఉత్తరాది రాష్ట్రాల్లోని ఓటర్లను కించపరిచినట్లు అవుతుందనే భయం జాతీయ నాయకత్వంలో ఉంది. ఉత్తర ప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాల్లో జనాభా ఎక్కువగా ఉన్నందున అక్కడ సీట్లు భారీగా పెరుగుతాయి. ఆ రాష్ట్రాల్లో కూడా పాగా వేయాలని చూస్తున్న కాంగ్రెస్‌కు, రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు కొంత ఇబ్బందికరంగా మారే అవకాశం ఉంది. జాతీయ పార్టీగా దేశమంతటా ఒకే విధానాన్ని అనుసరించాల్సి ఉండటంతో, అధిష్టానం ఆచితూచి వ్యవహరిస్తోంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధోరణి చూస్తుంటే, ఆయన జాతీయ రాజకీయాల కంటే తెలంగాణ, దక్షిణాది ప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్నట్లు కనిపిస్తోంది. జాతీయ నాయకత్వం ఆలోచనలతో సంబంధం లేకుండా, క్షేత్రస్థాయిలో ప్రజల సెంటిమెంటును పట్టుకోవడంలో ఆయన సిద్ధహస్తుడు. దక్షిణాది రాష్ట్రాలకు సీట్ల కేటాయింపులో నష్టం జరిగితే, అది నిధుల కేటాయింపు, రాజకీయ ప్రాతినిధ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆయన భావిస్తున్నారు. అందుకే, పార్టీ లైన్ కంటే ప్రాంతీయ ప్రయోజనాలకే ఆయన ప్రాధాన్యత ఇస్తున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.నియోజకవర్గాల పునర్విభజన అనేది రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ. 50 శాతం సీట్లు పెంచాలనే ప్రతిపాదన అన్ని రాష్ట్రాలకూ వర్తిస్తుంది కాబట్టి, దీన్ని కేవలం ఒక ప్రాంతానికి అన్యాయంగా చూడలేమని కొందరు నిపుణులు వాదిస్తున్నారు. అయితే, దక్షిణాది రాష్ట్రాలు కుటుంబ నియంత్రణను పాటించి అభివృద్ధి పథంలో దూసుకుపోతుంటే, జనాభా పెంచుకున్న రాష్ట్రాలకు ఎక్కువ సీట్లు ఇవ్వడం అనేది మంచి పని చేసిన వారికి శిక్ష వేయడమే అనే వాదనలోనూ పస ఉంది. ఈ క్లిష్టమైన సమస్యను నిపుణులు, మేధావులు లోతుగా విశ్లేషించాల్సిన అవసరం కనిపిస్తోంది.దేశవ్యాప్త ప్రభావం చూపే ఇటువంటి సున్నితమైన అంశాలపై ఒక ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి బహిరంగంగా ఉద్యమానికి పిలుపునివ్వడం సామాన్యమైన విషయం కాదు. ఇది భవిష్యత్తులో కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై, అలాగే కాంగ్రెస్ అంతర్గత రాజకీయాలపై ప్రభావం చూపవచ్చు. ఉత్తరాది రాష్ట్రాల్లో బీజేపీ బలంగా ఉన్న తరుణంలో, రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను బీజేపీ తనకు అనుకూలంగా మలుచుకునే అవకాశం ఉంది. కాంగ్రెస్ ఉత్తరాదిని వ్యతిరేకిస్తోంది అనే ముద్ర పడకుండా కాంగ్రెస్ అధిష్టానం ఎలా మేనేజ్ చేస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. డీలిమిటేషన్ అంశం కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలను లేదా భిన్నమైన ఆలోచనా ధోరణులను బయటపెట్టింది. రేవంత్ రెడ్డి తనదైన శైలిలో దక్షిణాది సెంటిమెంటును రగిలిస్తుంటే, జాతీయ నాయకత్వం మాత్రం ఆచితూచి అడుగులు వేస్తోంది.

# కవిత పార్టీ ప్రకటన

**హైదరాబాద్, మార్చి 26, పెన్ పవర్:** కల్వకుంట్ల కవిత కొత్త పార్టీకి ముహూర్తం ఫిక్స్ అయినట్లు తెలుస్తోంది. శ్రీరామనవమి సందర్భంగా పార్టీకి సంబంధించి ఆమె ప్రకటన చేయనున్నారని సంబంధిత వర్గాల్లో చర్చ జరుగుతోంది. పార్టీ పేరును ఇప్పటికే తెలంగాణ ప్రజా జాగృతి అని ప్రకటించగా.. ఆ రోజునే జెండా, అజెండా విడుదల చేయనున్నట్లు సమాచారం. ఇప్పటికే పార్టీ నమోదు కోసం.. ఈసీకి దరఖాస్తు చేసుకున్న కవిత.. త్వరలోనే దాన్ని ప్రజల్లోకి తీసుకువచ్చేందుకు ముమ్మరంగా చర్యలు చేపడుతున్నారు.తెలంగాణ రాజకీయాల్లో మరో కొత్త పార్టీ అవతరించనుంది. బీఆర్ఎస్ పార్టీ నుంచి బయటికి వచ్చిన కల్వకుంట్ల కవిత .. తెలంగాణ జాగృతి పేరుతో కొన్ని నెలలుగా ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే కొత్త పార్టీని పెట్టనున్నట్లు ఇప్పటికే స్వయంగా ప్రకటించిన కల్వకుంట్ల కవిత.. దానికి సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నాయని ప్రకటించారు. అదే సమయంలో ఢిల్లీ లిక్కర్ కేసులో క్లీన్‌చిట్ వచ్చిన తర్వాత కూడా పార్టీ ఏర్పాటుపై ప్రకటన చేశారు. ఈ నేపథ్యంలోనే ఆ తర్వాత కేంద్ర ఎన్నికల సంఘానికి.. తమ తెలంగాణ ప్రజా జాగృతి పార్టీ నమోదు కోసం అప్లై చేసుకున్న కవిత.. ఈ ప్రక్రియ త్వరగా పూర్తి అయ్యేలా చూడాలని ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే.ఈ క్రమంలోనే త్వరలోనే పార్టీ ప్రకటన ఉంటుందని కవిత, ఆమె సన్నిహిత వర్గాలు చెబుతూనే ఉన్నారు. ఈ నేపథ్యంలోనే శ్రీరామనవమి రోజున కల్వకుంట్ల కవిత కొత్త పార్టీని ప్రకటించనున్నట్లు తాజాగా సమాచారం అందుతోంది. ఈ నెల 27వ తేదీన ఉదయం 8 గంటలకు కల్వకుంట్ల కవిత.. తన కొత్త పార్టీని అధికారికంగా ప్రకటించనున్నారని సంబంధిత వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. తన పార్టీకి తెలంగాణ ప్రజా జాగృతి అనే పేరును కవిత ఖరారు చేశారు. త్వరలోనే పార్టీ నమోదు ప్రక్రియ పూర్తి కానుండటంతో అధికారికంగా ప్రకటించాలని కవిత నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.మరోవైపు.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను సిద్దిపేట నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానని ఇప్పటికే ఓ ఇంటర్వ్యూలో కవిత తన మనసులోని మాటను వెల్లడించిన సంగతి తెలిసిందే. అయితే తన మెట్టినిల్లు అయిన సిద్దిపేట నుంచే తన పార్టీ జెండా, గుర్తు, విధివిధానాలను కవిత వెల్లడించే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.గాంధీజీ సర్వోదయ సిద్ధాంతం ప్రకారం.. సామాజిక తెలంగాణ సాధించడమే లక్ష్యంగా తమ పార్టీ పని చేయనున్నట్లు కవిత ఇప్పటికే ప్రకటించారు. ఇక తెలంగాణ యువతకు, ఉద్యమకారులకు తాను పెట్టబోయే పార్టీలో ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు కూడా కవిత వెల్లడించారు. అదే సమయంలో పార్టీని పెట్టే రోజునే.. కవిత తాను పోటీ చేసే నియోజకవర్గాన్ని కూడా ప్రకటించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది.

# డ్రంకెన్ డ్రైవ్‌లో రాజ్ తరుణ్ మాజీ ప్రియురాలు..

## మద్యం మత్తులో నడిరోడ్డుపై హల్‌చల్!



**సంగారెడ్డి పెన్ పవర్:** జిల్లాలో డ్రంకెన్ డ్రైవ్ ఘటన కలకలం సృష్టించింది. టాలీవుడ్ హీరో రాజ్ తరుణ్ మాజీ ప్రియురాలు లావణ్య మద్యం మత్తులో కారు నడుపుతూ ఓ ప్రమాదానికి కారణమయ్యారు. అనంతరం స్థానికులతో వాగ్వాదానికి దిగడంతో పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన మల్లేపల్లి గ్రామ పరిసరాల్లో చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళితే.. లావణ్య మ ద్యం సేవించి కారు నడుపుతూ వెళ్తుండగా మల్లేపల్లి వద్ద ఓ బైక్‌ను ఢీకొట్టారు. ప్రమాదం జరిగినప్పటికీ ఆమె కారు ఆపకుం డా అక్కడి నుంచి వేగంగా వెళ్లిపోవడానికి ప్రయత్నించారు. అయితే, ప్రమాదాన్ని గమనించిన స్థానిక గ్రామస్తులు వెంటనే స్పందించి, ఆమె కారును వెంబడించి అడ్డుకున్నారు. ఈ క్రమంలో లావణ్యకు, గ్రామస్తులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఆమెతో పాటు కారులో మరో వ్యక్తి కూడా ఉన్నట్లు సమాచారం. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని లావణ్యకు బ్రీత్ అనలైజర్ పరీక్ష నిర్వహించగా, ఆమె పరిమితికి మించి మద్యం సేవించినట్లు నిర్ధారణ అయింది. దీంతో పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని, కారును సీజ్ చేశారు. అనంతరం కొండాపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# కేసీఆర్, జగన్ ఫ్రెండ్ షిప్... గులాబీ గూటికి జీవన్ రెడ్డి

**హైదరాబాద్, మార్చి 26, పెన్ పవర్:** తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో స్పీకర్ తీర్పు వెలువరించినా.. ఈ వ్యవహారం మళ్లీ హైకోర్టుకు ఎక్కింది. స్పీకర్ నిర్ణయాన్ని రద్దు చేయాలంటూ.. పలువురు పిటిషన్లు దాఖలు చేశారు. తాజాగా ఆ పిటిషన్లను స్వీకరించిన తెలంగాణ హైకోర్టు.. కౌంటర్ దాఖలు చేయాలని.. తాజాగా ఏడుగురు ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చింది. ఇక ఇప్పటికే ఇదే వ్యవహారంలో దానం నాగేందర్‌కు హైకోర్టు నోటీసులు ఇవ్వడం గమనార్హం.తెలంగాణలో పార్టీ ఫిరాయింపుల వ్యవహారం ఒక కొలిక్కి రావడం లేదు. పార్టీ మారినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది ఎమ్మెల్యేల వ్యవహారంలో ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలతో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్.. తన నిర్ణయాన్ని ఇటీవలె వెలువరించారు. 10 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారినట్లు ఎలాంటి ఆధారాలు లేవని పేర్కొంటూ.. వారిపై అనర్హత వేటు వేయాలంటూ దాఖలైన పిటిషన్లను అన్నింటినీ కొట్టిపారేశారు. అయితే ఈ వ్యవహారం అంతటితో ఆగడం లేదు. స్పీకర్ గడ్డం ప్రసాద్ తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ.. మళ్లీ హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి.ఈ క్రమంలోనే పిటిషనర్లు చేసిన వాదనలను విన్న తెలంగాణ హైకోర్టు.. పార్టీ మారినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏడుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు తాజాగా నోటీసులు జారీ చేసింది. అదే సమయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు కూడా నోటీసులు ఇచ్చింది. ఇప్పటికే ఇదే వ్యవహారంలో దానం నాగేందర్‌కు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తాజాగా కాలే యాదయ్య, అరికెపూడి గాంధీ, ప్రకాష్ గౌడ్, పోచారం శ్రీనివాస్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, తెల్లం వెంకట్రావులపై పిటిషన్‌లు దాఖలు అయ్యాయి.ఈ పిటిషన్లపై విచారణ జరిపిన హైకోర్టు.. కౌంటర్ దాఖలు చేయాలని ఈ ఏడుగురు ఎమ్మెల్యేలకు ఆదేశాలు ఇచ్చింది. ఈ పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో తదుపరి విచారణను వచ్చే నెల 16వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు హైకోర్టు స్పష్టం చేసింది. దీంతో పూర్తి అయిపోయింది అనుకున్న తెలంగాణ పార్టీ ఫిరాయింపుల కేసు మళ్లీ మొదటికి వచ్చింది.మరోవైపు.. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కు ఇటీవలె హైకోర్టు నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. బీజేపీ శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు నోటీసులు ఇచ్చింది. దానం నాగేందర్.. బీఆర్ఎస్ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరారని.. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ బీఫామ్‌పై లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి పోటీ చేసి ఓడిపోయినట్లు తెలిపారు. అయినప్పటికీ దానం నాగేందర్ పార్టీ మారినట్లు ఆధారాలు లేవని అనర్హత పిటిషన్‌ను స్పీకర్ గడ్డం ప్రసాద్ కొట్టేశారని.. ఈ నేపథ్యంలోనే స్పీకర్ ఇచ్చిన తీర్పును కొట్టేయాలని తన పిటిషన్‌లో ఏలేటి మహేశ్వర్ రెడ్డి హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు.



# రామయ్య కళ్యాణానికి సర్వం సన్నద్ధం



**హైదరాబాద్, మార్చి 26, పెన్ పవర్:** అవిభక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తిరుమల తర్వాత రాష్ట్రంలో ఆరు పెద్ద దేవాలయాలు ఉండేవి అవి దేవాదాయ శాఖచే 6ఏ టెంపుల్స్ గా గుర్తింపు పొందాయి. శ్రీశైలం, అన్నవరం, ద్వారకా తిరుమల, విజయవాడ కనక దుర్గమ్మ, భద్రాచలం, వేములవాడ దేవాలయాలను 6ఏ టెంపుల్స్ అని పిలిచేవారు. 6ఏ అంటే ఆరు ఏ గ్రేడ్ టెంపుల్స్ అని అర్థం. రాష్ట్ర విభజన తర్వాత ఈ ఆరు ఏ గ్రేడ్ టెంపుల్స్ లో వేములవాడ , భద్రాచలం తెలంగాణ లోకి రావడం జరిగింది. తెలంగాణ రాష్ట్రం, భద్రాద్రి కొత్త గూడెం జిల్లా, భద్రాచలం మండలం లోని రెవెన్యూ గ్రామం భద్రాచలం. ఇక్కడ భక్త రామదాసు నిర్మించిన శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానము కలిగిన గోదావరి నది దక్షిణ తీర పుణ్యక్షేత్రం. దీనిని భద్రాద్రి, శ్రీరామ దివ్యక్షేత్రం అనే పేర్లతో కూడా పిలుస్తారు. పూర్వపు జిల్లా కేంద్రమైన ఖమ్మం పట్టణానికి 105 కి.మీ.ల దూరంలో ఉంది.పూర్వం భద్రుడు అను భక్తుడు శ్రీ రాముడుకి తపస్సు చేసి, తను ఒక కొండగా మారి తనపై శ్రీ రాముడు వెలసే విధంగా వరం పొందాడని అంటారు. ఆ కొండకు భద్రుడు పేరు మీద భద్రగిరి అని తరువాతి కాలంలో ఆ పట్టణానికి భద్రాచలం (భద్ర + అచలం) అని పేరు స్థిరపడింది. గోల్కొండ నవాబు అబుల్ హసన్ తానీషా పాలనా కాలంలో భద్రాచల ప్రాంతానికి తహశీల్దారుగా కంచెర్ల గోపన్న పని చేసేవాడు. ఇక్కడికి సమీపంలోని నేలకొండపల్లి గ్రామానికి చెందిన గోపన్న శ్రీరామ భక్తుడు. తాను ప్రజల నుండి వసూలు చేసిన పన్ను (6 లక్షల రూపాయలు) సొమ్మును ప్రభుత్వా నికి జమ చెయ్యకుండా,1645 - 1680 మధ్య కాలంలో భద్రగిరిపై శ్రీ రాముడు వెలసిన ప్రదేశమందు రామాలయాన్ని నిర్మించాడు. సీతా రామ చంద్ర స్వాములకు రకరకాల నగలు - చింతాకు పతకం, పచ్చల పతకం మొదలైనవి చేయించాడు. ఆ సొమ్ము విషయమై తానీషా గోపన్నను గోల్కొండ కోటలో బంధించగా, ఆ చెరసాల నుండి తనను విముక్తి చెయ్యమని రాముణ్ణి గోపన్న ప్రార్థించాడు. ఆ సందర్భం లో రామునిపై రచించి, పాడిన పాటలే రామదాసు కీర్తనలుగా ప్రసిద్ధి చెందాయి. గోపన్న కీర్తనలకు తన్మయత్వం చెందిన రాముడు, దేవాలయ నిర్మాణానికి ఉపయోగిం చిన ప్రభుత్వ సొమ్మును తానీషాకు చెల్లించి, గోపన్నకు చెరసాల నుండి విముక్తి ప్రసాదించాడని ఐతిహ్యం. అలా కంచెర్ల గోపన్నకు రామదాసు అనే పేరు వచ్చింది. దేవాలయమందు సీతా, లక్ష్మణ, హనుమంత సమేతంగా శ్రీరామ చంద్రుడు ఇక్కడ అత్మారాముని రూపంలో కొలువుతీరి ఉన్నాడు. సీత, రాముని తొడపై కూర్చొని ఉన్నట్లు ఇక్కడి విగ్రహాలు చెక్కబడి ఉన్నాయి. మరే దేవస్థానం లోనూ లేని ప్రత్యేకత ఇది. ప్రతి సంవత్సరం శ్రీరామ నవమికి వైభవంగా జరిగే సీతారామ కళ్యాణ ఉత్స వానికి అశేష ప్రజానీకం వస్తారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కళ్యాణోత్స వానికి ముత్యపు తలంబ్రాలు, పట్టు వస్త్రాలు పంపించడం సాంప్రదాయం. ఇక్కడ శ్రీరామ పట్టాభిషేకం వైభవంగా జరుగుతుంది. రామ దాసు చేయించిన వివిధరకాల నగలు దేవస్థానపు ప్రదర్శనశాలలో ప్రదర్శనకు ఉంచారు. భద్రాచలం లోని శ్రీరాముడిని వైకుంఠ రాముడు అని అంటారు. ఇక్కడి రాముడు వైకుంఠమునకు వెళ్ళిన తరువాత మరల భూమి మీదకి వచ్చి, తన భక్తుడైన భద్రుడి కోరిక తీర్చి భద్ర పర్వతంపై నిలిచాడు.భద్రాద్రి శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో శ్రీరామనవమి కల్యాణ బ్రహ్మోత్సవాల సందడి ఊపందుకుంది. కళ్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. కల్యాణ బ్రహ్మోత్సవాల్లో 27న కల్యాణం, 28న పట్టాభిషేకం నిర్వహించ నున్నారు.

బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఇప్పటికే భద్రాచలం పట్టణాన్ని అందంగా ముస్తాబు చేశారు. పట్టణ ప్రధాన కూడళ్లలో స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. రామాలయానికి, మిథిలా స్టేడియానికి రంగులు వేసి విద్యుత్ లైట్లను అలంకరించారు. రాములోరి కళ్యాణం, పట్టాభిషేకం జరిపే మిథిలా ప్రాంగణంలో సెక్టార్‌ల వారీగా బారికేడ్లను ఏర్పాటు చేస్తున్నారు. కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ వేడుకలకు సుమారు లక్ష మందికి పైగా భక్తులు భద్రాచలం వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో అందుకు తగ్గ ఏర్పాట్లను ప్రభుత్వం చేస్తోంది. ఇప్పటికే అధికారులు శ్రీరామనవమి వేడుక నిర్వహణపై పలుమార్లు దేవస్థాన ఈవో దామోదర్ రావు ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు ఏర్పాట్లలో తలమునకలయ్యారు. కల్యాణ మహోత్సవంలో వినియోగించే తలంబ్రాలకు ఎంతో ప్రత్యేకత ఉంది. సాధారణంగా రోజువారి నిత్య కల్యాణంలో ఉపయోగించే తలంబ్రాలు పసుపు రంగులో ఉంటాయి. అయితే ఏడాది కోసారి నిర్వహించే కల్యాణ మహోత్సవాల్లో మాత్రం తలంబ్రాలు ఎరుపు రంగులో ఉంటాయి. భద్రాద్రిలో ఈ తలంబ్రాలను ప్రత్యేకంగా తయారు చేస్తారు. బియ్యంలో పసుపు, కుంకుమ, నెయ్యి, బుక్కా, గులాములు, సుగంధ ద్రవ్యాలు కలిపి తలంబ్రాలను తయారు చేస్తారు. ఇలా తలంబ్రాలను తయారు చేయడం భక్త రామదాసు కాలం నుంచి ఆచారంగా వస్తోంది. గత కొన్ని సంవత్సరాల నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల భక్తులు.. వడ్లను గోటితో వలిచి సీతారాముల కల్యాణంలో వినియోగించేందుకు భద్రాచలం తీసుకువస్తున్నారు. తూర్పు గోదావరి జిల్లా, వరంగల్, కరీంనగర్, కొత్తగూడెం, మణుగూరు, హైదరాబాద్?లోని భక్తులు గోటితో వలిచిన వడ్లను స్వామివారికి సమర్పిస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా భద్రాద్రి రామయ్యకు కోటి గోటి తలంబ్రాలు సమర్పిస్తున్న మహిళలు ఈ ఏడాది క్వింటాళ్ల వడ్లను వలిపించి భద్రాద్రి సన్నిధికి అందించారు. ఈనెల 27న జరగనున్న సీతారాముల కళ్యాణం మహోత్సవంలో ఈ కళ్యాణ తలంబ్రాలను వాడనున్నారు. శ్రీరామనవమి రోజున తలంబ్రాలకు కౌంటర్లు, ప్రసాదాలకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. ముత్యాల తలంబ్రాల పొట్లాలను ఆర్టీసీ కార్గో, ద్వారా బుక్ చేసుకున్న వారికి పంపిస్తారు. నేరుగా కౌంటర్ల లోనూ విక్రయించ నున్నారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆన్‌లైన్‌లో సైతం భక్తులు కళ్యాణోత్సవాలను వీక్షించేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రప్రథమంగా ప్రభుత్వ పక్షాన పట్టు వస్త్రాలు తలంబ్రాలు సమర్పించ నున్నారు.

# జనసేపు వైపు నేతల చూపు

**కాకినాడ, మార్చి 26, పెన్ పవర్:** దేశవ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీ సీట్ల పెంపుతో ఏపీ పొలిటికల్స్‌లో సరికొత్త డిస్కషన్ స్టార్ట్ అయింది. ఏపీలో 175గా ఉన్న అసెంబ్లీ స్థానాలు 269కి, 25 లోక్‌సభ సీట్లు 38కి పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. సీట్ల పెరుగుదల టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికే ఎక్కువ ప్లస్ పాయింట్ అవుతుందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. 175 సీట్లలో 164 సాధించిన కూటమి, 269 సీట్లలో 135 మ్యాజిక్ ఫిగర్‌ను ఈజీగా చేరుకోవచ్చని అంచనాలు ఉన్నాయి. అధికారంలో ఉన్న కూటమి పునర్విభజనను తమకు అనుకూలంగా మార్చుకునే అవకాశం ఉంది. అయితే ఆల్రెడీ 175 నియోజకవర్గాల్లోనే బలమైన అభ్యర్థులు లేక ఇబ్బంది పడుతున్న వైసీపీకి..పెరిగే సీట్లలో క్యాండిడేట్స్‌ను నిలబెట్టడం, గెలుపు గుర్రాలను ఎంపిక చేయడం పెద్ద సవాల్‌గా మారే ఛాన్స్ ఉందంటున్నారు. మహిళా రిజర్వేషన్లు, సీట్ల పెంపు ఫ్యాన్ పార్టీకి ఇబ్బందికర సిచ్యువేషన్స్‌ను క్రియేట్ చేయొచ్చన్న చర్చ జరుగుతోంది.టీడీపీలో టికెట్ ఆశావహులు ఎక్కుగానే ఉంటారు. గత ఎన్నికల్లోనే తమకు సీటు ఇవ్వలేదని అలిగిన నేతలు..సీటు త్యాగం చేసి పదవులు దక్కట్లేదన్న అసంతృప్తిలో ఉన్న నేతలు చాలామందే ఉన్నారు. అలాంటి వారికి సీట్ల పెంపుతో అవకాశం దక్కడం పక్కా. కూటమిగా వెళ్లినా సొంత పార్టీ నేతలకు టికెట్ల కేటాయింపు చంద్రబాబుకు ఈజీ కానుంది. గత ఎన్నికలప్పుడు సీట్ల పంపకాల కోసం పడ్డ ఇబ్బందులు ఈసారి ఉండకపోవచ్చు.ఇక 21 అసెంబ్లీ స్థానాలు, 2 ఎంపీ సీట్లలో పోటీ చేసి గెలిచి వంద శాతం స్ట్రైక్ రేట్ సాధించిన జనసేన వచ్చే ఎన్నికల కోసం ఇప్పటినుంచే సమాయత్తం అవుతోంది. యువతకు ఎక్కువ అవకాశాలు ఇచ్చే యోచనలో పవన్ కల్యాణ్ ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అసెంబ్లీ, లోక్ సభ సీట్ల పెంపు జనసైనికులకు వరంగా మారే అవకాశం ఉంది. అయితే టీడీపీతో పొత్తులో ఉండటంతో తమకు రాజకీయ అవకాశాలు దక్కవేమోనన్న ఆందోళనలో ఉన్న పలువురు జనసేన నేతలకు గతంలోనే క్లారిటీ ఇచ్చారు పవన్.రిజర్వేషన్లు, స్థానిక పరిస్థితులు, పొత్తులను బట్టి టికెట్లు



వస్తాయి. సీటు రాని వారికి నామినేటెడ్ పోస్టులు దక్కుతాయంటూ భరోసా ఇచ్చారు. అలా ఆయన మాటే శాసనంగా జనసేన కోసం పని చేస్తున్న వారికి సీట్ల సంఖ్య పెంపు స్వీట్ న్యూస్‌గా మారనుంది. గత ఎన్నికల్లో జనసేన నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచిన 21 మందిలో ఎక్కువ మంది కొత్త వాళ్లే. పైగా కార్యకర్త స్థాయి నేతలకు టికెట్ ఇచ్చి చట్టసభల్లో అడుగు పెట్టే అవకాశం కల్పించారు పవన్. రాబోయే ఎన్నికల్లో మరింత మంది యువ నేతలకు అవకాశాలు దక్కనున్నాయి. పైగా మహిళ రిజర్వేషన్లు అమల్లోకి వస్తే వీర మహిళలకు సీట్లు దక్కనున్నాయి. దీంతో ఇప్పుడు అందరి చూపు జనసేన వైపు అన్నట్లుగా మారిపోయింది సీన్.జనసేనలోకి వెళ్తే సీటు గ్యారెంటీ. ఇప్పుడీ ఈక్వేషన్ ఏపీ పాలిటిక్స్‌లో తెగ ఇంట్రెస్టింగ్‌గా మారింది. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలని ఆశపడుతున్నవారికి జనసేన బెస్ట్ ఆప్షన్‌గా కనిపిస్తోందట. ఈసారి పొత్తులో భాగంగా జనసేనకు గతంలో కంటే డబుల్, ట్రిపుల్ సీట్లు దక్కుతాయని ఆశావహులు లెక్కలేసుకుంటున్నారు. ఏపీ అసెంబ్లీలో సీట్ల సంఖ్య 269కి చేరితే జనసేనకు యాభై నుంచి డెబ్బై ఎమ్మెల్యే సీట్లు దక్కుతాయనేది కొందరి అంచనా. ఇక లోక్‌సభ సీట్లు 38కి పెరిగితే..జనసేన పది దాకా లోక్‌సభ సీట్లలో పోటీ చేసే ఛాన్స్ ఉందనేది ఇంకో లెక్క. ఈ క్రమంలో ఇప్పటి నుంచే జనసేనలో చేరి జనంలోనూ, పవన్ దృష్టిలోనూ పడితే టికెట్ తమకే దక్కుతుందని..వన్స్ పార్టీ బీఫామ్ దక్కితే గెలుపు ఈజీ అవుతుందని మాస్టర్ ప్లాన్ వేసుకుంటున్నారట పలువురు నేతలు.జనసేన తలుపులు తెరిస్తే చాలు గాజు గ్లాస్‌లో టీ తాగేందుకు తెగ ఇంట్రెస్ట్ చూపిస్తున్నారట పలువురు లీడర్లు. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన నేతలు..జనసేనవైపు చూస్తున్నారట. అసెంబ్లీ, లోక్‌సభ సీట్ల పెంపు జనసైనికులకు, జనసేనకు నయా జోష్ తెస్తుందన్న టాక్ అయితే బలంగా వినిపిస్తోంది.

# 11 నగరాల్లో ఈ బస్ సౌకర్యం

**తిరుపతి, మార్చి 26, పెన్ పవర్:** ఏపీకి కేంద్రం నుంచి ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయి. కేంద్రం అందిస్తోన్న పీఎం ఈ-బస్ సేవా పథకంలో భాగంగా మొదటి దశలో 11 నగరాల్లో 750 విద్యుత్ బస్సులు రాబోతున్నాయని సీఎస్ సాయిప్రసాద్ తెలిపారు. ఈ మేరకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. పీఎం ఈ బస్ సేవా ఫథకం పూర్తి స్థాయిలో వినియోగానికి సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు.ఆంధ్రప్రదేశ్‌కు త్వరలోనే 750 విద్యుత్ బస్సులు రాబోతున్నాయన్నారు సీఎస్ సాయిప్రసాద్. ఈ విద్యుత్ బస్సులకు అవసరమైన ఏర్పాట్లు త్వరగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. కేంద్రం ఏపీకి పీఎం ఈ బస్ సేవా పథకం కింద 750 బస్సులు కేటాయించిందన్నారు.. వీటిని రాష్ట్రంలోని 11 నగరాల్లో అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఈ ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణపై సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇవ్వాలని అధికారులకు సీఎస్ సూచించారు. ఈ బస్సుల్ని నడిపేందుకు అవసరమైన సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు సీఎస్.

రాష్ట్రంలో విద్యుత్ బస్సులు అందుబాటులోకి వస్తే.. ఇంధన పొదుపుతో పాటుగా కాలుష్యం నియంత్రణలో ఉంటుందన్నారు. విద్యుత్ బస్సులకు కావాల్సిన మౌలిక వసతుల కోసం మొత్తం 12 డిపోల పరిధిలో 129.51 కోట్లు వెచ్చిస్తున్నామన్నారు రవాణాశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి ఎంటీ కృష్ణబాబు. ఈ నిధుల్లో కేంద్రం 60శాతం, రాష్ట్రం



40శాతం భరిస్తున్నాయ్నారు. ఈ విద్యుత్ బస్సుల్ని విశాఖపట్నం, కాకినాడ, రాజమహేంద్రవరం, విజయవాడ, అమరావతి, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, కడప, అనంతపురం, కర్నూలు నగరాల్లో ఈ-బస్సులు అందుబాటులోకి వస్తాయన్నారు ఆర్టీసీ అధికారులు. ఇప్పటికే తిరుపతిలో 100 విద్యుత్ బస్సులు ప్రవేశ పెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే రాష్ట్రంలో 15 ఏళ్లు దాటిన బస్సులను పూర్తిగా తొలగించాలని సీఎస్ అధికారులకు సూచించారు.మరోవైపు ఆర్టీసీ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వారందరికి ఎస్‌బీఐ జనరల్ హెల్త్ ఇన్స్యూరెన్సుథకం ప్రారంభమైంది. ఆర్టీసీ ఎండీ ఎన్.బాలసుబ్రమణ్యం బ్రోచర్, సర్క్యులర్‌ను ఆవిష్కరించారు. ఈ బీమా పథకం ద్వారా ఆకస్మికంగా అనారోగ్య పరిస్థితుల్లో ఉద్యోగులపై ఆర్థిక భారం పడకుండా, మెరుగైన చికిత్స పొందేందుకు ఉపయోగపడుతుందన్నారు ఎండీ. దీనిలో కూడా రెండు పథకాలు (సాప్‌హైర్ క్లాసిక్ పాలసీ, సాప్‌హైర్ సూపర్ టాప్‌అప్ పాలసీ) ఉన్నాయన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు ఈ రెండింటిలో ఏదైనా ఎంపిక చేసుకోవచ్చు. ఆర్టీసీ ఉద్యోగి, భార్య/భర్త, వారి ఇద్దరు పిల్లలు వైద్యం పొందొచ్చు. ఈ పాలసీలో రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు కవరేజ్.. ఒకసారి చేరితే, ఉద్యోగ విరమణ తర్వాత కూడా కొనసాగించొచ్చు.

# చందనోత్సవ ఏర్పాట్లు సిద్ధం..

**విశాఖపట్టణం, మార్చి 26, పెన్ పవర్:** సింహాచలం లక్ష్మీనృసింహ స్వామి చందనోత్సవం ఏప్రిల్ 20న జరగనుంది.. ఆలయంలో ఏర్పాట్లపై ముందుగానే ప్రభుత్వం దృష్టిపెట్టింది. విశాఖపట్నం జిల్లా ఇంఛార్జ్ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి చందనోత్సవం ఏర్పాట్లపై ఎమ్మెల్యేలు, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ అధికారులతో కలిసి సమీక్ష చేశారు. గత అనుభవాల దృష్ట్యా ఈసారి ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు మంత్రి స్వామి. చందనోత్సవంలో సాధారణ భక్తులకు పెద్దపీట వేయాలన్నారు. అన్నిశాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనులు చేయాలని ఆదేశించారు. ఏప్రిల్ 17నాటికి చందనోత్సవం టికెట్ల జారీ ప్రక్రియను పూర్తి చేయాలని.. వాహన పాసులు, డ్యూటీ పాసుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.చందనోత్సవానికి సంబంధించి దర్శనాల టికెట్ల విషయంలో ఎలాంటి గందరగోళం లేకుండా చూడాలని ఎమ్మెల్యేలు కోరారు. గతేడాది చందనోత్సవానికి సంబంధించి రాత్రి 11 గంటల వరకు భక్తులకు టికెట్లు ఇవ్వలేదన్నారు. ఈసారి మూడు రోజులు ముందుగా జారీ చేయాలని.. టికెట్ల లెక్క పక్కాగా ఉండాలన్నారు. కలెక్టర్, ఈవోల చేతుల మీదుగా టికెట్లు జారీ చేస్తే బావుంటుందని సూచించారు. అలాగే టికెట్లపై క్యూఆర్ కోడ్, స్లాట్ వివరాలు ఉండేలా చూడాలని కోరారు.చందనోత్సవం రోజు దర్శనాల కోసం వేర్వేరుగా క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు కలెక్టర్ హరేంధిరప్రసాద్. రూ.300, రూ.1000, రూ.1500 దర్శన టికెట్లు ఉన్న భక్తులకు విడివిడిగా క్యూ లైన్లు ఉంటాయన్నారు. వీరిలో రూ.1500 టికెట్ ఉన్న భక్తులు మాత్రం భోగమండపం నుంచి స్వామిని దర్శించుకోవచ్చున్నారు. చందనోత్సవం రోజు అప్పన్నకు ముందుగా సుప్రభాత సేవ నిర్వహిస్తారని.. అనంతరం వ్యవస్థాపక ధర్మకర్తలకు తొలి దర్శనం ఉంటుందన్నారు.ఏపీ ప్రభుత్వం, టీటీడీ తరపున అప్పన్నకు పట్టువస్త్రాలు సమర్పిస్తారని.. వేకువజామున 4.30 గంటల నుంచి వీఐపీ దర్శనాలకు అనుమతిస్తామన్నారు. అంతరాలయ దర్శనాలు కూడా ఉండవని వివరించారు. చందనోత్సవం కోసం వచ్చే భక్తుల కోసం కొండ


దిగువన 50 ఆర్టీసీ బస్సుల్ని అందుబాటులో ఉంచుతామని కలెక్టర్ తెలిపారు. చందనోత్సవం కోసం అవసరమైన భద్రతా చర్యలు తీసుకుంటామని విశాఖపట్నం సీపీ శంఖబ్రతబాగ్చీ వివరించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామన్నారు. చందనోత్సవానికి వచ్చే చిన్నారులకు ట్యాగ్‌లు అమలు చేస్తామన్నారు.

## ఇక పదవులే.. పదవులు

**విజయవాడ, మార్చి 26, పెన్ పవర్:** రాజకీయం చేయాలంటే అవకాశాలు దక్కాలి. అవకాశాలు దక్కాలంటే రాజకీయం చేయాలి. అయితే ఉన్న పదవుల తక్కువ.. నేతలు ఎక్కువ అన్నట్టు పరిస్థితి ఉండేది. అయితే ఆంధ్రప్రదేశ్లో నియోజకవర్గాల పునర్విభజనతో కేవలం ఎమ్మెల్యేలు, ఎంపీల సీట్లు మాత్రమే కాదు వందలాది పదవులు పుట్టుకొస్తాయి. వందలాదిమంది కొత్త ముఖాలు రాజకీయాల వైపు వస్తాయి. ఆర్థికంగా ఉన్నవారు.. పారిశ్రామికవేత్తలు ఇలా అందరూ రాజకీయాల వైపు రావడం ఖాయం. ఎందుకంటే గత 20 ఏళ్లుగా అదే జరుగుతోంది. ఇప్పుడు ఈ పదవుల పెంపుతో సైతం అదే జరగనుంది.ప్రస్తుతం ఏపీలో 175 అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. పునర్విభజనతో మరో 80 సీట్లు పెరుగుతాయి. పార్లమెంట్ స్థానాలు 25 ఉన్నాయి. మరో 13 వరకు పెరగనున్నాయి. అయితే ఇప్పటివరకు ఎమ్మెల్సీలు ఏపీ నుంచి 52 మంది దాకా ఉండేవారు. వాటి సంఖ్య మరో 25 పెరగనున్నాయన్నమాట. రాజ్యసభ సీట్లు 11 ఉండేవి. అవి ఐదు నుంచి 6 వరకు పెరుగుతాయి. అయితే కేవలం నియోజకవర్గాల పునర్విభజన మాత్రమే కాదు. మున్సిపాలిటీలతో పాటు మండలాలు, పంచాయితీలు కూడా పెరుగుతాయి. అంటే టోటల్ గా వందలాది పదవులు లభించనున్నాయి కొత్తవారికి. అయితే ఇది కొత్తగా ఆశావహులకు చక్కటి అవకాశం కూడా.గత రెండు దశాబ్దాలుగా రాజకీయాలు పూర్తిగా మారిపోయాయి. అప్పట్లో పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా చాలామంది నేతలు పార్టీల్లో చేరేవారు. పార్టీల్లో సేవలు అందించేవారు. వారి సేవలను గుర్తించి పదవులు ఇచ్చేవారు. ఇప్పుడు మాత్రం ఆ పరిస్థితి లేదు. ఆర్థికంగా బలమైన వారికి అవకాశాలు దక్కుతున్నాయి. పార్టీ కోసం పని చేసే వారికి చాలా తక్కువ అవకాశాలు లభిస్తున్నాయి. రాజకీయం డబ్బుమయంగా మారడంతో నిజమైన రాజకీయాలు చేసే వారు కూడా పక్కకు తప్పుకుంటున్నారు. కేవలం డబ్బుతో రాజకీయం చేసిన వారు కూడా ఉన్నారు. అయితే ఇప్పుడు ఏపీలో పదవులు పెరగడంతో కొత్తవారికి అవకాశం కలుగుతుంది. చాలామంది నేతలు ఇప్పటినుంచే తమను తాము ప్రమోట్ చేసుకుంటున్నారు. నియోజకవర్గస్థాయి నేతలుగా మారుతున్నారు. పునర్విభజనతో పెరగనున్న పదవులతో కొత్తవారికి చాలా అవకాశాలు పుష్కలం.. అయితే అందులో సద్వినియోగం చేసుకునేది కొందరే. ఎందుకంటే అందరికీ అవకాశాలు రావు కూడా. అయితే అంది వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటే మాత్రం రాజకీయాల్లో రాణించడం చాలా సులువు. అయితే ఇప్పటివరకు రాజకీయాల్లో రాణించిన వారు ఒక ఎత్తు అయితే.. పునర్విభజనతో మరికొంతమంది తెరపైకి వచ్చే ఛాన్స్ మాత్రం కనిపిస్తోంది.

## మూడు నెలలు మాడు పగిలే ఎండలు

**విజయవాడ, మార్చి 26, పెన్ పవర్:** అప్పుడే ఎండలు మండిపోతున్నాయి. సూర్యుడు నిప్పులు కురిపిస్తున్నాడు. సమ్మర్ సుర్రు మంటోంది. తెలుగు రాష్ట్రాలు నిప్పుల కొలిమిని తలపిస్తున్నాయి. ఉష్ణోగ్రతలు అమాంతం పెరిగిపోయాయి. స్టార్టింగ్ లోనే ఎండల తీవ్రత ఇలా ఉంటే.. ముందు ముందు మరెలా ఉంటుందో అనే భయం ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోందిఈ



క్రమంలో ఏపీలో ఎండలకు సంబంధించి ప్రజలను అప్రమత్తం చేసింది ప్రభుత్వం. రానున్న మూడు నెలలు రాష్ట్రంలో తీవ్ర ఎండలు, వడగాల్పుల హెచ్చరిక జారీ చేసింది. ఈ హాట్ సమ్మర్ లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి సూచించారు. రాష్ట్రంలో ఇప్పటికే 40-42డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని.. రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్, జలవనరుల శాఖలకు సమన్వయ ఆదేశాలు జారీ చేశారు. గ్రామాల్లో పశువులకు నీటి తొట్టెలు నింపాలని ఆదేశించారు.కూలీలు ఉదయం 11లోపు పనులు ముగించాలని సూచించారు. పని స్థలాల్లో తాగునీరు, మజ్జిగ, టెంట్లు, ఫస్ట్ ఎయిడ్ తప్పనిసరి చేశారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీరు, సౌకర్యాలు కల్పించాలన్నారు. నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌కోకు ఆదేశాలు ఇచ్చారు. హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్-2026 అమలు చేయాలన్నారు. స్టేట్, జిల్లా, డివిజన్ స్థాయిలో నోడల్ అధికారులను నియమించనున్నారు. ఎండల తీవ్రతపై ముందస్తు అలర్ట్ లు ఇవ్వాలని ఆర్టీజీఎస్‌కు ఆదేశాలు ఇచ్చారు. ఎండల తీవ్రతపై ప్రజల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు.ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 వరకు బయటకు రావొద్దని సూచించారు. వడదెబ్బ ప్రమాదంపై వైద్యులు హెచ్చరికలు జారీ చేశారు. శరీర ఉష్ణోగ్రత పెరిగి ప్రాణాపాయం కలగొచ్చన్నారు. వడదెబ్బ బారిన పడకుండా ఎక్కువగా నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో గరిష్టంగా 42.6డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మార్చి నుంచి మే మధ్య వడగాల్పుల తీవ్రత అధికంగా ఉంటుందని అంచనా వేశారు

## వారిపై వేటు తప్పదు...

**విజయవాడ, మార్చి 26, పెన్ పవర్:** తెలుగుదేశం పార్టీ ఈసారి కూడా సర్వే నివేదికల ఆధారంగానే టిక్కెట్లను ఖరారు చేయనున్నారు. అసెంబ్లీ నియోజకవర్గాలు 263కు పెరుగుతుండటంతో కనీసం రెండు వందల స్థానాలకు కాస్త అటు ఇటుగా టీడీపీ పోటీ చేసే అవకాశముంది. అయితే ప్రస్తుతమున్న అనుభవంతో ఈసారి మాత్రం పార్టీ విధేయులకు పట్టం కట్టాలని యోచిస్తున్నారని తెలిసింది. గత ఎన్నికల్లో యువకులు, సామాజికవర్గంతో పాటు, వారి ఆర్థిక స్థితిని చూసి టిక్కెట్లను కేటాయించారు. అయితే అది చాలా వికటించింది. ఎక్కువ మంది ఎమ్మెల్యేలు 2024 ఎన్నికల్లో గెలిచి గాడి తప్పుతున్నారు.తాము వేసిన అంచనాలకు వారి పనితీరుకు మధ్య పొంతన లేకుండా పోయింది. సీనియర్ నేతలను పక్కన పెట్టి కొంత తప్పు చేశామని ఇప్పుడు పార్టీ నాయకత్వం పునరాలోచనలో పడింది. కొత్తగా వచ్చిన నేతలకు పార్టీ పట్ల కమిట్ మెంట్ లేకపోవడంతో పాటు క్యాడర్ ను దగ్గరకు తీసుకోకపోవడంతో పాటు తమ వ్యాపారాల పైనే ఎక్కువ ఫోకస్ పెట్టినట్లు స్పష్టంగా తమకు అందుతున్న వివిధ సంస్థలు, నిఘా నివేదికల ద్వారా అందుతున్నాయి.ఎమ్మెల్యేలు పనితీరు మార్చుకోవాలని చంద్రబాబు పదే పదే చెబుతున్నారు. అయినా చాలా మందిలో మార్పు రావడం లేదు.తాము మొదటి సారి గెలిచి మోనార్క్ లమని భావిస్తూ నియోజకవర్గాన్ని పట్టించుకోకపోవడం, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను చేరవేయడం లేదన్నది నిర్ధారణ అయింది. అందుకే ఈ సారి ట్రాక్ రికార్డు చూసిన తర్వాత మాత్రమే టిక్కెట్ ఇవ్వాలని చంద్రబాబు, లోకేశ్ లు దాదాపుగా నిర్ణయించినట్లు సమాచారం. నియోజకవర్గాలు ఎక్కువగా ఉన్నందున ఎక్కువ స్థానాలను గెలుచుకోవాల్సిన అవసరం ఏర్పడటంతో ఈసారి అభ్యర్థుల ఎంపికలో దిద్దుబాటు చర్యలతో పాటు సీనియర్ నేతలకుకూడా అవకాశాలు కల్పించడంపై నాయకత్వం పునరాలోచనలో పడినట్లు తెలిసింది. మరి ఎన్నికల నాటికి అందే నివేదికలను బట్టి నిర్ణయం ఉంటుందని చెబుతున్నారు.

## కనిపించని సమన్వయం

**విశాఖపట్టణం, మార్చి 26, పెన్ పవర్:** తెలుగుదేశం పార్టీ ఈసారి కూడా సర్వే నివేదికల ఆధారంగానే టిక్కెట్లను ఖరారు చేయనున్నారు. అసెంబ్లీ నియోజకవర్గాలు 263కు పెరుగుతుండటంతో కనీసం రెండు వందల స్థానాలకు కాస్త అటు ఇటుగా టీడీపీ పోటీ చేసే అవకాశముంది. అయితే ప్రస్తుతమున్న అనుభవంతో ఈసారి మాత్రం పార్టీ విధేయులకు పట్టం కట్టాలని యోచిస్తున్నారని తెలిసింది. గత ఎన్నికల్లో యువకులు, సామాజికవర్గంతో పాటు, వారి ఆర్థిక స్థితిని చూసి టిక్కెట్లను కేటాయించారు. అయితే అది చాలా వికటించింది. ఎక్కువ మంది ఎమ్మెల్యేలు 2024 ఎన్నికల్లో గెలిచి గాడి తప్పుతున్నారు.వేసిన అంచనాలకు వారి పనితీరుకు మధ్య పొంతన లేకుండా పోయింది. సీనియర్ నేతలను పక్కన పెట్టి కొంత తప్పు చేశామని ఇప్పుడు పార్టీ నాయకత్వం పునరాలోచనలో పడింది. కొత్తగా వచ్చిన నేతలకు పార్టీ పట్ల కమిట్ మెంట్ లేకపోవడంతో పాటు క్యాడర్ ను దగ్గరకు తీసుకోకపోవడంతో పాటు తమ వ్యాపారాల పైనే ఎక్కువ ఫోకస్ పెట్టినట్లు స్పష్టంగా తమకు అందుతున్న వివిధ సంస్థలు, నిఘా నివేదికల ద్వారా అందుతున్నాయి.ఎమ్మెల్యేలు పనితీరు మార్చుకోవాలని చంద్రబాబు పదే పదే చెబుతున్నారు. అయినా చాలా మందిలో మార్పు రావడం లేదు.తాము మొదటి సారి గెలిచి మోనార్క్ లమని భావిస్తూ నియోజకవర్గాన్ని పట్టించుకోకపోవడం, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను చేరవేయడం లేదన్నది నిర్ధారణ అయింది. అందుకే ఈ సారి ట్రాక్ రికార్డు చూసిన తర్వాత మాత్రమే టిక్కెట్ ఇవ్వాలని చంద్రబాబు, లోకేశ్ లు దాదాపుగా నిర్ణయించినట్లు సమాచారం. నియోజకవర్గాలు ఎక్కువగా ఉన్నందున ఎక్కువ స్థానాలను గెలుచుకోవాల్సిన అవసరం ఏర్పడటంతో ఈసారి అభ్యర్థుల ఎంపికలో దిద్దుబాటు చర్యలతో పాటు సీనియర్ నేతలకుకూడా అవకాశాలు కల్పించడంపై నాయకత్వం పునరాలోచనలో పడినట్లు తెలిసింది. మరి ఎన్నికల నాటికి అందే నివేదికలను బట్టి నిర్ణయం ఉంటుందని చెబుతున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# ఏపీలో మరో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుకు ఘోర ప్రమాదం



**మార్కాపురం: పెన్ పవర్:** మార్కాపురంలో ఒక ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుకు ఘోర ప్రమాదం జరిగింది. టిప్పర్ లారీని ఢీకొని బస్సు పూర్తిగా దగ్ధమైంది. ఘటనలో పది మంది సజీవ దహనం అయ్యారు. మార్కాపురం జిల్లాలోని రాయవరం సమీపంలో ఉన్న క్వారీల వద్ద టిప్పర్ లారీని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొంది. క్షణాల్లోనే మంటలు వ్యాపించి బస్సు, లారీ పూర్తిగా దగ్ధమైయ్యాయి. నిర్మల్ నుంచి నెల్లూరుకు హరికృష్ణ ట్రావెల్స్ కు చెందిన ఈ బస్సు వెళుత్వొ. ఘటన సమయంలో బస్సులో 40 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం.

# మార్కాపురం జిల్లాలో రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు దిగ్భ్రాంతి

**అమరావతి, మార్చి 26: పెన్ పవర్:** మార్కాపురం జిల్లా, రాయవరం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. టిప్పర్-ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొన్న ఘటనలో బస్సులోని పలువురు ప్రయాణికులు సజీవ దహనం కావడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంపై ముఖ్యమంత్రి అధికారులతో మాట్లాడారు. గాయపడిన వారికి అందుతున్న వైద్య సాయంపై ముఖ్యమంత్రి సమాచారం తెలుసుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని నిర్మల్ నుంచి నెల్లూరుకు హరికృష్ణ ట్రావెల్స్ కు చెందిన ఈ బస్సు వెళుతున్నట్లు అధికారులు తెలిపారు. ప్రమాదంలో గాయపడిన మరో 20 మందిని తక్షణమే వివిధ ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నామని జిల్లా పోలీసు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మృతుల సంఖ్యపెరిగే అవకాశం ఉందన్న సమాచారంపై ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

# దీదీ దిమ్మ తిరిగే ప్లాన్ వేసిన బీజేపీ..!

**కోల్ కత్తా, మార్చి 26, పెన్ పవర్: :** ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో అన్నింటికన్నా కీలకమైనది పశ్చిమబెంగాల్. ఇక్కడ 15 ఏళ్లుగా తృణమూల్ పాలన కొనసాగుతోంది. నాలుగోసారి ఎన్నిక కావడానికి మమత సర్వశక్తులు ఒడ్డుతోంది. ఈసారి పాగా వేయాలని బీజేపీ ప్రయత్నిస్తోంది. గత ఎన్నికల్లో మమత ఓడిపోతుందని ఎగ్జిట్‌పోల్స్ తెలిపాయి. కానీ మమత హ్యాట్రిక్ కొట్టారు. ఈసారి ఏడు అంశాలు ఎన్నికలను ప్రభావితం చేయబోతున్నాయి. 2021లో టీఎంసీకి 213 సీట్లు, బీజేపీకి 77 సీట్లతో రెండో స్థానం సాధించింది. అయితే ఈ ఎన్నిల్లో మమతా బెనర్జీకి ఏడు సవాళ్లు ఎదురవుతున్నాయి.ఎన్నికల సంఘం 1.5 లక్షల మంది భద్రతా సిబ్బందిని రంగంలోకి దించి గుండా రిగ్గింగ్‌ను అరికట్టుతోంది. గతంలో టీఎంసీకి అనుకూలంగా ఉన్న సీఎస్, డీజీపీ, పోలీస్ అధికారులను బదిలీ చేసి అధికారాలను పరిమితం చేసింది. ఇది టీఎసీకి పెద్ద దెబ్బగా మారుతోంది.గేటెడ్ కమ్యూనిటీల్లో బూత్‌లు ఏర్పాటు చేయడంతో ఓటర్లు బెదిరింపు భయం లేకుండా ఓటు వేయగలరు, గుండా ప్రభావం తగ్గుతుంది. ప్రతి బూత్‌లో లైవ్ టెలికాస్ట్‌తో దొంగ ఓట్లు, గొడవలను రియ/ల్ టైమ్‌లో పర్యవేక్షించి రీపోలింగ్‌కు అవకాశం ఏర్పడుతోంది. ఓటింగ్ శాతం 80% పైకి ఎక్కే అవకాశం ఉంది.స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ( సర్)తో 68 లక్షల పేర్లు తొలగించారు బంగ్లాదేశ్ వలసులు, డూప్లికెట్లు, మర్మల్ ఓటర్లు, స్థానికంగా లేని వారిని గుర్తించి రద్దు చేశారు. 2021లో టీఎంసీకి 2.80 కోట్ల ఓట్లు, బీజేపీకి 2.29 కోట్లు (తేడా 60 లక్షలు), ఈ మార్పు టీఎంసీ లీడ్‌ను 5 నుంచి 10 శాతం తగ్గించవచ్చు. ముస్లిం ప్రాంతాల్లో తొలగింపులు ఎక్కువగా టీఎంసీని దెబ్బతీసే అవకాశం ఉంది.ముస్లిం ఓటర్లు 100+ సీట్లలో కీలకం, 2021లో 90 సీట్లు టీఎంసీకి వచ్చాయి. కొత్తగా ఎంఐఎం, ఏజేయూపీ, మరో ముస్లి పార్టీ జట్టు కట్టాయి. దీంతో మమతవైపు ఉన్న ముస్లిం ఓటర్లు చీలిపోయే అవకాశం ఉంది. సర్ తొలగింపులు మరింత ప్రభావితం చేస్తాయి. టీఎంసీ 30 శాతానికిపైగా మైనారిటీ ఓట్లు కోల్పోతే 2025 సీట్లు పోతాయి.బీజేపీ 'మిషన్ బెంగాల్'లో అర్బన్, మధ్యతరగతి బెంగాలీలు, ప్రెసిడెన్సీ ఏరియాపై ఫోకస్ పెట్టింది. సువేందు అధికారి అక్కడ పోటీతో మోదీ జనాదరణను ఉపయోగించాలని. టీఎంసీ 75 అభ్యర్థులను మార్చి టికెట్లు సర్దుబాటు చేసింది, వెల్ఫేర్ స్కీమ్‌లు (లక్ష్మీ బిమా)పై ఆధారపడుతోంది. బీజేపీ అంతర్గత కలహాలు, వర్గపోరాటాలు (19.9% సర్వే రెస్పాండెంట్లు) సవాలుగా ఉన్నాయి.

# సెక్స్‌డ్ సెమెన్ టెక్నాలజీ..

## 90 శాతం ఆడ దూడలు పుట్టే ఛాన్స్

**తిరువనంతపురం మార్చి 26, పెన్ పవర్:** సెక్స్‌డ్ సెమెన్ టెక్నాలజీ సాయంతో దేశీయ జాతులకు చెందిన ఎద్దులతో సహా అధిక జన్యు యోగ్యత కలిగిన వాటి నుంచి వీర్యం సేకరించి, కేవలం ఆడ దూడలను మాత్రమే ఉత్పత్తి చేసేలా టెక్నాలజీతో అభివృద్ధి చేస్తున్నారు. ఈ విధానం మన తెలుగు రాష్ట్రాల్లోనూ అమల్లో ఉంది. ఇందుకోసం ప్రభుత్వం పలు రాయితీలను కూడా అందజేస్తోంది. ఈ విధానంతో 10 శాతం పాడి పశువులకు కృత్రిమ గర్భధారణ చేయాలని ఏపీ లక్ష్యంగా పెట్టుకుంది. 90% వరకు కచ్చితత్వంతో కేవలం ఆడ దూడలను మాత్రమే ఉత్పత్తి చేసే లింగ నిర్ధారణ చేసిన వీర్యం విధానం భారత్ తీసుకొచ్చింది. ఈ వీర్యంతో పాల ఉత్పత్తిని పెంచడమే కాకుండా, మగ దూడల జనాభాను కూడా పరిమితం చేసే అవకాశం ఉంది. భారత్‌లో తొలిసారిగా రాష్ట్రీయ గోకుల్ మిషన్ కింద స్థాపించిన కేంద్రాలు.. దేశీయ పశు జాతుల లింగ నిర్ధారణ చేసిన వీర్యాన్ని విజయవంతంగా ఉత్పత్తి చేస్తున్నాయి. ఈ కేంద్రాలను గుజరాత్, మధ్యప్రదేశ్, తమిళనాడు, ఉత్తరాఖండ్, ఉత్తర్ ప్రదేశ్‌లలో ఉన్న ఐదు ప్రభుత్వ వీర్య కేంద్రాలలో ఏర్పాటు చేశారు.ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో ' సెక్స్‌డ్ సెమెన్ టెక్నాలజీ ' ప్రస్తుతం అందుబాటులో ఉంది. దీని ద్వారా 90% పైగా ఆడ దూడలు పుట్టే అవకాశం ఉంటుంది. ఇందుకోసం ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు పలు రాయితీలు అందిస్తున్నాయి. ఈ పద్ధతి ద్వారా రాష్ట్రంలో 10 శాతం పాడి పశువులకు కృత్రిమ గర్భధారణ చేయాలనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఏపీ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ద్వారా ఈ పథకం అమలు చేస్తోంది. 'స్వర్ణాంధ్ర 2047' విజన్‌లో భాగంగా ఈ సాంకేతికతను భారీగా ప్రోత్సహిస్తోంది. ఈ పథకం కింద రైతులకు 70% వరకు రాయితీ లభిస్తుంది. ప్రైవేట్ మార్కెట్‌లో ఒక డోస్ సుమారు రూ. 500 - రూ. 1,300 ఉండగా.. ప్రభుత్వ రాయితీతో రైతులకు కేవలం రూ. 150 కే అందుబాటులో ఉంది.రైతులు తమ పశువులను 'భారత్ పశుధన్' యాప్‌లో నమోదు చేసుకోవడం ద్వారా ఈ సౌకర్యాన్ని పొందవచ్చు. 2026 నాటికి రాష్ట్రంలోని 10% పాడి పశువులకు ఈ పద్ధతిలో కృత్రిమ గర్భధారణ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.తెలంగాణలోనూ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ రాష్ట్రీయ గోకుల్ మిషన్ కింద ఈ సాంకేతికత అందుబాటులో ఉంది. తెలంగాణలో కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో 50%- 70% వరకు రాయితీపై సెక్స్‌డ్ సెమెన్ డోసులను అందిస్తున్నారు. కరీంనగర్, కాసంపల్లి వంటి సెమెన్ స్టేషన్లను ఈ సాంకేతికతకు అనుగుణంగా ఆధునీకరించారు. ఈ సెమెన్ వాడటం వల్ల 90% ఆడ దూడలే పుడతాయని పశుసంవర్ధక శాఖ ధ్రువీకరించింది.పాడి రైతులకు ఉపయోగపడే పాడి పశువుల (ఆడ దూడల) సంఖ్య పెరుగుతుంది.

# కేరళ అసెంబ్లీ ఎన్నికలపై ఇరాన్ యుద్ధం ప్రభావం...

**తిరువనంతపురం మార్చి 26, పెన్ పవర్:**
పశ్చిమాసియాలో గత నెల 28న మొదలైన యుద్ధం.. యావత్తు ప్రపంచాన్ని అల్లకల్లోలంగా మార్చేస్తోంది. అమెరికా-ఇజ్రాయెల్ దాడులు, ఇరాన్ ప్రతీకార చర్యలతో పశ్చిమాసియా రగలిపోతుంది. ఈ యుద్ధం కారణంగా చమురు ధరలు పైపైకి వెళ్తున్నాయి. ఇక, మన దేశంలోని ఎన్నికలపై కూడా ఈ యుద్ధ ప్రభావం పడుతోంది. ముఖ్యంగా గల్ఫ్ దేశాల నుంచి కేరళకు వచ్చే వారి సంఖ్య తగ్గిపోనుంది. పశ్చిమ్ బెంగాల్, తమిళనాడు, కేరళ సహా ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలకు వచ్చే నెలలో పోలింగ్ జరగనున్న సంగతి తెలిసిందే.దాదాపు నెల రోజులుగా ఇజ్రాయెల్- అమెరికా, ఇరాన్ మధ్య కొనసాగుతోన్న యుద్ధం ప్రపంచ ఇంధన మార్కెట్లను తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. అయితే, ఈ సంఘర్షణ వచ్చే నెల భారత్‌లో జరగనున్న ఐదు రాష్ట్రాల శాసనసభ ఎన్నికల పైనా ప్రభావం చూపనుంది. ముఖ్యంగా కేరళ అసెంబ్లీ ఎన్నికలపై దీని ఎఫెక్ట్ భారీగా పడే అవకాశం ఉంది. ఇది మొత్తం ఫలితాన్నే ఇది ప్రభావితం చేయకపోయినా... కొన్నిచోట్ల గెలుపోటములను నిర్దేశించొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమతున్నాయి. మొత్తం 140 స్థానాలున్న కేరళలో ఏప్రిల్ 9న ఒకే దశలో ఎన్నికల పోలింగ్ జరగనుంది.గల్ఫ్ దేశాలకు ఉపాధి కోసం వెళ్లే భారతీయుల్లో కేరళ వాసులే అధికం. కేరళ మైగ్రేషన్ సర్వే గణాంకాల ప్రకారం.. పశ్చిమాసియాలో దాదాపు 22 లక్షలు మంది కేరళీయులు ఉన్నారు. వీరంతా ఎన్నికల సమయంలో ఓటు వేయడానికి సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్ సహా గల్ఫ్ దేశాల నుంచి సొంత రాష్ట్రానికి వస్తుంటారు. కొన్ని ప్రవాసీ గ్రూపులు వీరి కోసం ఛార్టర్డ్ విమానాలు నడుపుతుంటాయి. ప్రస్తుతం కేరళ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఈస్టర్, ఇతర పండగలు ఉండటంతో అక్కడ నుంచి వచ్చేవారి సంఖ్య భారీగా ఉంటుందని భావించారు.కానీ, యుద్ధం కారణంగా వారు స్వదేశానికి వచ్చేందుకు అనుకూలమైన పరిస్థితి లేకుండా పోయింది. ఇప్పటి వరకూ వేలల్లోనే కేరళకు చేరుకున్నట్టు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈసారి గల్ఫ్ దేశాల నుంచి ఓటేయడానికి వచ్చేవారి సంఖ్య సగానికిపైగా తగ్గొచ్చని అంచనా వేస్తున్నారు. యూఏఈ కేరళ ముస్లిం కల్చరల్ సెంటర్ అధ్యక్షుడు పుథుర్ రెహమాన్ మాట్లాడుతూ.. "ఎన్నికలప్పుడు మేము యూఏఈ నుంచి 8 చార్టర్డ్ విమానాలు ఏర్పాటుచేసేవాళ్లం. కానీ ఈసారి అలాంటి పరిస్థితి లేదు" అని అన్నారు. యుద్ధంతో విమాన ప్రయాణాలను తీవ్రంగా ప్రభావితమయ్యాయి. వేలాదిగా విమానాలు రద్దుకావడం, దుబాయ్, అబుధాబి, దోహ వంటి చోట్ల తాత్కాలికంగా విమానాశ్రయాలను మూసివేశాయి.దీని ప్రభావం నార్త్ కేరళలోని మలప్పురం, కొజికోడ్, కాసర్‌గడ్, పాలక్కాడ్, త్రిశూర్ జిల్లాల్లోని అసెంబ్లీ స్థానాల్లో ఉండనుంది. కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ కూటమిలో కీలక పార్టీ అయిన ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్.. గల్ఫ్ దేశాల నుంచి ఓటర్లతో ఎక్కువ లబ్ధి పొందుతుంటుంది. దీనిపై ఐయూఎంఎల్ ప్రధాన కార్యదర్శి సయ్యిది మునావర్ అలీ సాహిబ్ థంగల్ ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల కోసం చాలా మంది వచ్చే అవకాశం తక్కువగా ఉందని, అయినా వారిని రప్పించేందుకు ప్రయత్నాలు కొనసాగుతాయని తెలిపారు. పరిస్థితిలో మార్పు రాకుంటే
పోలింగ్ శాతం తగ్గుతుందని అన్నారు.యూఏఈలోనే కేరళ ఓటర్లు అత్యధికంగా ఉన్నారు. యుద్ధం ఆగిపోయి సాధారణ పరిస్థితి నెలకున్నా విమాన ఛార్జీలు కూడా భారీగా పెరుగుతాయని కేఎంసీసీ యూఏఈ నేషనల్ కమిటీ జనరల్ సెక్రటెరీ అన్వర్ నాహా అన్నారు. ఇదిలా ఉండగా, మొత్తం పోలింగ్ శాతంపై ప్రవాసీ ఓటర్ల ప్రభావం స్వల్పంగానే ఉంటుందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. నార్త్ కేరళలోని నియోజకవర్గాల్లోనే ప్రవాసీ ఓటర్ల అధిక సంఖ్యంలో ఉన్నప్పటికీ ఇవన్నీ భారీ మెజార్టీతో గెలిచే స్థానాలేనని, దీని ప్రభావం పరిమితమేనని అంటున్నారు

# ఏపీలో గుండెలు పగిలే విషాదం.. తెల్లారేలోగానే పదిమంది సజీవ దహనం

**ఒంగోలు మార్చి 26, పెన్ పవర్:**
అది మాటలకు అందని విషాదం. గుండెలు పగిలే దుఃఖం. ఇంకా తెల్లవారకముందే.. చాలామంది నిద్రలోనే దుర్మరణం చెందారు. మంటల తాకిడికి సజీవ దహనమయ్యారు. ఏపీలో జరిగిన ఈ దారుణం కన్నీరు పెట్టిస్తోంది. సరిగ్గా కొద్ది నెలల క్రితం కర్నూలు జిల్లాలో ఓ ప్రైవేట్ బస్సు కాలిపోయిన సంఘటనను మర్చిపోక ముందే.. ఈ దారుణం చోటు చేసుకోవడం గమనార్హం.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా మార్కాపురంలో పట్టణంలోని రాయవరం సమీపంలో పలకల క్వారీ వద్ద ఘోరం జరిగింది. ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు టిప్పర్ ను ఢీకొట్టింది. దీంతో ఒకసారిగా మంటలు ఏర్పడ్డాయి. దీంతో ఆ బస్సు పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో పదిమంది ప్రయాణికులు చూస్తుండగానే సజీవ దహనం అయిపోయారు.ఈ బస్సు జగిత్యాల నుంచి కనిగిరి వెళుతున్నది. విపరీతమైన వేగంతో వెళుతున్న నేపథ్యంలో ఈ దారుణం చోటు చేసుకున్నట్టు తెలుస్తోంది. ఘటన జరిగిన తర్వాత స్థానికులు వెంటనే అప్రమత్తమయ్యారు. పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సహాయక చర్యలను ముమ్మరం చేసినప్పటికీ ప్రాణనష్టాన్ని నివారించలేకపోయారు. ప్రమాదంలో గాయపడిన వారిని స్థానికంగా ఉన్న ఒక ఆసుపత్రికి తరలించారు. అయితే చాలామందికి గాయాలు అయిన నేపథ్యంలో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.ప్రైవేట్ ట్రావెల్ బస్సు విపరీతమైన వేగంతో ఉన్నట్టు తెలుస్తోంది. అదే వేగంతో పలకల క్వారీల వద్ద మలుపులు తిరుగుతుండగా ప్రమాదం జరిగినట్టు తెలుస్తోంది. టిప్పర్ కూడా అధికమైన వేగంతో ఉండడంతో ఈ ప్రమాదం జరిగినట్టు సమాచారం. ప్రమాదం జరిగినప్పుడు బస్సులో 20 మందికి పైగా ప్రయాణికులు ప్రయాణిస్తున్నారు.బస్సు కాలిపోతున్న నేపథ్యంలో వెనుక భాగంలో ఉన్నవారు ముందుకు రాలేక కన్నుమూసినట్టు సమాచారం. బస్సు ముందు భాగంలో ప్రయాణిస్తున్న పదిమంది ప్రయాణికులు మాత్రమే తమ ప్రాణాలను కాపాడుకున్నారు. చనిపోయిన వారిలో ఎక్కువగా కనిగిరి ప్రాంతానికి చెందిన వారు ఉన్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే ఘటన స్థలాన్ని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పరిశీలించారు.

# మార్కాపురం బస్సు ఘటన దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన వైఎస్ జగన్

**తాడేపల్లి: పెన్ పవర్:** మార్కాపురం జిల్లాలో జరిగిన బస్సు ప్రమాదంపై వైఎస్సార్సీపీ అధ్యక్షులు , మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మార్కాపురం జిల్లా రాయవరం సమీపంలో టిప్పర్ , ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొన్న ఘటనలో పలువురు ప్రయాణికులు సజీవ దహనం కావడం అత్యంత విషాదకరమని వైయస్ జగన్ అన్నారు. ఈ దారుణ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ ప్రమాదం అత్యంత విషాదకరమైందని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి బాధితులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించడంతో పాటు అవసరమైన అన్ని విధాల సహాయం అందించాలని కోరారు. గాయపడిన వారిని సమీపంలోని మెరుగైన ఆసుపత్రులకు తరలించి, ప్రత్యేక వైద్య బృందాలతో చికిత్స అందించాలన్నారు.ఈ ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రోడ్డు భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయడంలో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే, బాధిత కుటుంబాలకు తక్షణ ఆర్థిక సాయం ప్రకటించి, వారిని అన్ని విధాలుగా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ ఘటన రాష్ట్రాన్ని కలిచివేసిందని, ఇలాంటి దుర్ఘటనలు ఇకపై జరగకుండా చర్యలు తీసుకోవడం అత్యంత అవసరమని వైయస్ జగన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు..




# భారత్ స్థానం మారింది: ప్రధాని మోడీ!.. దశాబ్ద కాలంలో మారిన దేశ జాతకం ఏమిటి?

**హైదరాబాద్ పెన్ పవర్:** ఒకప్పుడు సాంకేతికత కోసం ఇతర దేశాల వైపు ఆశగా చూసిన భారత్, ఇప్పుడు అదే దేశాలకు సాంకేతికతను ఎగుమతి చేసే స్థాయికి ఎదగడం ప్రతి భారతీయుడు గర్వించదగ్గ విషయం. ఢిల్లీ వేదికగా జరిగిన What India Thinks Toda సదస్సులో ప్రధాని మోదీ చెప్పినట్లుగా.. భారత్ ఇప్పుడు కేవలం ఒక మార్కెట్ మాత్రమే కాదు, అది ప్రపంచానికి ఒక 'ఇన్నోవేషన్ హబ్'. 'అప్పుడు వేరు.. ఇప్పుడు వేరు' అన్న ఆయన మాటలు దేశం సాధించిన దశాబ్ద కాలపు ప్రగతికి అద్దం పడుతున్నాయి.

**వినియోగదారుడి నుంచి ఉత్పత్తిదారుగా**

ప్రధాని మోదీ తన ప్రసంగంలో ప్రధానంగా నొక్కి చెప్పిన అంశం.. భారత్ మారిన తీరు. ఒకప్పుడు మనం విదేశీ టెక్నాలజీని స్వీకరించే స్థితిలో ఉండగా, ఇప్పుడు ఉత్పత్తి చేసే స్థాయికి చేరుకున్నాం. మొబైల్ తయారీ నుంచి సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ వరకు భారత్ ఇప్పుడు ప్రపంచానికి దిక్సూచిగా మారుతోంది. ముఖ్యంగా మన దేశపు 'డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్' ఇప్పుడు అనేక అభివృద్ధి చెందిన దేశాలకు ఆదర్శంగా నిలుస్తోంది.

**డిజిటల్ చెల్లింపులతో ప్రపంచానికే పాఠం!**

భారతదేశంలో జరిగిన అతిపెద్ద మార్పు డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ. పల్లెటూరి చిరు వ్యాపారి నుంచి నగరాల్లోని మాల్స్ వరకు ప్రతిచోటా ఆన్‌లైన్ లావాదేవీలు పెరగడం అంతర్జాతీయ సమాజం దృష్టిని ఆకర్షించింది. ఈ యూపీఐ వంటి వ్యవస్థలు ఇతర దేశాల్లో కూడా అమలు కావడం భారత్ యొక్క సాంకేతిక ఆధిపత్యాన్ని చాటిచెబుతోంది. స్టార్టప్‌ల వృద్ధిలో భారత్ ఇప్పుడు ప్రపంచంలోనే



మూడో అతిపెద్ద వ్యవస్థగా ఎదగడం మన యువత ప్రతిభకు నిదర్శనం.

**గ్లోబల్ టాలెంట్ హబ్**

భారతదేశానికి ఉన్న అతిపెద్ద బలం ఇక్కడి 'యువ జనాభా' అని జూపల్లి రామారావు అభిప్రాయపడ్డారు. ఇంగ్లిష్ లో ప్రావీణ్యం ఉండడంతో పాటు సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్స్ రంగాల్లో మన యువత చూపిస్తున్న ప్రతిభ ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందుతోంది. ప్రపంచంలోని అగ్రశ్రేణి కంపెనీలకు భారతీయులే సీఈఓ (CEO)లుగా ఉండడం దీనికి ప్రత్యక్ష ఉదాహరణ. విదేశీ పెట్టుబడులు (FDI) ప్రవాహంలా రావడం వెనుక ఈ నైపుణ్యం కలిగిన మానవ వనరులే ప్రధాన కారణం.

**అంతర్జాతీయ వేదికపై గళం!**

రాజకీయాలు, ఆర్థిక వ్యవస్థ మాత్రమే కాకుండా ఆరోగ్యం, సంస్కృతి వంటి రంగాల్లో కూడా భారత్ ప్రభావం విస్తరిస్తోందని ప్రధాని స్పష్టం చేశారు. కరోనా సమయంలో వ్యాక్సిన్ మైత్రి ద్వారా ప్రపంచాన్ని ఆదుకోవడంలో భారత్ చూపిన చొరవ, అంతర్జాతీయ సంబంధాల్లో మన దేశ స్థానాన్ని మరింత ఎత్తుకు తీసుకెళ్లింది. మౌలిక వసతుల కల్పన (Infrastructure), మేక్ ఇన్ ఇండియా వంటి పథకాలు దేశాన్ని స్వయం సమృద్ధి దిశగా నడిపిస్తున్నాయి. ప్రధాని మోదీ ప్రసంగం సారాంశం ఒక్కటే.. భారత్ ఇప్పుడు ప్రపంచ వేదికపై ఒక శక్తివంతమైన భాగస్వామి. మనం అనుసరిస్తున్న టెక్నాలజీ, మనం సాగిస్తున్న ప్రగతి ఇప్పుడు కేవలం మనకే కాదు, యావత్ ప్రపంచానికి ఉపయోగపడుతోంది. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలన్న లక్ష్యానికి ఈ సాంకేతిక, ఆర్థిక పునాదులే కీలకమైనవి. యువత తమ ప్రతిభను మరింతగా మెరుగుపరుచు కుంటే, భవిష్యత్తులో భారత్ అగ్రగామిగా నిలవడం ఖాయం.

# ఈ 5 దేశాలకు మాత్రమే ఇరాన్ ఎందుకు అనుమతి ఇచ్చింది.. కారణాలు ఏంటీ..?




పశ్చిమాసియాలో యుద్ధం తీవ్రరూపం దాల్చిన వేళ.. ప్రపంచ వాణిజ్యానికి గుండెకాయ లాంటి 'హోర్ముజ్ జలసంధి'ని ఇరాన్ తన గుప్పిట్లోకి తీసుకుంది. అయితే వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ కేవలం భారత్, చైనా, రష్యా, పాకిస్థాన్, ఇరాక్ దేశాల.. ఆయిల్, గ్యాస్ ట్యాంకర్లకు మాత్రమే ఈ మార్గం ద్వారా వెళ్లేందుకు అనుమతులు మంజూరు చేసింది. ఈ ఐదు దేశాలకు మాత్రమే ఇరాన్ ఎందుకు మినహాయింపు ఇచ్చిందనే అంశంపై అంతర్జాతీయ విశ్లేషకులు ఆసక్తికర కారణాలను బయటపెడుతున్నారు.

**చైనా, రష్యాలతో మిత్రబంధం:**

ఇరాన్‌కు చైనా అతిపెద్ద ఆర్థిక వెన్నుముక. ఇరాన్ ఉత్పత్తి చేసే చమురులో దాదాపు 90 శాతం చైనానే కొనుగోలు చేస్తోంది. బదులుగా ఇరాన్ మార్కెట్ అంతా చైనా వస్తువులతో పాటు డిఫెన్స్ టెక్నాలజీని ఇరాన్ పొందుతోంది. ఇక రష్యా విషయానికొస్తే.. అమెరికాకు వ్యతిరేకంగా ఇరాన్‌కు సాంకేతిక, ఆయుధ సహకారాన్ని అందిస్తోంది. ఉక్రెయిన్ యుద్ధంలో రష్యాకు వ్యతిరేకంగా అమెరికా నిలవడంతో దానికి ప్రతీకారంగా రష్యా నౌకలకు ఇరాన్ పచ్చజెండా ఊపింది. ఈ రెండు దేశాలు ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో ఇరాన్‌కు అండగా నిలుస్తున్నాయి.

**భారత్ పాకిస్థాన్‌లతో అవసరాలు:**

భారతదేశం నుంచి ఇరాన్‌కు అత్యవసర మందులు, ఇతర నిత్యావసరాలు ఎగుమతి చాలా కీలకం. యుద్ధ సమయంలో అంతర్గత కొరత రాకుండా ఉండేందుకు భారత్‌తో సత్సంబంధాలు ఇరాన్‌కు అవసరం. మరోవైపు పాకిస్థాన్ ఇక్కడ ఒక దౌత్యవేత్త పాత్రను పోషిస్తోంది. అమెరికా ఇరాన్ మధ్య తెరవెనుక చర్చలు జరపడానికి పాకిస్థాన్ మధ్యవర్తిగా వ్యవహరిస్తోంది. పొరుగు దేశం కావడంతో పాటు ఈ దౌత్యపరమైన అవసరాల దృష్ట్యా పాకిస్థాన్ నౌకలను ఇరాన్ అనుమతిస్తోందట.

**ఇరాక్‌కి ప్రత్యేక పర్మిషన్ ఎందుకంటే..?**

ఇరాక్.. ఇరాన్ దేశాల మధ్య షియా ముస్లిం జనాభా ప్రాబల్యంతో పాటు మతపరమైన అనుబంధం బలంగా ఉంది. ఇరాక్ ప్రభుత్వంలోని అనేక వర్గాలు ఇరాన్‌కు మిత్రపక్షాలుగా ఉన్నాయి. వీటికి తోడు ఇరాక్ తన విద్యుత్, నేచురల్ గ్యాస్ అవసరాల కోసం ఇప్పటికీ ఇరాన్‌పైనే ఆధారపడుతోంది. ఈ పరస్పర ఆర్థిక ప్రయోజనాల దృష్ట్యా.. పొరుగున ఉన్న ఇరాక్‌తో కొత్త తలనొప్పులు కొనితెచ్చుకోకుండా ఇరాన్ ఈ మినహాయింపు ఇచ్చింది. మొత్తానికి తన శత్రువులైన అమెరికా, ఇజ్రాయెల్ మిత్రదేశాల వాణిజ్యాన్ని దెబ్బతీస్తూనే.. తన ఆర్థిక, సైనిక, దౌత్య అవసరాలను తీర్చే 5 దేశాలను ఇరాన్ తన సేఫ్ జోన్ లో ఉంచుకుంది.

# ఆ బంకుల్లో పెట్రోల్, డీజిల్ రేట్లు పెరిగాయ్.. !




నిన్న మొన్నటి వరకు ఆ పెట్రోల్ బంకుల్లో ఆయిల్ రేట్లు తక్కువ.. మిగతా పెట్రోల్ బంకులతో పోల్చితే లీటర్ పై 3 నుంచి 5 రూపాయల వరకు తక్కువగా ఉండేవి.. ఇప్పుడు సీన్ మారింది. కానీ నయారా బంకుల్లోనూ పెట్రోల్, డీజిల్ రేట్లు పెంచారు. ఆ బంకులు ఏంటీ అంటారా.. నయారా పెట్రోల్ బంకులు.. ఖీవీ పెడితే చాలు.. డిస్కౌంట్ రేట్లకే పెట్రోల్ కొట్టించుకోండి అంటూ ఒకటే ప్రచారం.. ఇప్పుడు మిగతా బంకులు మాదిరిగానే ధరలు పెంచేశాయి.

ఇరాన్ యుద్ధ ప్రభావం భారత్‌లోని సామాన్యుడి జేబుపై పడటం మొదలైంది. దేశంలోని అతిపెద్ద ప్రైవేట్ ఇంధన రిటైలర్ 'నయారా ఎనర్జీ' పెట్రోలు, డీజిల్ ధరలను భారీగా పెంచుతూ సంచలన నిర్ణయం తీసుకుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు మండుతుండటంతో లీటరుకు పెట్రోలుపై రూ. 5, డీజిల్‌పై రూ. 3 రేటు పెంచేసింది. స్థానిక పన్నులను బట్టి కొన్ని రాష్ట్రాల్లో ఈ పెరుగుదల లీటరుకు రూ. 5.30 వరకు కూడా ఉంది. పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో నయారా ఎనర్జీ పెట్రోల్, డీజిల్ ధరలను పెంచింది. ఇదే క్రమంలో ఏప్రిల్ నుంచి 35 రోజుల పాటు రిఫైనరీ కార్యకలాపాలు నిలిపివేయాలని కంపెనీ నిర్ణయించింది. అయితే దేశంలో ఇంధన కొరత లేదని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. రష్యాకు చెందిన రోస్నెఫ్ట్ మెజారిటీ వాటాదారుగా ఉన్న నయారా ఎనర్జీ భారత్‌లో సుమారు 7 వేల పెట్రోల్ బంకులను నిర్వహిస్తోంది. పెరిగిన ముడి చమురు ఖర్చులను భరించలేక ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ప్రభుత్వ రంగ సంస్థలైన ×ాజ, ధీాజా, న్ూజా వంటివి నష్టాలను భరిస్తూ ధరలను స్థిరంగా ఉంచినప్పటికీ, ప్రైవేట్ సంస్థలకు ప్రభుత్వం నుండి ఎటువంటి నష్టపరిహారం అందదు. అందుకే పెరుగుతున్న నష్టాలను తగ్గించుకునేందుకు నయారా ఈ మార్పులు చేసింది.

ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడులు ప్రారంభమైనప్పటి నుంచి అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు దాదాపు 50 శాతం పెరిగాయి. ఒక దశలో ముడి చమురు ధర బ్యారెల్‌కు 119 డాలర్లకు చేరింది. భారత్ తన చమురు అవసరాల్లో 88 శాతాన్ని దిగుమతులపైనే ఆధారపడుతుంది. ముఖ్యంగా హోర్ముజ్ జలసంధి గుండా వచ్చే రవాణాకు ఇరాన్ ఆటంకాలు కలిగిస్తుండటం, ఇన్సూరెన్స్ కంపెనీలు వెనక్కి తగ్గడంతో సరఫరా వ్యవస్థ దెబ్బతింది.

సాధారణ పెట్రోల్ ధరలను ప్రభుత్వ సంస్థలు మార్చకపోయినా.. గత వారమే ప్రీమియం పెట్రోలుపై రూ. 2, పారిశ్రామిక అవసరాలకు వాడే బల్క్ డీజిల్‌పై ఏకంగా లీటరుకు రూ. 22 మేర ధరలను పెంచేసిన సంగతి తెలిసిందే. యుద్ధం గనుక మరింత కాలం కొనసాగితే.. ప్రభుత్వ రంగ సంస్థలు కూడా సామాన్యుడు వాడే సాధారణ పెట్రోల్ ధరలను పెంచక తప్పని పరిస్థితి ఏర్పడవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# మెడికల్ వ్యాపారంలోకి ఇన్ఫోసిస్ ఎంట్రీ.. 4 వేల కోట్లతో అమెరికా కంపెనీల కొనుగోలు




భారతీయ ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ తన వ్యాపార సామ్రాజ్యాన్ని మరింత విస్తరిస్తోంది. అమెరికాకు చెందిన రెండు ప్రముఖ సంస్థలు 'ఆప్టిమమ్ హెల్త్‌కేర్ ఐటీ', 'స్ట్రాటస్'లను సుమారు 560 మిలియన్ డాలర్ల అంటే మన కరెన్సీలో దాదాపు రూ. 4వేల 600 కోట్లకు కొనుగోలు చేస్తున్నట్లు ప్రకటించింది. మార్కెట్లో టెక్నాలజీ ఖర్చులు తగ్గుతున్న తరుణంలో.. నిర్దిష్ట రంగాల్లో పట్టు సాధించేందుకు ఇన్ఫోసిస్ వేసిన ఈ అడుగు ఐటీ రంగంలో చర్చనీయాంశమైంది.

ఈ రెండు ఒప్పందాలలో అత్యంత కీలకమైనది 'ఆప్టిమమ్ హెల్త్‌కేర్ ఐటీ'. ఫ్లోరిడా కేంద్రంగా పనిచేసే ఈ సంస్థ కోసం ఇన్ఫోసిస్ 465 మిలియన్ డాలర్లు వెచ్చిస్తోంది. హెల్త్‌కేర్ కన్సల్టింగ్ అండ్ డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్‌లో ఆరితేరిన ఈ సంస్థకు 1,600 మందికి పైగా ఉద్యోగులు ఉన్నారు. ముఖ్యంగా ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్ విభాగంలో ఈ సంస్థకు ఉన్న నైపుణ్యం ఇన్ఫోసిస్ హెల్త్‌కేర్ విభాగం ఆదాయాన్ని భారీగా పెంచనుంది. ఈ సంస్థ ఆదాయం కేవలం ఏడాది కాలంలోనే 106 మిలియన్ డాలర్ల నుంచి 275 మిలియన్ డాలర్లకు పెరగడం ఇన్ఫోసిస్ ను ఆకర్షించింది.

ఇక రెండో సంస్థ 'స్ట్రాటస్'ను 95 మిలియన్ డాలర్లకు ఇన్ఫోసిస్ దక్కించుకుంది. న్యూజెర్సీకి చెందిన ఈ టెక్నాలజీ కన్సల్టింగ్ సంస్థ ఇన్సూరెన్స్ రంగంలో, ముఖ్యంగా ప్రాపర్టీ అండ్ క్యాజువల్టీ విభాగంలో ప్రత్యేక గుర్తింపు పొందింది. 450 మంది నిపుణులు కలిగిన ఈ సంస్థ.. గైడ్‌వైర్ సంబంధిత సేవలు, క్లౌడ్ మైగ్రేషన్‌లో ఇన్ఫోసిస్ సామర్థ్యాన్ని మరింత పెంచనుంది. ఈ రెండు కొనుగోళ్లు 2027 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం నాటికి పూర్తి కానున్నాయి. పెద్ద డీల్స్ కోసం వేచి చూడకుండా.. లాభదాయకమైన చిన్న, మధ్య తరహా సంస్థలను చేజిక్కించుకోవడం ద్వారా క్లౌడ్, డేటా ప్లాట్‌ఫారమ్స్,

కన్సల్టింగ్ విభాగాల్లో ఎదగాలని ఇన్ఫోసిస్ చూస్తోంది. ఏఐ యుగంలో మారుతున్న ఐటీ బిజినెస్ మోడళ్ల కారణంగా కంపెనీ ఇలాంటి దారి ఎంచుకున్నట్లు నిపుణులు చెబుతున్నారు.

# నిలిచిన బాస్మతీ రైస్ ఎక్స్‌పోర్ట్స్.. ఓడరేవుల్లోనే 10 లక్షల టన్నుల బియ్యం






పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధపు సెగలు వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న భారతీయ వ్యవసాయ రంగాన్ని, ముఖ్యంగా బాస్మతీ బియ్యం ఎగుమతి పరిశ్రమను కోలుకోలేని దెబ్బ తీశాయి. ఏటా సుమారు 6 బిలియన్ డాలర్లు అంటే రూ. 54వేల కోట్ల విదేశీ మారక ద్రవ్యాన్ని దేశానికి తెచ్చి పెట్టే ఈ రంగం.. ప్రస్తుతం రవాణా మార్గాల నిలిపివేత, పేమెంట్ సమస్యలు.. షిప్‌మెంట్‌ల జాప్యంతో తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది.

భారత్ ఏటా సుమారు 60 లక్షల మెట్రిక్ టన్నుల బాస్మతీ బియ్యాన్ని ప్రపంచవ్యాప్తంగా ఎగుమతి చేస్తోంది. ఇందులో దాదాపు సగానికి పైగా వాటా సౌదీ అరేబియా, ఇరాన్, ఇరాక్, యూఏఈ వంటి గల్ఫ్ దేశాలదే. సాధారణంగా రంజాన్, ఈద్ పండుగల సమయంలో ఈ దేశాలకు ఎగుమతులు భారీ స్థాయిలో ఉంటాయి. అయితే ప్రస్తుత యుద్ధ వాతావరణం వల్ల మధ్యప్రదేశ్ వంటి ప్రధాన బాస్మతీ హబ్‌లలోని రైస్ మిల్లులు వెలవెలబోతున్నాయి. ఎప్పుడూ రద్దీగా ఉండే ఎగుమతి సీజన్‌లో ఇప్పుడు నిశ్శబ్దం ఆవరించిందని వారు చెబుతున్నారు. యుద్ధం కారణంగా సముద్ర మార్గాల్లో ముప్పు పెరగడంతో లాజిస్టిక్స్ రంగం కుదేలైంది. గతంలో ఒక కంటైనర్‌కు 2వేల 500 డాలర్లుగా ఉన్న రవాణా ఖర్చు ఇప్పుడు ఏకంగా 7వేల నుండి 9వేల డాలర్లకు చేరింది. దీనికి తోడు ఇన్సూరెన్స్ ప్రీమియాలు పెరగడం, కంటైనర్ల కొరత ఏర్పడటంతో ఎగుమతిదారులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా సుమారు 10 లక్షల టన్నుల బాస్మతీ బియ్యం ఓడరేవుల్లో, గోడౌన్లలో మూలుగుతోంది. ప్రీమియం రకమైన '1121' బాస్మతీకి పశ్చిమాసియాలో ఉన్న డిమాండ్ యూరప్ లేదా ఆఫ్రికా దేశాల్లో ఉండదు. కాబట్టి ఈ నిల్వలను ఇతర మార్కెట్లకు మళ్లించడం కూడా సాధ్యం కావడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. ఈ అంతరాయం వల్ల ఎగుమతిదారుల వర్కింగ్ క్యాపిటల్ పూర్తిగా నిలిచిపోయింది. మార్కెట్ వర్గాల అంచనా ప్రకారం సుమారు 2వేల కోట్ల నుండి 25వేల కోట్ల రూపాయల వరకు చెల్లింపులు నిలిచిపోయాయి. ఇది కేవలం వ్యాపారులకే కాకుండా పరోక్షంగా రైతులపై కూడా ప్రభావం చూపుతోంది. మిల్లులు కొనుగోళ్లు నిలిపివేయడంతో ధాన్యం ధరలు తగ్గే అవకాశం పెరిగింది. ఇది రైతుల ఆదాయాన్ని దెబ్బతీస్తుంది. రాబోయే సాగు సీజన్‌పై కూడా ఈ ప్రభావం పడే ప్రమాదం ఉందని తెలుస్తోంది. భారత ప్రభుత్వం ఈ దిశగా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నప్పటికీ, పశ్చిమాసియాలో శాంతి నెలకొంటే తప్ప భారత బాస్మతీ ఎగుమతుల ఇంజిన్ మళ్లీ గాడిన పడటం కష్టంగా కనిపిస్తోంది.

# నా ఆరోగ్యాన్ని చెడగొట్టింది గూగుల్, మెటాలే.. టీనేజర్‌కు అమెరికా కోర్టు రూ.50 కోట్లు నష్టపరిహారం



సోషల్ మీడియా దిగ్గజాలు మెటా, గూగుల్ సంస్థలకు అమెరికాలోని లాస్ ఏంజిల్స్ కోర్టు భారీ షాక్ ఇచ్చింది. ప్లాట్‌ఫారమ్‌ల వ్యసనం వల్ల మానసిక ఆరోగ్యానికి నష్టం వాటిల్లిందని ఒక యువతి దాఖలు చేసిన సివిల్ కేసులో ఈ రెండు కంపెనీలు బాధ్యులని జ్యూరీ తీర్పునిచ్చింది. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం..

**సోషల్ మీడియా సంస్థలపై కేసు ఏంటి..?**

20 ఏళ్ల వయస్సున్న కేలీ జీఎమ్ అనే యువతి.. తాను చిన్నతనం నుంచి సోషల్ మీడియా వాడకం వల్ల డిప్రెషన్, ఆందోళన, బాడీ డిస్మోర్ఫియా బారిన పడ్డానంటూ కోర్టును ఆశ్రయించింది. 8 రోజుల సుదీర్ఘ చర్చల తర్వాత 12 మంది సభ్యులతో కూడిన జ్యూరీ మెటా, గూగుల్ సంస్థలు ఆమెకు 6 మిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో సుమారు రూ. 50 కోట్లు నష్టపరిహారంగా చెల్లించాలని ఆదేశించింది. ఇందులో 70 శాతం మెటా సంస్థ, 30 శాతం గూగుల్ చెల్లించాల్సి ఉంటుంది.

**పై కోర్టులో తేల్చుకుంటాం..**

ఈ తీర్పుపై మెటా ప్రతినిధి స్పందిస్తూ.. తాము దీనిపై అప్పీల్ చేస్తామని చెప్పారు. టీనేజర్ల మానసిక ఆరోగ్యం అనేది చాలా సంక్లిష్టమైన అంశమని, దీన్ని కేవలం ఒక యాప్‌తో ముడిపెట్టలేమని మెటా వాదిస్తోంది. గూగుల్ ప్రతినిధి కూడా స్పందిస్తూ.. యూట్యూబ్ అనేది బాధ్యతాయుతమైన స్ట్రీమింగ్ ప్లాట్‌ఫారమ్ అని, అది సోషల్ మీడియా సైట్ కాదని పేర్కొన్నారు. తమ ప్లాట్‌ఫారమ్‌లు పిల్లల కోసం సురక్షితంగానే రూపొందించబడ్డాయని గూగుల్ చెబుతోంది.

**బయటపడ్డ కంపెనీల సీక్రెట్స్..**

ట్రయల్ సమయంలో మెటా, గూగుల్ సంస్థలకు చెందిన కొన్ని అంతర్గత పత్రాలు బయటపడ్డాయి. అందులో ఒక మెటా ఉద్యోగి "మేము డ్రగ్స్ అమ్మే పుష్షర్ల లాంటి వాళ్లం.. ఇన్‌స్టాగ్రామ్‌కు ప్రజలు ఎంతగా అలవాటు పడుతున్నారంటే అది వారికి రివార్డ్ డెఫిసిట్ డిజార్డర్‌ను కలిగిస్తోంది" అన్న విషయం బయటపడింది. అలాగే టీనేజర్లను ఆకర్షించాలంటే వారిని చిన్నప్పుడే ప్లాట్‌ఫారమ్‌లోకి తీసుకురావాలని యూట్యూబ్ స్ట్రాటజీ మెమోలో ఉన్నట్లు కోర్టు దృష్టికి వచ్చింది. ఇన్‌స్టాగ్రామ్‌లోని బ్యూటీ ఫిల్టర్లు కేలీలో తాను లావుగా ఉన్నాననే భావనను పెంచాయని ఆమె తరపు న్యాయవాది కోర్టులో వాదనలు వినిపించారు.

ఈ తీర్పు అమెరికా చరిత్రలోనే మొదటిది కావడం విశేషం. ప్రస్తుతం సౌత్ కాలిఫోర్నియాలో గూగుల్, మెటా, టిక్‌టాక్, స్నాప్‌లపై దాదాపు 2,500 మంది ఇలాంటి కంప్లెయింట్స్ చేశారు. బుధవారం వచ్చిన ఈ తీర్పు మిగిలిన కేసులకు ఒక మార్గదర్శిగా మారే అవకాశం ఉందని అమెరికాలోని న్యాయ నిపుణులు అంటున్నారు. మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ కూడా ఈ విచారణలో సాక్ష్యం ఇచ్చారు. కేలీ తరపు న్యాయవాది మార్క్ లానియర్ మాట్లాడుతూ.. ఈ విజయం సోషల్ మీడియా వల్ల ప్రభావితమైన తరానికి దక్కిన గొప్ప గౌరవంగా వ్యాఖ్యానించారు.

# గురువారం పెరిగిన గోల్డ్.. శ్రీరామ నవమి ముందు బ్రేక్ తీసుకున్న వెండి




అమెరికా ఇరాన్ యుద్ధం ఇప్పట్లో ఆగేలా అస్సలు కనిపించటం లేదు. దీంతో నిన్నటి వరకూ శాంతి చర్చలపై ఆశలతో గోల్డ్ అండ్ సిల్వర్ ర్యాలీని తిరిగి స్టార్ట్ చేసినప్పటికీ.. గురువారం మళ్లీ చతికిలపడ్డాయి. దీంతో బంగారం రేటు స్వల్పంగా పెరగగా.. మరోపక్క వెండి మాత్రం చలనం లేకుండా ముందుకెళుతోంది. ఈ క్రమంలో షాపింగ్ చేయాలనుకుంటున్న తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలు తమ ప్రాంతంలో తాజా రేట్లను ముందుగా పరిశీలించాలి. మార్చి 26న బంగారం రేట్లు స్వల్పంగా పెరిగింది. మార్చి 25 కంటే గ్రాముకు 24 క్యారెట్ల బంగారం రేటు గ్రాముకు రూ. 22 పెరుగుదలను నమోదు చేసింది. దీంతో హైదరాబాద్, వరంగల్, నిజాంబాద్, ఖమ్మం, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, కడప నగరాల్లో స్వచ్ఛమైన బంగారం రేటు రూ. 14వేల 689గా కొనసాగుతోంది. ఈ నగరాల్లో 22 క్యారెట్ల బంగారం రేటు గ్రాముకు రూ. 13వేల 465గా తెలుగు రాష్ట్రాల్లోని నగరాల్లో కొనసాగుతోంది. గురువారం రోజున వెండి రేట్ల విషయానికి వస్తే.. మార్చి 26, 2026న దేశవ్యాప్తంగా స్థిరంగా కొనసాగుతున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, వరంగల్, నిజాంబాద్, ఖమ్మం, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, కడపలో కేజీ స్వచ్ఛమైన వెండి రేటు రూ. 2లక్షల 60వేల వద్ద కొనసాగుతోంది. అంటే గ్రాము ధర రూ. 260 వద్ద ఉంది.

# ఏప్రిల్ నుంచి బైబ్యాక్ లాభాలపై 12% సర్‌చార్జ్



న్యూఢిల్లీ: కంపెనీల బైబ్యాక్ ఆఫర్‌లో షేర్లు విక్రయించే వ్యక్తిగత లేదా కార్పొరేట్ షేర్‌హోల్డర్ల మూలధన లాభాలపై ఏప్రిల్ నుంచి 12 శాతం ఫ్లాట్ సర్‌చార్జ్ పడనుంది. ఇందుకు సంబంధించిన ఫైనాన్స్ బిల్లు- 2026 సవరణ బిల్లును లోక్‌సభ తాజాగా ఆమోదించింది. ఇప్పటి వరకు రూ. 50 లక్షల వరకు మూలధన లాభంపై సర్‌చార్జ్ ఉండేది కాదు. రూ. 50 లక్షల- రూ. కోటి మధ్య 10శాతం పడేది. ఇప్పుడు ఫ్లాట్ 12శాతం విధించడం వల్ల రూ.కోటి కంటే తక్కువ మూలధన లాభం పొందిన వారిపై పన్ను భారం పెరగనుంది. రూ. కోటి కంటే ఎక్కువ లాభాలు పొందిన వారిపై ఉన్న సర్‌చార్జ్ 15శాతం నుంచి 12శాతానికి తగ్గుతుంది. కార్పొరేట్ షేర్‌హోల్డర్లపై కూడా ప్రభావం ఉంటుంది. రూ. కోటి వరకు లాభంపై ముందుగా సర్‌చార్జ్ లేదు. ఇక నుంచి పడుతుంది. మొత్తంగా బైబ్యాక్ మూల ధన లాభం ఎంత ఉన్నా 12 శాతం ఫ్లాట్ సర్‌చార్జీ కార్పొరేట్, వ్యక్తిగత షేర్‌హోల్డర్లపై పడుతుంది.

## రాత్రి నిద్ర లేక ఇబ్బందిపడుతున్నారా?




చాలా మహిళలు రాత్రి సమయానికి పడుకున్నా సరిగా నిద్ర పట్టక ఇబ్బంది పడుతున్నారు. నిద్రలోకి వెళ్లిన తర్వాత కూడా మధ్యలో మెలకువ రావడం సాధారణమైపోయింది. జీవనశైలి మార్పులు, మానసిక ఒత్తిడి, ఆందోళనలతో పాటు హార్మోన్ల అసమతుల్యత కూడా దీనికి ముఖ్య కారణాలు. ఇటీవల కాలంలో చాలా మందికి రాత్రిపూట నిద్రపట్టదు. ముఖ్యంగా మహిళల్లో ఈ సమస్య చాలా మందిలో కనిపిస్తోంది. దీనికి జీవనశైలి మార్పులు, ఒత్తిడి, ఆందోళనలతో పాటు హార్మోన్ల అసమతుల్యత కూడా ప్రధాన కారణమని నిపుణులు చెబుతున్నారు. మహిళల శరీరం పురుషులతో పోలిస్తే ప్రత్యేకంగా ఉంటుంది. నెలసరి, గర్భధారణ, మెనోపాజ్ వంటి దశల్లో హార్మోన్ల మార్పులు ఎక్కువగా ఉంటాయి. ముఖ్యంగా ఈస్ట్రోజన్, ప్రొజెస్టరాన్ స్థాయిల్లో వచ్చే మార్పులు నిద్రపై ప్రభావం చూపుతాయి. ఈస్ట్రోజన్ నిద్రకు సహాయపడే సెరటోనిన్ ఉత్పత్తిని పెంచుతుంది. ఇది శరీర ఉష్ణోగ్రతను కూడా నియంత్రిస్తుంది. కానీ, నెలసరి లేదా మెనోపాజ్ సమయంలో దీని స్థాయి తగ్గితే వేడి అలికిడి, చెమటలు పెరిగి నిద్ర భంగం కలుగుతుంది. ప్రొజెస్టరాన్ మెదడును ప్రశాంతంగా ఉంచే హార్మోన్. లూటియల్ దశలో, గర్భధారణ సమయంలో ఇది ఎక్కువగా ఉంటుంది. అందుకే ఆ సమయంలో ఎక్కువగా నిద్రగా అనిపిస్తుంది. కానీ నెలసరి ముందు, ప్రసవం తర్వాత దీని స్థాయి తగ్గిపోతే నిద్రలేమి సమస్య వస్తుంది. మెలటోనిన్ నిద్రను నియంత్రించే ప్రధాన హార్మోన్. ఇది మన జీవ గడియారం (సర్కేడియన్ రిథమ్)ను క్రమబద్ధం చేస్తుంది. నిద్ర సమయాలు క్రమంగా పాటించకపోతే దీని ఉత్పత్తి తగ్గి నిద్ర సమస్యలు వస్తాయి. కార్టిసాల్ ఒత్తిడికి సంబంధించిన హార్మోన్. ఇది రాత్రివేళల్లో తగ్గాలి. కానీ ఒత్తిడి ఎక్కువైతే ఇది పెరిగి నిద్రను దెబ్బతీస్తుంది. టెస్టోస్టెరాన్ మహిళల్లో కూడా ఉంటుంది. ఇది నిద్రలోని రెమ్ దశలో ముఖ్య పాత్ర పోషిస్తుంది. దీని లోపం కూడా నిద్రాభంగానికి దారితీస్తుంది. థైరాయిడ్ హార్మోన్ జీవక్రియను ప్రభావితం చేస్తుంది. ఇందులో మార్పులు వచ్చినా నిద్రపై ప్రభావం పడుతుంది. నిజానికి నిద్ర, హార్మోన్లు పరస్పరం అనుసంధానంగా ఉంటాయి. ఒకటి సరిగ్గా లేకపోతే మరొకటి ప్రభావితమవుతుంది. కాబట్టి కొన్ని అలవాట్లు మార్చుకోవడం అవసరం. ప్రతిరోజూ ఒకే సమయానికి పడుకోవాలి. ధ్యానం, యోగా, వ్యాయామం చేయాలి. నిద్రకు గంట ముందు మొబైల్, టీవీ వాడకం మానేయాలి. సాయంత్రం తర్వాత టీ, కాఫీ తగ్గించాలి. మెగ్నీషియం ఉన్న ఆకుకూరలు, నట్స్, గింజలు తీసుకోవాలి. పడకగదిని చల్లగా ఉంచుకోవాలి. ఇన్ని పాటించినా నిద్ర సమస్య కొనసాగితే, వైద్యుల సలహాతో మెలటోనిన్ సప్లిమెంట్లు లేదా అవసరమైన చికిత్సలు తీసుకోవచ్చు.

## ఈ సమస్యలున్న వారు బొప్పాయిని తినొద్దు



బొప్పాయి ఆరోగ్యానికి, ముఖ్యంగా మలబద్ధకం వంటి సమస్యలకు చాలా మేలు చేస్తుంది. అయితే, బొప్పాయికి శరీరాన్ని వేడి చేసే గుణం ఉంది. కడుపు సమస్యలకు అరటిపండ్లు, బొప్పాయి వంటి పండ్లను తినడం చాలా మంచిది. బొప్పాయిలో పాపైన్ అనే ఎంజైమ్ ఉంటుంది.. ఇది ప్రోటీన్లను విచ్ఛిన్నం చేసి జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అందువల్ల, మలబద్ధకంతో బాధపడేవారు బొప్పాయి తినాలని సలహా ఇస్తారు. ఇది ఆరోగ్యానికి అనేక ఇతర విధాలుగా కూడా మేలు చేస్తుంది. అయితే, బొప్పాయికి శరీరాన్ని వేడి చేసే గుణం ఉంది. కావున.. వేసవి కాలంలో బొప్పాయి పండును తినవచ్చా? దీనిని వేసవిలో తినడం సురక్షితమేనా, లేదా దాని వల్ల ఆరోగ్యానికి హాని కలుగుతుందా అని చాలా మంది సందేహం వ్యక్తంచేస్తుంటారు. ఎందుకంటే, ఈ సమయంలో శరీరాన్ని చల్లబరచడానికి, చల్లదనాన్నిచ్చే గుణం ఉన్న పండ్లను తినమని సిఫార్సు చేస్తారు. కాబట్టి, వేసవిలో బొప్పాయి తినవచ్చా? లేదా? దీని గురించి ఆరోగ్య నిపుణులు ఏం చెబుతున్నారు..? మీరట్‌కు చెందిన డైటీషియన్ అయేషా పర్వీన్ వివరించిన ప్రకారం.. బొప్పాయిని తేలికపాటి వేడినిచ్చేదిగా పరిగణించినప్పటికీ, ముఖ్యంగా పండినప్పుడు తింటే అది చల్లదనాన్ని కూడా ఇస్తుంది. వేసవిలో బొప్పాయి తినడం ఆరోగ్యానికి మేలు చేస్తుంది, ఎందుకంటే ఇందులో అధిక నీటి శాతం ఉంటుంది.. ఇది శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచడానికి, వడదెబ్బ నుండి రక్షించడానికి సహాయపడుతుంది. బొప్పాయి జీర్ణక్రియకు మేలు చేస్తుంది. ఇది మలబద్ధకం నుంచి ఉపశమనం కలిగించి, రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. బొప్పాయిలోని ఎంజైమ్‌లు కడుపును శుభ్రపరచడంలో సహాయపడతాయి. ఇది చర్మం కాంతివంతంగా ఉండటానికి కూడా దోహపడుతుంది. బొప్పాయిలో కేలరీలు తక్కువగా, పీచుపదార్థం ఎక్కువగా ఉండటం వల్ల బరువు తగ్గాలనుకునే వారికి కూడా ఇది ఒక మంచి ఎంపిక. బొప్పాయికి శరీరాన్ని వేడి చేసే గుణం ఉందని, దీనిని అధిక పరిమాణంలో తీసుకుంటే కొంతమందిలో ఎసిడిటీ గ్యాస్‌కు కారణం కావచ్చని నిపుణులు అంటున్నారు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు బొప్పాయిని తినే ముందు వైద్యుడిని సంప్రదించాలి. వేసవిలో బొప్పాయిని మజ్జిగ, పెరుగు, దోసకాయ వంటి చల్లని ఆహారాలతో కలిపి తీసుకోవడం కూడా మంచిది. ఇది శరీరంలోని వేడిని తగ్గించి, సమతుల్యతను కాపాడుతుంది. ఉదయాన్నే ఖాళీ కడుపుతో బొప్పాయి తినడం ప్రయోజనకరం.. కానీ బొప్పాయి పడని వారు లేదా కడుపులో మంటగా అనిపించేవారు వెంటనే దానిని తినడం మానేయాలి. ఎసిడిటీ లేదా గుండెల్లో మంటతో బాధపడేవారు ఖాళీ కడుపుతో బొప్పాయి తినకూడదు. వేసవిలో బొప్పాయి తినడం మంచిదే, కానీ దానిని పరిమిత పరిమాణంలో, సరైన పద్ధతిలో తీసుకోవాలని సూచిస్తున్నారు. అయితే.. ఏదైనా సమస్యతో బాధపడుతుంటే.. వైద్య నిపుణులను సంప్రదించడం మంచిది.

## రోజుకో గ్లాస్ తాగితే చాలు.. కొవ్వు కరిగిపోయి కిలోలు తగ్గుతారు




ఈ మధ్యకాలంలో చాలామందికి బరువు తగ్గడం ఓ పెద్ద సవాల్‌గా మారింది. మరి దానికోసం ఓ ఇంటి చిట్కాను మీ ముందుకు తెచ్చేశాం. నిమ్మ, తేనె, వేయించిన జీలకర్ర పొడిని గోరువెచ్చని నీటిలో కలిపి తయారుచేసే ఈ వాటర్ జీవక్రియను వేగవంతం చేసి కొవ్వును కరిగించడానికి సహాయపడుతుంది. ఆధునిక జీవనశైలి కారణంగా అధిక బరువు సమస్య చాలామందిని వేధిస్తోంది. దాదాపు 90 శాతం మంది ఈ సమస్యతో బాధపడుతున్నారని అంచనా. ఈ సమస్యను వంటింటి చిట్కాలతో ఈజీగా పరిష్కరించవచ్చు. నిమ్మ, తేనె, వేయించిన జీలకర్ర పొడిని గోరువెచ్చని నీటిలో కలిపి తయారుచేసే ఈ వాటర్ బరువు తగ్గడానికి అద్భుతంగా సహాయపడుతుంది. ఈ వాటర్ తయారీకి మూడు ముఖ్యమైన పదార్థాలు అవసరం: నిమ్మకాయలు, స్వచ్ఛమైన తేనె, వేయించి పొడి చేసిన జీలకర్ర. వీటితో పాటు 150 మిల్లీలీటర్ల గోరువెచ్చని నీళ్లు కావాలి. నిమ్మరసం బరువు తగ్గడానికి చాలా సమర్థవంతంగా పనిచేస్తుంది. ఇందులో ఉండే డయాస్పిన్, హెస్పెరిడిన్, సిట్రిక్ యాసిడ్ లాంటి అనేక రకాల పదార్థాలు జీవక్రియను(మెటబాలిజం) వేగవంతం చేసి శరీరంలోని కొవ్వును కరిగించడానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా తోడ్పడతాయి. దీనివల్ల ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవు, పైగా ఆరోగ్యానికి మేలు చేస్తుంది. స్వచ్ఛమైన తేనె బరువు తగ్గడంలో అద్భుతంగా పనిచేస్తుంది. ముఖ్యంగా, ఇది శరీరానికి తక్షణ శక్తిని అందిస్తుంది. అయితే, చక్కెర వ్యాధిగ్రస్తులు తేనెను అధికంగా వాడటం మంచిది కాదు కాబట్టి, వారు వైద్యుల సలహా తీసుకోవడం లేదా దీనిని మినహాయించడం మంచిది. జీలకర్ర మన వంటింట్లో సంవత్సరం పొడవునా లభించే ఒక దివ్యమైన ఆహార ఔషధం. దీన్ని కొద్దిగా వేయించి పొడి చేసుకుంటే సరిపోతుంది. జీలకర్ర కూడా బరువు తగ్గడంలో, జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది.

# ఎండల్లో చలచల్లగా ఉంచే డ్రింక్స్



వేసవి తాపం నుంచి శరీరాన్ని కాపాడుకోవడానికి చాలా మంది నీటి శాతం ఎక్కువగా ఉండే కాలానుగుణ పండ్లు, ఆకుకూరలను తింటారు. అంతేకాకుండా కొన్ని పానీయాలను తీసుకోవడం ద్వారా కూడా వేసవి అలసటను కూడా తగ్గించుకోవచ్చని నిపుణులు అంటున్నారు. వేసవిలో తీవ్రమైన వేడి కారణంగా డీహైడ్రేషన్, అలసట, నీరసం, ఒళ్ళు నొప్పులు, వడదెబ్బ, జీర్ణ సమస్యలతో సహా అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. అందువల్ల ఈ సమయంలో ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల అదనపు శ్రద్ధ వహించాలి. కాబట్టి ఈ సమస్యల నుంచి శరీరాన్ని కాపాడుకోవడానికి చాలా మంది నీటి శాతం ఎక్కువగా ఉండే కాలానుగుణ పండ్లు, ఆకుకూరలను తింటారు. అంతేకాకుండా కొన్ని పానీయాలను తీసుకోవడం ద్వారా కూడా వేసవి అలసటను కూడా తగ్గించుకోవచ్చని నిపుణులు అంటున్నారు. వేసవిలో దాహాన్ని తీర్చడానికి నిమ్మ షర్బత్ ఒక మంచి మార్గం. దీనిలోని విటమిన్ సి, ఎలక్ట్రోలైట్లు తక్షణ శక్తిని అందించడంలో సహాయపడతాయి. అంతేకాకుండా పచ్చి మామిడితో చేసిన ఆమ్ పన్నాను కూడా తీసుకోవచ్చు. ఇందులో విటమిన్ ఎ, విటమిన్ సి, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరాన్ని చల్లబరచడమే కాకుండా వడదెబ్బ నుంచి రక్షించడంలో కూడా సహాయపడతాయి. వేసవిలో శరీరాన్ని చల్లబరచడానికి పుదీనా, దోసకాయతో చేసిన పానీయం తాగడం ఉత్తమం. ఈ రెండింటిలోనూ నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. ఇది శరీరాన్ని ఎక్కువ సేపు హైడ్రేటెడ్‌గా ఉంచడానికి సహాయపడుతుంది. ఇది శరీరానికి పోషణను అందించడమే కాకుండా వేడి నుంచి ఉపశమనాన్ని కూడా ఇస్తుంది. ఇందులో పొటాషియం, మెగ్నీషియం, యాంటీఆక్సిడెంట్లు వంటి అనేక ముఖ్యమైన మూలకాలు ఉంటాయి. ఇవి శరీరంలో ఎలక్ట్రోలైట్ సమతుల్యతను కాపాడటానికి సహాయపడతాయి. కాబట్టి వేసవిలో రోజుకు ఒకసారి కొబ్బరి నీళ్ళు తాగడం వల్ల శక్తి స్థాయిలను కాపాడుకోవడానికి సహాయపడుతుంది. వేసవి కాలంలో అత్యంత ప్రజాదరణ పొందిన పానీయాలలో చెరకు రసం ఒకటి. ఇందులో గ్లూకోజ్, కాల్షియం, మెగ్నీషియం, ఐరన్ వంటి అనేక ముఖ్యమైన ఖనిజాలు ఉంటాయి. ఇవి శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి. ఈ వేసవిలో మజ్జిగ తాగడం కూడా చాలా మంచిది. ఇది కడుపుకు చల్లదనాన్ని, తాజాదనాన్ని ఇస్తుంది. మజ్జిగ శరీరాన్ని చల్లబరచి, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఎసిడిటీ నుంచి ఉపశమనం కలిగిస్తుంది. వేసవిలో అత్యంత ముఖ్యమైన విషయం పుష్కలంగా నీళ్లు తాగడం మంచిది. ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి ప్రతిరోజూ సుమారు రెండున్నర నుంచి మూడు లీటర్ల నీళ్లు తాగాలి. శారీరక శ్రమ చేసేవారు ఇంకా ఎక్కువ నీళ్లు తాగాల్సి ఉంటుంది.

# సింపుల్ ట్రిక్స్‌తో చేదుగా ఉందో లేదో కనిపెట్టేయండి



కీరా దోసకాయలో ఉండే 'కుకుర్బిటాసిన్' అనే సహజ పదార్థం వల్ల అది చేదుగా మారుతుంది. మొక్కకు సరైన నీరు అందకపోయినా లేదా అధిక ఎండ తగిలినా ఈ పదార్థం పెరుగుతుంది. కొంచెం జాగ్రత్త వహిస్తే ఈ కింద చెప్పిన చిట్కాలతో తాజాగా, తియ్యగా ఉండే కీరాను మీరే గుర్తించవచ్చు. వేసవి కాలంలో శరీరాన్ని చల్లబరిచే అద్భుతమైన ఆహారం కీరా దోసకాయ. నీటి శాతం ఎక్కువగా ఉండటం వల్ల ఇది మనల్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది. అయితే, మార్కెట్ నుండి తెచ్చిన కీరా ఒక్కోసారి చేదుగా ఉండి మూడ్‌ని పాడు చేస్తుంది. పైన బాగానే కనిపించినా లోపల చేదుగా ఉండటానికి కారణం ఏమిటి? చేదు లేని కీరాను ఎలా ఎంచుకోవాలి కీరా కొనేటప్పుడు రంగు చాలా ముఖ్యం. ముదురు ఆకుపచ్చ రంగులో ఉండి, కాంతివంతంగా మెరుస్తున్న కీరాలు ఎప్పుడూ ఫ్రెష్‌గా ఉంటాయి. ఒకవేళ కీరా పసుపు రంగులోకి మారిపోయి కనిపిస్తే అది ఎక్కువగా పండిపోయిందని అర్థం. అలాంటి కీరాలు దాదాపు చేదుగానే ఉంటాయి. దచాలామంది పెద్దగా ఉన్న కీరా దోసకాయలను చూసి ఆకర్షితులవుతారు. కానీ, అతి పెద్ద కీరాల్లో గింజలు ఎక్కువగా ఉండి, రుచి తక్కువగా ఉంటుంది. అలాగని మరీ చిన్నవి కూడా అంత బాగుండవు. ఎప్పుడూ మధ్యస్థ సైజ్ కీరాలనే ఎంచుకోండి. ఇవి తినడానికి రుచిగా, గింజలు తక్కువగా ఉంటాయి. కీరా దోసకాయను చేతితో పట్టుకుని ఒకసారి నొక్కి చూడండి. మంచి కీరా ఎప్పుడూ గట్టిగా ఉంటుంది. మీరు నొక్కినప్పుడు అది మృదువుగా లేదా సాఫ్ట్‌గా అనిపిస్తే అది నిల్వ ఉన్నదని అర్థం. లోపల పాడైపోయి ఉండటం లేదా చేదుగా ఉండే అవకాశం ఇలాంటి వాటికి ఎక్కువగా ఉంటుంది. సూటిగా, స్మూత్‌గా ఉన్న కీరాలు రుచిగా ఉంటాయి. వంకరగా, అసమానంగా ఉన్న కీరాలు సరిగ్గా పెరగలేదని, అందువల్ల అవి చేదుగా ఉండొచ్చని గుర్తుంచుకోండి. అలాగే మరీ బరువుగా అనిపించే కీరాల్లో గింజలు నిండిపోయి ఉంటాయి. తేలికగా, ఫ్రెష్‌గా అనిపించే కీరాలే మేలు. కీరా దోసకాయ కొనేటప్పుడు ఈ చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే మీ డబ్బు వృథా కాదు. ఆకుపచ్చగా ఉండాలి, మధ్యస్థ సైజులో ఉండాలి, గట్టిగా ఉండాలి.. ఈ మూడు సూత్రాలు పాటిస్తే మీరు తియ్యని కీరాను ఆస్వాదించవచ్చు.

# ఇమ్యూనిటీ అమాంతం పెరిగిపోవాలా?



భారతీయ వంటింట్లో వెల్లుల్లి లేని వంటకాన్ని ఊహించలేము. కానీ దీన్ని కేవలం రుచి కోసమే కాకుండా, పరగడుపున ఒక ఔషధంగా తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు అమోఘం. ముఖ్యంగా వెల్లుల్లిని పచ్చిగా తిన్నప్పుడు విడుదలయ్యే 'అల్లిసిన్' అనే సమ్మేళనం మీ శరీరానికి రక్షణ కవచంలా పనిచేస్తుంది. చాలామంది వెల్లుల్లిని కూరల్లో వేసి ఉడికిస్తారు, కానీ అలా చేయడం వల్ల దానిలోని ఔషధ గుణాలు సగానికి పైగా నశిస్తాయి. మరి వెల్లుల్లి పూర్తి ప్రయోజనం మీకు అందాలంటే దాన్ని ఎలా సిద్ధం చేయాలి? ఖాళీ కడుపుతో తిన్నప్పుడు అది గుండెకు, లివర్ కు మెదడుకు ఎలా మేలు చేస్తుంది? ఎవరెవరు దీనికి దూరంగా ఉండాలి. లివర్ డిటాక్స్ (ఒతిలవతీ ఆవబినీలీ): వెల్లుల్లి లివర్ ఎంజైములను ఉత్తేజితం చేస్తుంది. ఇది శరీరంలోని విషతుల్యాలను మరియు భార లోహాలను బయటకు పంపి, రక్తాన్ని శుద్ధి చేస్తుంది. గుండె ఆరోగ్యం: క్రమం తప్పకుండా పచ్చి వెల్లుల్లి తినడం వల్ల రక్తపోటు (ఃఖ) తగ్గుతుంది చెడు కొలెస్ట్రాల్ అదుపులో ఉంటుంది. దీనివల్ల గుండె రక్తనాళాల్లో పూడికలు ఏర్పడవు. రోగనిరోధక శక్తి : ఇందులోని యాంటీ బ్యాక్టీరియల్ మరియు యాంటీ వైరల్ గుణాలు జలుబు, ఫ్లూ వంటి సాధారణ ఇన్ఫెక్షన్ల నుండి మిమ్మల్ని కాపాడతాయి. జీర్ణక్రియ మెరుగు: పరగడుపున వెల్లుల్లి తీసుకోవడం వల్ల జీర్ణ ఎంజైములు ప్రేరేపించబడతాయి. ఇది గ్యాస్, ఉబ్బరం మలబద్ధకం వంటి సమస్యలను తగ్గిస్తుంది. మెదడు పనితీరు: వెల్లుల్లిలోని యాంటీ ఆక్సిడెంట్లు మెదడు కణాల క్షీణతను అడ్డుకుంటాయి, దీనివల్ల అల్జీమర్స్ వంటి వ్యాధుల ముప్పు తగ్గుతుంది. క్రష్ చేసి 10 నిమిషాలు ఆగండి: వెల్లుల్లిని నలిపినప్పుడు లేదా కోసినప్పుడు గాలి తగిలి 'అల్లిసిన్' అనే రసాయనం తయారవుతుంది. కాబట్టి క్రష్ చేసిన 10 నిమిషాల తర్వాతే తినండి. పరగడుపున ఉత్తమం: ఉదయాన్నే ఖాళీ కడుపుతో తీసుకుంటే అల్లిసిన్ రక్తంలోకి త్వరగా శోషించబడుతుంది. సిడిటీ బాధితులు: అసిడిటీ, గ్యాస్ట్రిక్ లేదా కడుపులో మంట ఉన్నవారు పరగడుపున తింటే సమస్య పెరగవచ్చు. బ్లడ్ థిన్నర్స్: సర్జరీ కాబోయే వారు లేదా రక్తాన్ని పలచబరిచే మందులు వాడుతున్న వారు వెల్లుల్లి విషయంలో జాగ్రత్తగా ఉండాలి. చిన్న చిట్కా: వెల్లుల్లి ఘాటుగా ఉండి తినలేకపోతే, ఒక స్పూన్ తేనెతో కలిపి తీసుకోండి. ఇది బరువు తగ్గడానికి కూడా అద్భుతంగా పనిచేస్తుంది.

# ఉసిరి వీరికి విషంతో సమానం..!

ఆరోగ్య స్పృహ ఉన్నవారు చాలా మంది తమ ఉదయాన్ని గ్లాసుడు ఉసిరి రసంతో ప్రారంభిస్తారు. ఆయుర్వేదంలో ఉసిరితో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లకు నిలయమైన ఈ పండు, రోగనిరోధక శక్తిని పెంచడంలో అద్భుతంగా పనిచేస్తుంది. అయితే కొన్ని రకాల ఆరోగ్య సమస్యలు ఉన్నవారు ఉసిరి తీసుకోవడం ప్రాణాంతకమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఉసిరి సాధారణంగా చక్కెరను నియంత్రించడంలో సహాయపడుతుంది. కానీ ఇప్పటికే తక్కువ రక్త చక్కెర స్థాయిలు (హైపోగ్లైసీమియా) ఉన్నవారు దీనిని ఎక్కువగా తింటే ప్రమాదంలో పడతారు. ముఖ్యంగా మధుమేహం కోసం మందులు తీసుకుంటున్న వారికి చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పడిపోవడం తీవ్రమైన ప్రమాదాలకు దారితీస్తుంది. ఉసిరిలో పొటాషియం, ఆక్సలేట్ పుష్కలంగా ఉంటాయి. మూత్రపిండాల్లో రాళ్ల సమస్యలు ఉన్నవారికి లేదా దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధులతో బాధపడుతున్నవారికి ఈ పండు చాలా ప్రమాదకరం. ఆక్సలేట్ రాళ్లు ఏర్పడే ధోరణిని మరింత పెంచుతుంది. ఇది పరిస్థితిని మరింత క్లిష్టతరం చేస్తుంది. అలాగే శస్త్రచికిత్స జరిగినవారు లేదా జరగబోయేవారు ఉసిరికాయకు దూరంగా ఉండటం ఉత్తమం. ఉసిరికాయ రక్తం గడ్డకట్టడాన్ని నిరోధిస్తుందని అధ్యయనాలు వెల్లడించాయి. దీని ఫలితంగా శస్త్రచికిత్స సమయంలో అధిక రక్తస్రావం అయ్యే ప్రమాదం పెరుగుతుంది. వైద్యుల ప్రకారం ఏదైనా శస్త్రచికిత్సకు కనీసం రెండు వారాల ముందు ఉసిరికాయ తినడం మానేయాలి. ఉసిరి పుల్లగా, ఆమ్ల స్వభావం కలిగి ఉంటుంది. గుండెల్లో మంట లేదా జీర్ణాశయ సమస్యలతో బాధపడేవారు ఖాళీ కడుపుతో ఉసిరి తినడం వల్ల అసౌకర్యం పెరుగుతుంది. ఇందులో ఉండే పీచుపదార్థం జీర్ణక్రియకు సహాయపడినప్పటికీ, కడుపులో పుండ్లతో బాధపడేవారికి దీనిలోని అధిక ఆమ్లం బాధాకరంగా ఉంటుంది. ఉసిరి కాలేయాన్ని శుభ్రంగా ఉంచడానికి సహాయపడుతుంది. కానీ దీనిని అల్లం లేదా మిరియాలతో కలిపి తీసుకోవడం వల్ల కాలేయ ఎంజైమ్‌లపై అదనపు ఒత్తిడి పడుతుంది. దీర్ఘకాలంలో ఇది కాలేయ పనితీరును తగ్గించగలదని నిపుణులు భావిస్తున్నారు.

## సిద్ధం కానీ చిన్నస్వామి స్టేడియం.. ఆర్సీబీ VS ఎస్ఆర్‌హెచ్ మ్యాచ్ జరిగేది డౌటే!




**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ ( ఐపీఎల్) 2026 సీజన్ కేవలం రెండు రోజుల్లో ప్రారంభం కానుంది. మార్చి 28వ తేదీన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వర్సెస్ సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య జరగాల్సిన తొలి మ్యాచ్‌కు వేదికైన ఎం. చిన్నస్వామి స్టేడియం ఇంకా సిద్ధం కాలేదని సమాచారం. ఈఎస్‌పీఎన్ క్రిక్‌ఇన్ఫో నివేదిక ప్రకారం.. ఈ మ్యాచ్‌కు కేవలం రెండే రోజుల సమయం మాత్రమే ఉన్నా, స్టేడియం ఇంకా 'నిర్మాణ ప్రాంతం'లా కనిపిస్తోంది. మైదానం సిద్ధంగా ఉన్నప్పటికీ, స్టేడియం లోపల వడ్రంగులు, మేస్త్రీలు, కాంట్రాక్టర్లు ఇంకా పనులు చేస్తున్నట్లు తెలుస్తుంది. గ్రౌండ్ ప్రవేశ ద్వారాల దగ్గర ప్లైవుడ్ షీట్లు, నిర్మాణ సామాగ్రి చెల్లాచెదురుగా పడి ఉండటం కనిపిస్తున్నాయి. గతేడాది జూన్ 4వ తేదీన జరిగిన తొక్కిసలాటలో 11 మంది మరణించడంతో, కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ (KSCA) ఫ్యాన్ సెక్షన్లు, ఎగ్జిట్ పాయింట్ల వద్ద భారీగా మార్పులు చేపట్టింది. వాస్తవానికి ఈ పనులన్నీ మార్చి 15వ తేదీ నాటికే పూర్తి కావాల్సి ఉంది. కానీ, మౌలిక సదుపాయాల మెరుగుదల కోసం చేసిన మార్పుల వల్ల ఇంకా పనులు జరుగుతున్నాయి. గత నాలుగు రోజులుగా మేము నిద్ర కూడా పోలేదని అక్కడ పని చేస్తున్న కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బెంగళూరులో జరిగిన విషాద ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి గౌరవార్థం, ఈ ఏడాది ఐపీఎల్ ప్రారంభ వేడుకలను రద్దు చేస్తున్నట్లు బీసీసీఐ అధికారికంగా ప్రకటించింది. కానీ మే 31వ తేదీన జరిగే ఫైనల్ రోజున గ్రాండ్ క్లోజింగ్ సెర్మనీని నిర్వహించాలని ప్లాన్ చేస్తున్నామని బోర్డు కార్యదర్శి దేవజిత్ సైకియా తెలిపారు. ఒకవైపు నిమిషాల వ్యవధిలోనే టిక్కెట్లు అమ్ముడైపోగా, మరోవైపు స్టేడియం పనులు ఇంకా పూర్తికాకపోవడంతో అభిమానుల్లో ఆందోళన నెలకొంది. మార్చి 28వ తేదీన జరగబోయే మ్యాచ్ సమయానికి స్టేడియం పూర్తిగా ముస్తాబవుతుందా లేదా అన్నది ఇప్పుడు ఉత్కంఠగా మారింది.

# టైటిల్ వేటలో సన్‌రైజర్స్ హైదరాబాద్.. జట్టు బలం, బలహీనతలు ఇవే



**హైదరాబాద్ పెన్ పవర్:** మరో రెండు రోజుల్లో ప్రారంభమయ్యే ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ మరో టైటిల్‌పై గురి పెట్టింది. చివరగా డేవిడ్ వార్నర్ కెప్టెన్సీలో 2016లో ఎస్ఆర్‌హెచ్ టైటిల్ అందుకుంది. అనంతరం 2018, 2024 సీజన్లలో ఫైనల్ వరకు వెళ్లినా విజేతగా నిలవలేదు.. గతేడాది పేలవ ప్రదర్శనతో 6వ స్థానంతో సరిపెట్టుకుంది. ఈ సారైనా మెరుగైన ప్రదర్శనతో టైటిల్ కొట్టాలనే కసితో ఉంది. ఫిట్‌నెస్ సమస్యలతో ప్యాట్ కమిన్స్ ఆరంభ మ్యాచ్‌లకు దూరం కావడంతో టీమ్ కి గట్టి షాక్ తగిలింది. విధ్వంసకరమైన బ్యాటింగ్ ఉన్నా, బౌలింగ్ విభాగం మాత్రం బలహీనంగా కనిపిస్తుంది. కమిన్స్ లేని లోటును తీర్చే బౌలర్ ఎవరు కనిపించడం లేదు?.. అంతేకాకుండా వేలంలోకి వదిలేసిన మహమ్మద్ షమీ స్థానాన్ని భర్తీ చేసే పేసర్ ఎవరనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిలిగిపోయింది.

సన్‌రైజర్స్ హైదరాబాద్ 250ం పరుగులు చేసినా మ్యాచ్ గెలిచే ప్రసక్తి లేదని మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా ఇప్పటికే చెప్పాడు. విధ్వంసకర బ్యాటర్లు జట్టులో ఉంటే, ఆల్‌టైమ్ రికార్డు స్కోర్లు నమోదు అవుతాయి.. కానీ జట్టు గెలుస్తుందా? అంటే చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. గత ఎడిషన్‌లోనూ పేలవ బౌలింగ్ సన్‌రైజర్స్ విజయవకాశాలను బాగా దెబ్బతీసింది. ప్రాక్టీస్‌లో ఆరెంజ్ ఆర్మీ బ్యాటర్లే దూకుడుగా ఆడి బౌలర్ల ఆత్మవిశ్వాసాన్ని పూర్తిగా దెబ్బతీస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతుంది. ఈ క్రమంలోనే దూకుడే జట్టుకు బలం, బలహీనతగా మారిందనే టాక్ వినిపిస్తుంది. గత సీజన్లలో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్లాట్ పిచ్‌లపై ఆడిన మ్యాచ్‌ల్లో విజయం సాధించినా.. స్లో వికెట్స్‌పై దారుణంగా ఓడింది. కాస్త నెమ్మదిగా ఉన్న పిచ్‌పై ఎస్ ఆర్ హెచ్ బ్యాటర్లు విఫలం కాగా, బౌలర్లు పూర్తిగా చేతులెత్తేస్తున్నారు.

ఈ సమస్యను అధిగమించేందుకే సన్‌రైజర్స్ హైదరాబాద్ యువ బౌలర్లను మినీ వేలంలో దక్కించుకుంది. స్మరణ్ రవిచంద్రన్, హర్ష్ దూబె, శివాంగ్ కుమార్, ప్రఫుల్ హింగె, శివమ్ మావి, సకిబ్ హుస్సేన్, క్రైనిస్ ఫులెట్రా వంటి వారిని కొనుగోలు చేసింది. కానీ ఇందులో మెజార్టీ ప్లేయర్స్ కి ఒక్క ఐపీఎల్ మ్యాచ్ ఆడిన అనుభవం కూడా లేదు. వీళ్లలో ఏ ఇద్దరు అసాధారణ ప్రదర్శన చేసినా సన్‌రైజర్స్ బౌలింగ్ కష్టాలు తీరిపోయినట్లే.. లేదంటే ఈసారి కూడా జట్టు ప్లే ఆఫ్స్ చేరకుండా కష్టమే అని చెప్పాలి.

## సొంతగడ్డపై టీమిండియా 2026-27 షెడ్యూల్ ఇదిగో... హైదరాబాద్‌లో రెండు మ్యాచ్‌లు



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ అభిమానులకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) శుభవార్త అందించింది. 2026–27 సీజన్‌కు సంబంధించి టీమిండియా స్వదేశంలో ఆడనున్న అంతర్జాతీయ మ్యాచ్‌ల పూర్తి షెడ్యూల్‌ను గురువారం ప్రకటించింది. ఈ సీజన్‌లో వెస్టిండీస్, శ్రీలంక, జింబాబ్వే, ఆస్ట్రేలియా జట్లు భారత్‌లో పర్యటించనున్నాయి. దేశవ్యాప్తంగా మొత్తం 17 నగరాల్లో 22 అంతర్జాతీయ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ షెడ్యూల్‌లో కొన్ని ప్రత్యేకతలు కూడా ఉన్నాయి. అక్టోబర్ 2024 తర్వాత తొలిసారిగా బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం అంతర్జాతీయ మ్యాచ్‌కు ఆతిథ్యం ఇవ్వనుంది. అలాగే, ప్రతిష్టాత్మక బోర్డర్–గవాస్కర్ ట్రోఫీలో భాగంగా గౌహతిలోని బర్సపరా స్టేడియం మొదటిసారి ఒక టెస్ట్ మ్యాచ్ నిర్వహించనుంది.

షెడ్యూల్ వివరాల్లోకి వెళ్తే, ఈ హోమ్ సీజన్ వెస్టిండీస్ పర్యటనతో ప్రారంభమవుతుంది. సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 17 వరకు జరిగే ఈ టూర్‌లో మూడు వన్డేలు, ఐదు టీ20లు ఉంటాయి. వన్డేలకు త్రివేండ్రం, గౌహతి, న్యూ చండీగఢ్ ఆతిథ్యం ఇస్తుండగా.. లక్నో, రాంచీ, ఇండోర్, హైదరాబాద్, బెంగళూరు నగరాలు టీ20 మ్యాచ్‌లకు వేదికలుగా నిలవనున్నాయి.

ఆ తర్వాత, డిసెంబర్‌లో శ్రీలంక జట్టు భారత్‌లో పర్యటిస్తుంది. డిసెంబర్ 13 నుంచి 27 వరకు జరిగే ఈ సిరీస్‌లో మూడు వన్డేలు, మూడు టీ20లు ఉంటాయి. వన్డేలు ఢిల్లీ, బెంగళూరు, అహ్మదాబాద్‌లలో జరగనుండగా.. రాజ్‌కోట్, కటక్, పుణేలలో టీ20 మ్యాచ్‌లు నిర్వహిస్తారు.

కొత్త ఏడాది ఆరంభంలో, జనవరి 3 నుంచి 9 వరకు జింబాబ్వే జట్టు భారత్‌లో పర్యటించి మూడు వన్డేల సిరీస్ ఆడనుంది. ఈ మ్యాచ్‌లకు కోల్‌కతా, హైదరాబాద్, ముంబై నగరాలు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. దీంతో హైదరాబాద్ నగరానికి ఈ సీజన్‌లో రెండు అంతర్జాతీయ మ్యాచ్‌లు దక్కినట్లయింది. ఈ సీజన్‌కు ప్రధాన ఆకర్షణగా, అభిమానులు ఎంతగానో ఎదురుచూసే బోర్డర్–గవాస్కర్ ట్రోఫీ నిలవనుంది. జనవరి 21 నుంచి మార్చి 3 వరకు ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల సిరీస్ జరగనుంది. నాగ్‌పూర్‌లో తొలి టెస్టు ప్రారంభం కానుండగా, ఆ తర్వాత చెన్నై, గౌహతి, రాంచీ, అహ్మదాబాద్‌లలో మిగిలిన మ్యాచ్‌లు జరుగుతాయి. ప్రపంచంలోని రెండు అగ్రశ్రేణి జట్ల మధ్య జరిగే ఈ సిరీస్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సుదీర్ఘ షెడ్యూల్ దేశంలోని క్రికెట్ అభిమానులకు అసలైన పండగను తీసుకురానుంది.



నేహా శెట్టి పీచ్ చీరలో టైమ్‌లెస్ గాంభీర్యంతో స్టన్ చేసింది

# పెద్ది చుట్టూ మూడు 'సవాళ్లు'.. ఏం జరుగుతుందో?



టాలీవుడ్ మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం నటిస్తున్న భారీ చిత్రం పెద్ది విడుదలకు సిద్ధమవుతున్న వేళ.. ఆ సినిమాపై ప్రస్తుత పరిస్థితుల ప్రభావం ఎలా ఉంటుందన్నది ఇప్పుడు సోషల్ మీడియాలో ఆసక్తికర చర్చగా మారింది. ముఖ్యంగా ఏప్రిల్ 30న విడుదల నేపథ్యంలో మూడు విషయాలు ఆ చిత్రానికి సవాళ్లుగా నిలుస్తున్నాయని టాక్ వినిపిస్తోంది. అసలేమైంది? అవేంటి?

మొదటిది.. మిడిల్ ఈస్ట్ లో కొనసాగుతున్న ఇజ్రాయెల్– అమెరికా– ఇరాన్ ఉద్రిక్తతల ప్రభావం. యుద్ధ వాతావరణం కారణంగా ఇంటర్నేషనల్ మార్కెట్ లో క్రూడ్ ఆయిల్ ధరలు పెరుగుతున్నాయి. దీంతో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగే అవకాశం ఉంది. అందుకే రవాణా ఖర్చులు పెరగడం వల్ల సినిమా థియేటర్లకు వచ్చే ప్రేక్షకుల సంఖ్యపై ప్రభావం పడే అవకాశం ఉందని టాక్ వినిపిస్తోంది.ఇదే పరిస్థితి నెల రోజులు కొనసాగితే, పెద్ది సినిమా థియేట్రికల్ కలెక్షన్లపై కూడా ఆ ఎఫెక్ట్ పడొచ్చని అంచనాలు వెలువడుతున్నాయి. అదే సమయంలో రెండో సవాల్ విషయానికొస్తే.. బాలీవుడ్ చిత్రం ధురంధర్ 2. బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచిన ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద సత్తా చాటుతోంది. వరల్డ్ వైడ్ గా భారీ వసూళ్లు సాధిస్తూ, ప్రేక్షకులను థియేటర్లకు ఆకర్షిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రేక్షకుల ఖర్చు సామర్థ్యం తగ్గే అవకాశం ఉంది.ఫిబ్రవరిలో సంక్రాంతి సినిమాలపై భారీగా ఖర్చు చేసిన ప్రేక్షకులు తర్వాత కొంత కాలం సినిమాలకు దూరంగా ఉన్నట్లు, ఇప్పుడు కూడా అదే పరిస్థితి ఏర్పడవచ్చని టాక్ వినిపిస్తోంది. అదే సమయంలో బ్యాండ్ మేళం, డెకాయిట్, బైకర్, స్వయంభూ వంటి చిన్న, మీడియం రేంజ్ చిత్రాలు కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటే, ఏప్రిల్ చివరికి ప్రేక్షకుల ఖర్చు కోసం ఆలోచించే అవకాశం ఉంది.ముఖ్యంగా ఇప్పుడు మూడో సవాల్.. ఐపీఎల్. ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా ఆ టోర్నీ క్రేజ్ హై లెవెల్ లో ఉంటుంది. ముఖ్యంగా ఆర్సీబీ, రాజస్థాన్ జట్లు కొత్త యజమానులతో భారీగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. ఈ రెండు ఫ్రాంచైజీలు భారీ మొత్తంలో పెట్టుబడి పెట్టి, తమ జట్లను మరింత అట్రాక్టివ్ గా మార్చే ప్రయత్నంలో ఉన్నాయి. దీంతో ప్రేక్షకుల దృష్టి ఎక్కువగా క్రికెట్ పైనే ఉంటోంది.టెలివిజన్, డిజిటల్ ప్లాట్ ఫామ్స్ లో ఐపీఎల్ మ్యాచ్ లు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుండటంతో, సినిమాలకు తగిన స్పేస్ దక్కకపోవచ్చని ప్రచారం జరుగుతోంది. అలా మూడు సవాళ్ల మధ్య పెద్ది రిలీజ్ అవుతోంది. అయినప్పటికీ రామ్ చరణ్ స్టార్ డమ్, సినిమాపై ఉన్న అంచనాలు, కంటెంట్.. అన్నీ కలిసి ఆ అడ్డంకులను అధిగమించగలవా అన్నది ఇప్పుడు కీలక ప్రశ్నగా మారింది. పెద్ది ఎలా రాణిస్తుందోననేది హాట్ టాపిక్ గా మారింది. ప్రేక్షకుల రెస్పాన్స్, మౌత్ టాక్, ఓపెనింగ్ కలెక్షన్లే సినిమా ఫ్యూచర్ ను డిసైడ్ చేయనున్నాయనే చెప్పాలి.



ప్రియాంక జవాల్కర్ గోల్డెన్ అవర్ గ్లామ్ లుక్‌లో మెరిసింది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965